


న్యూస్-9®
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
news9telengana@gmail.com www.news9-india.com

సంపుటి : 19 | సంచిక : 26 వెల : 4 బుధవారం 08 జనవరి 2025 www.news9-india.com హైదరాబాద్ | విశాఖపట్నం పేజీలు : 12




# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా..

## ఫిబ్రవరి 5న ఒకే విడతలో పోలింగ్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగు స్తుండటంతో ఆలోపే నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది.ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిం చనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్



విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం

చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు.ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు .ఈవీ ఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు.

# మాజీ సీఎం కేసీఆర్‌కు రైతు భరోసా..

## 200 ఎకరాలకూ.. మంత్రి కీలక ప్రకటన

**హైదరాబాద్** :బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కూడా రైతు భరోసా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయనకున్న 200 ఎకరాలు సాగు చేస్తే పెట్టుబడి సాయం అంది స్తామని మంత్రి కీలక ప్రకటన చేశారు. వరంగల్



అభివృద్ధిపై మంత్రులు పొ న్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొంగులేటి.. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకం అమలుకు రేవంత్ రెడ్డి సర్కార్ ముహూర్తం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా.. రైతు భరోసా అమలుకు సంబంధించి విధివిధానాలు, మార్గదర్శకాలపై ప్రజల్లో గందరగోళం నెలకొందంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరణ ఇచ్చారు. వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించాకే రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతులకు వేలునిర్ణయించామన్నారు.

# ఫార్ములా-ఈ కేసులో సుప్రీంకోర్టుకు కేటీఆర్..



**హైదరాబాద్** :ఫార్ములా-ఈ కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ తనపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును కేటీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో కేటీఆర్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు పిటిషన్ వేశారు. ఏసీబీ తనపై తప్పుడు కేసు పెట్టిందని.. దాన్ని క్వాష్ చేయాలంటూ కేటీఆర్ హైకోర్టును కోరగా.. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు.. క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పును వెల్లడించింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉప సంహరించింది. ఈ క్రమంలో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పుపై ఇప్పటికే లీగల్ టీమ్‌తో చర్చలు జరిపారు. మరో వైపు ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియెట్ పిటిషన్ దాఖలు చేసింది.

# హైదరాబాద్‌తో దీటుగా వరంగల్

## అభివృద్ధి మంత్రి పొంగులేటి

**హైదరాబాద్** : హైదరాబాద్‌కు సమానంగా వరంగల్ అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ , సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరంగల్ ప్రాముఖ్యతను సీఎం రేవంత్ రెడ్డి గుర్తించారన్నారు.హైదరాబాద్ స్థాయిలో వరంగల్ హైదరాబాద్ స్థాయిలో వరంగల్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే సీఎం రేవంత్ రెడ్డి రెండు పర్యాయాలు వరంగల్ పట్టణానికి వచ్చారని పొంగులేటి గుర్తుచేశారు. మొదటిసారి పర్యటన సందర్భంగా చేయాల్సిన అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. ఎయిర్ పోర్ట్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్,



కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నాకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. రెండో పర్యాయం వచ్చినప్పుడు అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, రూ. ఆరు వేల కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. 2041 మాస్టర్ ప్లాన్ మంజూరు చేయడం జరిగిందని, భద్రకాళి చెరువు పూడికతీత, వివిధ అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన టెండర్లు పిలిచామని పొంగులేటి పేర్కొన్నారు.
ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత వరంగల్ పట్టణం వరంగల్ ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి హైదరాబాద్ తర్వాత హైదరాబాద్ కు సమానంగా పాత వరంగల్ పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి ఆలోచన,దానికి అనుగుణంగా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే సీఎం రెండు పర్యాయాలు వరంగల్ ఈ సంవత్సరం తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రానున్న నాలుగు చేశారు.

# సింగరేణి క్యాలెండర్ ను ఆవిష్కరించిన

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్** : సింగరేణి సంస్థ గత ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా రూపొందించిన కొత్త క్యాలెండర్ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్ సంస్థ విశిష్టతను మాత్రమే కాకుండా, ఉద్యోగుల శ్రేయస్సు కోసం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందరితో పంచుకోవాలనే లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రజా భవన్లో నేటి ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సింగరేణి సంస్థను




అన్ని రంగాల్లోకి విస్తరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు, సంస్థ ఆధ్వర్యంలో అనేక వినూత్న కార్యాచరణలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కేవలం బొగ్గు ఉత్పత్తుల వరకు మాత్రమే పరిమితం కాకుండా సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, థర్మల్ విద్యుత్ రంగం, క్రిటికల్ మినరల్స్ మైనింగ్ తదితర రంగాల్లోకి విస్తరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంక్షేమాన్ని, గత ఏడాదిగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో క్యాలెండర్ను రూపొందించినట్లు వివరించారు.

### బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీ భవన్

# పునాదులు కూడా మిగలవు

## : బండి సంజయ్



**హైదరాబాద్** : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మంది కార్యకర్తలొచ్చి దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు.రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? పిల్లలు, వృద్ధులకు రాళ్ల తగిలితే పరిస్థితి ఏ విధంగా ఉండేదా తెలియదా? అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్ద న్నారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే దాడికి పాల్పడ్డ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.కాగా, చేశారు.

# హైదరాబాద్‌కు మరో భారీ సంస్థ..

## రూ.1000 కోట్లతో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రం



**హైదరాబాద్** :నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు మరో దిగ్గజ సంస్థ ముందుకొచ్చింది. నగరంలో రూ. 1000 కోట్ల పెట్టుబడితో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తామని పీటీడబ్ల్యూ గ్రూప్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమై చర్చించారు.హైలైట్:హైదరాబాద్‌కు మరో భారీ సంస్థరూ.1000 కోట్లతో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రంఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ ప్రతినిధుల భేటీహైదరాబాద్ నగరంలో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, టీసీఎస్, విప్రో వంటి దిగ్గజ ఐటీ సంస్థలతో పాటు..పట్టాయి.

# రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు జమ..

## అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు

**హైదరాబాద్** :తెలంగాణలో రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విష యం తెలిసిందే. ఈనెల 26వ తేదీ నుంచి అర్హులైన రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పారు. అయితే తాజాగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు వేగవంతం చేయా లని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అధి,కారులకు ఆదేశాలు జారీ చేశారు. తాజాగా సమీక్ష నిర్వహించిన మంత్రి.. పరిష్కారాల్లో జాప్యంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.తెలంగాణలో రైతులు గత ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకం త్వరలోనే అమలు చేస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. శనివారం నిర్వహించిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం తర్వాత.. జనవరి 26వ తేదీ




నుంచి రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో రైతు భరోసా పథకం అమలుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతను గుర్తించి.. అధికారులు అంతా పనిచేయాలని మంత్రి తుమ్మల సూచించారు. రైతులు, ప్రజా ప్రతినిధుల, మంత్రుల నుంచి వచ్చే విజ్ఞప్తులను సత్వరమే పరిశీలించి వాటిపై సరైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారంలో జరిగిన జాప్యం పట్ల అధికారులపై తుమ్మల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుల మేలు కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కల్పించేలా వ్యవసాయ యాంత్రికరణను, సూక్ష్మ సేద్య పరికరాలకు తెలిపారు.

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# నూతన బస్సు స్టేజి షెల్టర్ ను ప్రారంభించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**మంథని, చేరాలరవీందర్ నేత, జనవరి -07 (న్యూస్ 9):** మంథని మండలం బట్టుపల్లి గ్రామంలో కీర్తిశేషులు గూడెల్లి వీరేశం గారి జ్ఞాపకారంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన బస్సు స్టేజి షెల్టర్ను మంగళవారం వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు. కీర్తిశేషులు వీరేశం గారి భార్యను శాలువాతో మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రసాద్, రావికంటి సతీష్, స్వామి, కాంగ్రేస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**మంథని / పెద్దపల్లి, చేరాలరవీందర్ నేత, జనవరి-7 (న్యూస్ 9):** మంథని నియోజకవర్గ, కమాన్ పూర్ మండలంలోని పేరపల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రవణ్ కుమార్ ఇటీవల మృతి చెందగా సదరు బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడు శ్రవణ్ కుమార్ చిత్ర పటం వద్ద పూల మాల వేసి నివాళు లు అర్పించారు. ఆయన వెంట కమాన్ పూర్ మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, బీ. ఆర్. ఎస్ నాయకులు తోడేటి రాజీర్, ఆకుల కుమార్, తోడేటి రవి, జంజర్ల అనిల్, బోగే తిరుపతి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి చిత్రపటానికి నివాళులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**మంథని, చేరాలరవీందర్, జనవరి -07(న్యూస్ 9):** మంథని నియోజకవర్గం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం లోని కొయ్యూరు గ్రామానికి చెందిన బొమ్మ వీరమ్మ ఇటీవల గుండెపోటుతో మరణించింది. మంగళవారం వీరమ్మ భర్త మల్లారెడ్డి , వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. వీరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్. ఆయన వెంట కుంభం రాఘవరెడ్డి, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

# క్రైస్తవ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

### ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్



**మంథని, చేరాలరవీందర్ నేత, జనవరి-07 (న్యూస్ 9):** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్య ంలో ముద్రించిన క్రైస్తవ క్యాలెండర్ ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. మంథని పట్టణంలో మంగళవారం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... క్రైస్తవులు సమాజంలో శాంతి కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రు రమాదేవి, టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటి మెంబెర్ కాచే శశిభూషణ్,సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కౌన్సిలర్స్,శ్రీపతి బాణయ్య, కొట్టె రమేష్ పటేల్, ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా (ఐఎంఐ) ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, సీయోను ప్రార్థన మందిరం సంఘ పెద్దలు ఎంకే జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, రామగిరి కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడిప్రవేశ పరీక్ష ప్రకటన



**కల్వకుర్తి:** తెలంగాణ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలసంస్థ, గురుకులపాఠశాలలో 5తరగతి చదువుటకై-2025-26 విద్యాసంవత్సరానికి ఉమ్మడిప్రవేశ పరీక్ష ప్రకటన వెలువడిందికావున తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు అభివృద్ధి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యనుఅందిస్తూ వారిలో సహజ సిద్ధమైన నైపుణ్యాలను వెలికితీస్తూ ఆవిద్యార్థులకు 21శతాబ్దపు సవాలను ఎదుర్కోవడానికి సిద్ధంచేస్తుంది. ఈ లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు జనరల్ గురుకుల పాఠశాలను సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పింది. ఇంగ్లీష్ మీడియంలో విజయవంతంగా నడుస్తున్న ఈగురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశమునకై తేదీ 23-02-2025నాడు ఉదయం11గంటలనుండిమధ్యాహ్నం1గంటల వరకుఅన్ని జిల్లాలలో ప్రవేశపరీక్ష నిర్వహించబడును కావునఅర్హులైనఅభ్యర్థులు తేదీ21-12-2024నుండి 01-02-2025వరకు ఆన్లైన్లో అప్లికేషన్ చేసుకోగలరని తెలియజేస్తూ మరింత సమాచారంకొరకై %స్త్రషతీవఱం%వెబ్ సైట్ ను సంప్రదించగలరు ముఖ్యంగా గ్రామాలలో ఉండే నిరుపేద నిరక్షరాశులకుటుంబాలలో చదువుకునే పిల్లలకు ఈవిషయాన్ని తెలియజేయగలరు.

# స్త్రీ నిధి రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జల్దా అరుణశ్రీ




**పెద్దపల్లి,చేరాలరవీందర్ నేత, జనవరి -07 ( న్యూస్ 9):** స్త్రీ నిధి రుణాలను వినియోగించుకుని మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
పేద మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వం స్త్రీ నిధి సంస్థ ఏర్పాటు చేసిందని, మహిళలు స్త్రీ నిధి రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని, మైక్రో ఫైనాన్స్ సంస్థల ద్వారా ఇచ్చే అధిక వడ్డీ రుణాలకు దూరంగా ఉండాలని అన్నారు. మహిళా సంఘ సభ్యులకు స్త్రీ నిధి సంస్థ ద్వారా రుణాలను అందించే విధంగా స్త్రీ నిధి సిబ్బంది, మెప్మా సిబ్బంది చూడాలని, ప్రతి సంఘ సభ్యురాలు జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలని, సమాఖ్య సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి పొదుపు రుణాల రికవరీ 100 శాతం జరిగేలా చూడాలని, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు రుణాలను అందించే సంఘ సభ్యులు ఆర్థిక సుస్థిర జీవనోపాదులు పెంపొందించాలని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి సుల్తానాబాద్, మంథని పట్టణ ప్రాంతాలలో మొత్తం 213 మహిళ సమాఖ్యుల కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు 6 కోట్ల 11 లక్షల రుణాలను స్త్రీ నిధి ద్వారా అందించడం జరిగిందని అన్నారు.రామగుండం పట్టణ సమాఖ్యలో 13 సంవత్సరాల తర్వాత స్త్రీ నిధి రుణాలు అందుబాటులోకి తెచ్చామని, రామగుండం సమాఖ్య సభ్యులందరూ రుణాలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.3 లక్షల సౌభాగ్య రుణంతో కిరాణా షాపు పెద్దపల్లి పట్టణ మహిళ సమాఖ్య లోని సి. హెచ్ స్వతంత్ర భారతి స్త్రీ నిధి ద్వారా 3 లక్షల రూపాయల సౌభాగ్య రుణం పొంది కిరాణా షాపు పెట్టుకున్నామని, కిరాణా షాపుతో జీవన విధానం మెరుగుపడిందని, తక్కువ వడ్డీకి రుణం మంజూరు చేసిన స్త్రీ నిధి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. బోటిక్ టైలరింగ్ జీవనోపాధి సుల్తానాబాద్ మహిళా పట్టణ సమాఖ్య చెందిన కొండా రాధా శ్రీనిధి సంస్థ ద్వారా మూడు లక్షల రూపాయల సౌభాగ్య రుణం పొంది బోటెక్ / టైలరింగ్ జీవనోపాధి పెట్టుకోవడం జరిగిందని, దీని వల్ల కుటుంబ ఆర్థిక అవసరాల తీరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.13 సంవత్సరాల తర్వాత రామగుండం పట్టణ మహిళా సమాఖ్యలో స్త్రీ నిధి రుణాలు
రామగుండం పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు లతా మోహన్ అధికారుల చొరువతో 13 సంవత్సరాల తర్వాత ఈ ఆర్థిక సంవత్సరంలో స్త్రీ నిధి రుణాలు అందించడం ప్రారంభించారని, దీనివల్ల మైక్రో ఫైనాన్స్ సంస్థలకు రుణాల కోసం వెళ్లడం లేదని, అతి తక్కువ వడ్డీకి స్త్రీ నిధి రుణాలు లభించడం చాలా సంతోషంగా ఉందని, స్త్రీ నిధి రుణాలు అందించడంలో చొరువ చూపించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ కి, ఇతర అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు

**మంథని పట్టణానికి రింగ్ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు...**
**6 నెలలో పురపాలక కార్యాలయం పూర్తి చేయాలి...**
**24 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు...**
**ఐటి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**మంథని,చేరాలరవీందర్ నేత జనవరి -07( న్యూస్ 9):** మంథని పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు.
మంగళవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు మంథని లో పలు అభివృద్ధి పనుల కు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి మంథని పట్టణంలో పర్యటించి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 24 కోట్ల



5 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,.... పట్టణంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 30 కోట్లతో రోడ్లు, డ్రైయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. మంగళవారం పురపాలక కార్యాలయం, డంపింగ్ యార్డ్ నందు సేగ్రిగేషన్ షెడ్, కంపోస్ట్ షెడ్, ఆఫీసు రూమ్ సెక్యూరిటీ రూమ్ ,టాయిలెట్స్, వేయింగ్ బ్రిడ్జ్ పెద్దపల్లి, గోదావరిఖని, కాటారం నుండి మంథని పట్టణానికి వచ్చే రొడ్డు ప్రారంభంలో ఆర్చిలను 9 కోట్ల 20 లక్షలతో చేపట్టామని అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ



బస్సు డిపో శ్రీరామ్ నగర్ నుంచి మాత శిశువు హాస్పిటల్ , పోచమ్మ వాడ నుంచి గోదావరిఖని క్రాస్ రోడ్ , లైన్ గడ్డ, గంగాపురి క్రాస్ రోడ్, గిట్ల రమణారెడ్డి విగ్రహం, కూచి రాజు పల్లి క్రాస్ రోడ్ వద్ద 6 కోట్ల 71 లక్షలతో సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు.
పట్టణంలో సమీకృత వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణం, వివిధ వార్డులలో సిసి రోడ్లు, సైడ్ డ్రైయిన్ నిర్మాణ పనులను 8 కోట్ల 14 లక్షలతో మంజూరు చేసి పనులు ప్రారంభించామని అన్నారు. ఈరోజు మొత్తం పట్టణంలో 24 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు.6 నెలల కాలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలని మంత్రి అధికారులకు సూచించారు. గత 10 సంవత్సరాలలో మంథని ప్రాంతం ఆశించిన అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి సహచర మంత్రుల సహకారంతో మంథని నుంచి మంచిర్యాలను కనెక్ట్ చేస్తూ 140 కోట్లతో గోదావరి నదిపై బ్రిడ్జి మంజూరు చేసుకున్నామని, అదే విధంగా మంథని పట్టణానికి రింగ్ రొడ్డు నిర్మాణం వల్ల పట్టణ విస్తరణ పెరుగుతుందని మంత్రి తెలిపారు.మంథని పట్టణ విస్తరణ జరుగడం వల్ల దేశ విదేశాలలో ఇతర ప్రాంతాలలో స్థిర పడిన ప్రజలు సొంత గ్రామాలలో ఇండ్లు నిర్మించుకునేందుకు, ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంటుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రోడ్ల అభివృద్ధి ద్వారా వాణిజ్య సదుపాయాలు మెరుగవుతాయని మంత్రి పేర్కొన్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సంతోషంగా ఉన్నారని, రుణమాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్ అందించడంతోపాటు ప్రజలకు





ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా క్రింద అందించే పెట్టుబడి సహాయాన్ని 12 వేలకు పెంచుతున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తున్నామని అన్నారు.
ప్రతి గ్రామ పంచాయతీలో రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, పెట్టుబడి సహాయం, రైతులు వివరాలు ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా కేబుల్ ఛానల్ లో సామాజిక మీడియా ద్వారా ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం మంత్రి ఆలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమాదేవి - సురేష్ రెడ్డి, కౌన్సిలర్స్ శ్రీపతి బాణయ్య, కొట్టె పద్మ - రమేష్ పటేల్, వీకే రవి, మాజీ ప్రజాప్రతినిధులు మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ రాజయ్య , ఈఈ సంపత్ , ఏ. ఈ. మౌనిక ,సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యం కోసమే ఉప్పల చారలబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరం



**కల్వకుర్తి:** ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ మరియు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ గ్రామీణ ప్రాంతాల పేద ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 285 మంది కి షుగర్ బీపీ పరీక్షలు చేసి తాగిన మందులు ట్రస్టు ద్వారా అందించారు ప్రజలు బాగుండాలని గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యం పట్ల ప్రజలు నిర్లక్ష్యంగా ఉండకూడదని జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించేందుకు తరచూ ఉచిత వైద్య శిబిర్యాలని
నిర్వహిస్తున్నట్లు కడ్తాల్ మండల మాజీ జర్పుల దశరథ్ నాయక్ గారు, ఆర్య వైశ్య సంఘం నాయకులు గంప శ్రీనివాస్ గుప్త గారు తెలిపారు అదేవిధంగా ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గారికి, డాక్టర్ ఉప్పల అఖిల్ గారికి మరియు వారి కుటుంబానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రమేష్, మాజీ %వీూజ% గోపాల్, వసంత, యాదయ్య, రంగయ్య, అమృతం పాండు, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, రామచంద్రయ్య, మార్చ శేఖర్, తిరుపతి, సందీప్, అబ్బు రమేష్, మహేందర్, వగ్గు మహేష్, సురిగిమల్ల శేఖర్, తుడుం శ్రీశైలం, గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు ఐకమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలి

**● తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎ.కోదండరాం**

**హైదరాబాద్, జనవరి 07 :** ఉద్యోగులు ఐకమత్యంతో ఉండి తమ హక్కులు సాధించుకోవాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎ.కోదండరాం పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(యుబిఐడిఇఎఫ్) నూతన సంవత్సరం క్యాలెండర్-2025ను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎ.కోదండరాం కార్యాలయంలో యుబిఐడిఇఎఫ్ ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ పి.రాజశేఖర్ తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ వైకల్యాలు ఉన్న వ్యక్తుల రోజువారి జీవితం అనేక సమస్యలతో అనేక ఒడిదుడుకులతో కొనసాగుతుంటుందని అన్నారు. అలాంటి ఇబ్బందులు నాకు వ్యక్తిగతంగా అలాంటి సమస్యలు సుపరిచితమని తెలిపారు. ఐనప్పటికీ వైకల్యాలున్న వ్యక్తులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఇతర వైకల్యాలు కలిగిన వ్యక్తుల హక్కుల కోసం, వారిని చైతన్యం చేయడం కోసం ముందు వరుసలో ఉండి వైకల్యాలు కలిగిన వ్యక్తులే పోరాడడం అనేది సకలాంగులైన వ్యక్తులు అందరికీ ఒక ప్రేరణ కలిగించే విషయం అన్నారు. ఎందుకంటే ఈరోజుల్లో నేనుబాగుంటే చాలు అనే ధోరణి క్రమక్రమంగా పెరుగుతున్న క్రమంలో నేను బాగుంటేనే సమాజం బాగున్నట్టు కాదు, నాతో చుట్టుపక్కల వాళ్ళు పీడితులు బాధితులు కూడా బాగుంటేనే సమాజం 07-01-

# పంతులు కు సంవత్సర వేతనం



**ఇబ్రహీంపట్నం :** మల్కిజ్ గూడ గ్రామం లో శ్రీ. ఆంజనేయ స్వామి గుడి దగ్గర ప్రతీ మంగళవారం మరియు శనివారం ఉదయం. 6:00గం :లకు పంతులు పూజ చేయడానికి గ్రామ పెద్దలు నిర్ణయిచారు. కావున గ్రామములో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోగలరు. ఆంజనేయస్వామి ఆలయంలో నిత్యం పూజలు నిర్వహించడానికి పంతులు గారికి సంవత్సరం పాటు గౌరవ వేతనంగా .గౌరారం వెంకటరెడ్డి %రాంరెడ్డి గారు (మాజీ ఉపసర్పంచ్ )ఒక సంవత్సరం గాను.70.516/.రూపాయలు ఇవ్వడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు శనివారం ఉదయం 6 గంటలకు గుడి దగ్గరికి వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాను గ్రామ ప్రజలు ఈ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోగలరు అని పంతులు సురేందర్ శాస్త్రి గారు చెప్పడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం లో మాజీ సర్పంచ్ గుండెల్లి మల్లేష్.వరికుప్పల జంగయ్య. వరికుప్పల లక్ష్మయ్య. అల్లూరి మల్లయ్య. అంజయ్య. రఘునాథ్ రెడ్డి. పరమేష్. శేంకర్. మధు. మరియు గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల ఆరోగ్యంపై
# పట్టింపేది..?

- విద్యా శాఖ మంత్రిని నియమించాలి
- ఫుడ్ పాయిజన్ ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి
- బీఆర్ఎస్వీ సిద్దిపేట, చిన్నకోడూరు అధ్యక్షులు మహిపాల్ గౌడ్, రాజు



**సిద్దిపేట:** విద్యార్థుల ఆరోగ్యం పై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని బీఆర్ఎస్వీ సిద్దిపేట, చిన్నకోడూరు అధ్యక్షులు మహిపాల్ గౌడ్, గుజ్జ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కరీంనగర్ లోని శర్మానగర్ మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని వాంతులు తల, కడుపు నొప్పితో 23 మంది విద్యార్థులు విలవిలలాడారని అన్నారు. రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం వల్ల ఫుడ్ పాయిజన్ ఘటనలు వరుసగా జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల కనీస బాధ్యతలేని దిక్కుమాలిన ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు. విద్యావ్యవస్థ పై ఇప్పటివరకు సమీక్ష సమావేశం నిర్వహించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వెంటనే విద్యా శాఖ మంత్రిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ చిన్న కోదూరు మండల ప్రధాన కార్యదర్శి పడిగే లింగం, సిద్దిపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భానుచందర్, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్వి మండల ప్రధాన కార్యదర్శి మన్నే ఆనంద్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎలుక అనిల్, జానకి చందు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతలపై కాంగ్రెస్
# దాడి సరికాదు

- అధికార మదంతో వీధి రౌడీల్లా రెచ్చిపోతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు
- దాడి చేసిన వారిని శిక్షించాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్



**సిద్దిపేట:** నిరసన పేరుతో హైదరాబాద్ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు రాళ్లతో దాడి చేసి కార్యకర్తలను గాయ పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్నామనే తల బిరుసుతో ఇలాంటి చిల్లర వేషాలు వేస్తే భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం... వ్యవస్థలను అడ్డుపెట్టుకొని గుండాల మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి నిలిచిన చరిత్ర గల భారతీయ జనతా పార్టీ కార్యకర్తల ముందు ఈ పిచ్చి వేషాలు పనిచేయవన్నారు. పోలీస్ వ్యవస్థ అధికార పార్టీకి కొమ్ము కాయకుండా బీజేపీ కార్యాలయం పై దాడి చేసిన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజి ప్రవీణ్ కుమార్, గొల్ల శ్రీకాంత్, రమేశ్ రెడ్డి, సంపంగి అశోక్, కారం కంటి రాజు, భరత్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఉసురు
# తగులుతుంది

- హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్
- రైతుల హామీలు వెంటనే అమలు చేయాలి
- డిమాండ్ చేసిన బీఆర్ఎస్ నేతలు, రైతులు
- నంగునూరు,లక్ష్మీదేవిపల్లి, బూర్గుపల్లిలో నిరసన కార్యక్రమం





**నంగునూరు :** అన్నదాతలను మోసగిస్తోన్న సీఎం రేవంత్ రెడ్డికి రైతుల ఉసురు తప్పక తగులుతుందని బీఆర్ఎస్ నేతలు, రైతులు అన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఆదేశానుసారం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం నంగునూరు మండల కేంద్రంతో పాటు నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి, సిద్దిపేట అర్బన్ మండలంలోని బూర్గుపల్లి లో బీఆర్ఎస్ నేతలు, రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో నిబంధనలు లేకుండా, దరఖాస్తు తీసుకోకుండా రైతుబంధు వచ్చిందని, కాంగ్రెస్ హయాంలో మాత్రం రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని, రూ.రెండు లక్షల పంట రుణమాఫీ సంపూర్ణంగా చేయాలని, పంట బోన స్ రైతులందరికి ఇవ్వాలని, మహిళలకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ కమలాకర్ రావు,మాజీ ఉపసర్పంచ్ తడకపల్లి రామరాజు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బైరి బాలగౌడ్, రాములు, లక్ష్మణ్, మధుసూదన్ రావు, కాంతారావు,ఎల్లారెడ్డి, బాల్ రెడ్డి,దికొండ భాస్కర్, సంతోష్, దేవయ్య,నవీన్ గౌడ్,తడకపల్లి రాజు, పల్లపు రామచంద్రం, రాజబా బు,ధర్మరాజు, బోదాసు నర్సింలు, కిషన్ రావు, స్వామి, బోదాస్ రాజు, దూలం సౌమ్య, పుట్ట లక్ష్మి, లచ్చవ్వ, నంగునూరు బీఆర్ఎస్ నేతలు,శ్రీకాంత్ రెడ్డి,సోమిరెడ్డి, సారయ్య, మల్లయ్య యాదవ్ లింగంగౌడ్,బెదురు తిరుపతి, కిష్టరెడ్డి,తదితర రైతులు పాల్గొన్నారు.



## మార్చి నెలాఖరులోగా ఇంటి పన్ను
# వసూలు చేయాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది తో సమావేశం



**సిద్దిపేట:** మార్చి నెలాఖరులోగా ఇంటి పన్ను వసూలు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశిం చారు. మంగళవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆశ్రీత్ కుమార్ అధ్యక్షతన రెవెన్యూ, ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీబీ వివరాలు, ఇంటి పన్ను వసూలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరితగతిన బిల్లులు వసూలు చేయాలని అన్నారు. ప్రతి రోజు బైల్ కలెక్టర్ వారీగా పన్ను వసూలు వివరాలు అందించాలన్నారు. ప్రతి రోజు టార్గెట్ పెట్టుకొని పని చేయాలన్నారు. పట్టణంలోని వాణిజ్య వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు సకాలంలో బిల్లులు చెల్లించి సిద్దిపేట అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీఈ ప్రేరణ, ఏఈఈ పృథ్వి, ఆర్ఓ శ్రీకాంత్, ఆర్ఐలు బాలకృష్ణ, భారతీ, అజ్మత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## అలామా వరల్డ్ వైడ్ కాంపిటీషన్
# విజేత హర్ష వర్ధన్

- అభినందనలు తెలిపిన క్రాంతి హైస్కూలు చైర్మన్ భగవాన్ రెడ్డి




**హైదరాబాదు:** క్రాంతి హైస్కూల్ విద్యార్థి పి. సాయి హర్షవర్ధన్ రెడ్డి ఆది వారం హైదరాబాదులో జరిగిన అలామా వరల్డ్ వైడ్ కాం పిటీషన్ 2025లో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠ శాల చైర్మన్ భగవాన్ రెడ్డి విద్యార్థిని అభినందించి మాట్లా డారు. హర్షవర్ధన్ విజయం మన పాఠశాల విద్యా ప్రమా ణాలకు నిదర్శనమని. గణితంలో అంతర్జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు రాణించడం గర్వంగా ఉంద న్నారు. విద్యార్థులు ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుం టామని పేర్కొన్నారు. గణిత ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతుల విజయంగా ఈ గుర్తింపును అభివర్ణించారు. ఈ పోటీలలో అబాకస్, మెంటల్ అరిథ్మెటిక్ నైపుణ్యాలను పరీక్షించారని, ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. చైర్మన్ తో పాటు స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యా యులు, సాయి మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఘనంగా సందిరి బాలయ్య వర్ధంతి



- చిన్నకోడూరులో గంగపుత్రం సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ

**చిన్నకోడూరు:** మండల కేంద్రమైన చిన్నకోడూరులో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సందిరి బాలయ్య వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుడిసె లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి గుండు వెంకటేశ్, మాజీ అధ్యక్షులు పంపరి కనకయ్య మాట్లాడుతూ గంగపుత్రుల ఐక్యతకు ఆయన కృషి చేశారన్నారు. గంగపుత్రుల హక్కుల్ని కాపాడడానికి కోసం మనమంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చిన్నకోడూరు మండలంలోనే 52 సంవత్సరాలుగా గంగపుత్ర సంఘం ఏర్పడి చాలా ఆదర్శనంగా నిలుస్తుందని,రాబోయే రోజుల్లో పలు సేవ కార్యక్రమాలు చేపడతమన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు కనుగుల లక్ష్మయ్య, గౌటె లక్ష్మణ్,చంద్రయ్య,మహిళా అధ్యక్షురాలు పంపరి వినోద, మోహన్, చంద్రయ్య, గుడిసె ప్రభురాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ ను కలిసిన రాగుల కృష్ణ



**నంగునూరు, జనవరి 7**

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగర ప్రీతంను మంగళవారం నంగునూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రాగుల కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. అన్ని రంగాలలో విజయాన్ని పొందాలని, ఎస్సీ కార్పోరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ప్రీతం మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందజేసి ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపాక విజయ్, రాగుల కనకయ్య, అల్లిబిల్లి నర్సింగరావు, గుడిమల్ల సత్తయ్య, జజాల కనుకరాజు, పోతుల మోహన్, నీల రాకేశ్, తదితులు పాల్గొన్నారు.

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

## తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం




**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 16 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో స్వామివారి సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు.నిన్న స్వామివారిని 54,180 మంది దర్శించుకోగా 17,689 మంది తలనీలాలు సమర్పి ంచుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.20 కోట్లు వచ్చాయని తెలిపారు.కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంతిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ఈవో జె శ్యామలరావు ఆలయంలో జరిగిన సంప్రోక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఉగాది ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని వివరించారు.

## ట్రంప్ విక్టరీని ధ్రువీకరించిన అమెరికా కాంగ్రెస్



**అమెరికా:**గతేడాది నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల 20న ఆయన అమెరికా 47వ అధ్య క్షుడిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అధి కారిక సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఇం దులో భాగంగానే ట్రంప్ ఎన్నికను అమెరికా కాంగ్రెస్ తాజాగా ధ్రువీకరించింది. 2020 నాటి నవంబర్ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బైడెన్ ఎన్నికను ధ్రువీకరించేందుకు నిర్వహించిన సమావేశం ఉద్రిక్తతకు దారి తీసింది. బైడెన్ గెలుపును ధ్రువీకరించేందుకు యూఎస్ కాంగ్రెస్ సమావేశమైన క్యాపిటల్ భవనంలోకి వేలాది మంది ట్రంప్ మద్దతుదారులు చొచ్చుకెళ్లి బీభత్సం సృష్టించారు. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకొని ఈసారి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పటిష్ఠ బందోబస్తు నడుమ పార్లమెంట్ ఉమ్మడి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ప్రతి రాష్ట్రం నుంచి వచ్చిన ఓట్లను లెక్కించారు. మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ మార్క్ 270 కాగా.. ట్రంప్‌కు 312, హారిస్‌కు 226 ఓట్లు వచ్చాయి. ఈ సమావేశానికి ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగి ట్రంప్ చేతిలో ఓటమిపాలైన కమలా హారిస్ అధ్యక్షత వహించారు. హారిసే ట్రంప్ గెలుపును ధ్రువీకరించారు. నవంబర్ 5 నాటి ఫలితాలను ధ్రువీకరించడంపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఇదో బిగ్ మూమెంట్ అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇక ఇదే సమావేశంలో అమెరికాకు కాబోయే ఉపాధ్యక్షుడి ఎన్నికపైనా కమలా హారిస్ ప్రకటన చేశారు. ట్రంప్ రన్నింగ్ మేట్, ఒహియో సెనెటర్ జేడీ వాన్స్‌కు 312 ఓట్లు వచ్చినట్లు ప్రకటించారు.

## చైనాలో భూకంపం.. రెస్క్యూ ఆపరేషన్‌కు దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు



**బీజింగ్:** టిబెట్ కేంద్రంగా సంభవించిన భూకంపంలో భారీగా ప్రాణ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టేందుకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వాయవ్య చైనాలోని జీజాంగ్ ప్రాంతంలో భూమి కంపించింది. ఆ తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదు అయ్యింది. చైనా కమ్యూనిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ అయిన జీ జిన్‌పింగ్.. తన ఆదేశాల్లో మిలిటరీకి సూచనలు చేశారు. గాయపడ్డవారికి చికిత్స అందించాలన్నారు. భూకంపతో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని, సెకండరీ డిజాస్టర్స్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత వ్యక్తులను సరైన రీతిలో రీసెటిల్ చేయాలన్నారు. ఎర్త్‌కేక్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు.భూకంపం వల్ల ఇప్పటి వరకు 53 మంది మరణించినట్లు తెలుస్తోంది. మరో 62 మంది గాయపడ్డారు. తీవ్ర స్థాయిలో వచ్చిన భూకంపం వల్ల.. నేపాల్ రాజధాని ఖాట్మాండులో ప్రకంపనలు నమోదు అయ్యాయి. అనేక మంది ఇండ్ల నుంచి రోడ్డు మీదకు పరుగులు తీశారు. 2015, ఏప్రిల్ 25వ తేదీ నేపాల్ కేంద్రంగా భారీ భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. 7.6 తీవ్రతతో వచ్చిన ఆ నాటి భూకంపంలో వేలాది మంది నేపాలీలు మరణించారు.

## ఫార్ములా-ఈ కార్ రేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదు : పువ్వాడ అజయ్



**హైదరాబాద్ :** ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కేటీఆర్‌ను అందులో ఇరికించేందుకు ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజంగా కేటీఆర్ తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షను భరించేందుకైనా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి న్యాయపరంగా పోరాడుదామని కేటీఆర్ చెప్పారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని కేటీఆర్ సూచించారు. కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.కాగా,ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది.ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారు. కాగా, క్వాష్ పిటన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందీనగర్‌లోని కేటీఆర్ నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



**జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన కొత్తపల్లి (ఎస్ ఎం) గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాలుక రవి (50) అనే ఎలక్ట్రీషియన్ కరెంటు మోటార్ రిపేరు చేస్తూ విద్యుత్ షాక్‌తో మంగళవారం చెందాడు.

# షుగర్ ఉన్నవారు రాత్రిపూట ఎన్ని చపాతీలను తింటే మంచిది..?

**హైదరాబాద్ :**ప్రస్తుత తరుణంలో చాలా మంది డయాబెటిస్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికే షుగర్ వ్యాధి వచ్చేది. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అయితే డయాబెటిస్ రాగానే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. షుగర్ కంట్రోల్ లో ఉంటే దీర్ఘకాలం పాటు జీవించవచ్చని అంటున్నారు. అయితే డయాబెటిస్ కంట్రోల్ అవ్వాలంటే డాక్టర్లు ఇచ్చే మందులను తప్పనిసరిగా క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. దీంతోపాటు రోజుకు తగినంత నిద్ర పోవాలి. నీళ్లను తాగాలి. అదేవిధంగా డైట్‌ను కూడా పాటించాల్సి ఉంటుంది. డయాబెటిస్ వచ్చిన వారు ఏ ఆహారాన్ని పడితే దాన్ని తినకూడదు.



బరువు తగ్గాలి..షుగర్ వ్యాధి ఉన్నవారు తీసుకునే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా బరువును తగ్గించుకోవాలి. దీంతో ఆటోమేటిగ్గా షుగర్ కూడా కంట్రోల్ అవుతుంది. అయితే బరువు తగ్గడంతోపాటు ఆ బరువు నియంత్రణలో ఉండేలా చూడాలి. దీంతో షుగర్ లెవల్స్ ఎప్పటికీ పెరగకుండా ఉంటాయి. దీనికి గాను ఎప్పటికీ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బరువును పెంచే ఆహారాలను తినకూడదు. ఇవి షుగర్ లెవల్స్‌ను కూడా పెంచుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. షుగర్ ఉన్నవారు ఆహారం విషయంలో మాత్రం అనేక జాగ్రత్తలను పాటించాల్సిందే. లేదంటే షుగర్ కంట్రోల్ అవదు.

పుల్కా మాదిరిగా చేసి తినాలి..ఇక డయాబెటిస్ ఉన్నవారు చపాతీలను తినాలని సూచిస్తుంటారు. ఎందుకంటే రైస్‌తో పోలిస్తే చపాతీల గ్లైసీమిక్ ఇండెక్స్ కాస్త తక్కువగా ఉంటుంది. పైగా గోధుమ పిండిలో ఫైబర్ ఉంటుంది కనుక చపాతీలను తింటే అంత త్వరగా షుగర్ లెవల్స్ పెరగవు. అందువల్లనే చాలా మంది రాత్రి పూట భోజనంలో అన్నంకు బదులుగా చపాతీలను తింటుంటారు. బరువు తగ్గాలనుకునే వారు కూడా తమ డైట్‌లో చపాతీలను చేర్చుకుంటారు. రాత్రి పూట రెండు చపాతీలను నూనె లేకుండా పుల్కా మాదిరిగా కాల్చుకుని తింటే ఎంతో మేలు జరుగుతుంది. అయితే రాత్రి పూట ఎన్ని చపాతీలను తినాలని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.ఎన్ని చపాతీలు తినాలంటే..?చపాతీల్లో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. వీటిల్లో ఫైబర్ ఉంటుంది కనుక వీటిని తింటే జీర్ణక్రియ కూడా మెరుగు పడుతుంది. అయితే రాత్రి పూట 30 నుంచి 50 గ్రాముల మేర పిండి పదార్థాలు లభిస్తే చాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంటే మీడియం సైజ్ ఉన్న చపాతీలు అయితే 2 లేదా 3 చాలు. పెద్దవి అయితే 2 చాలు అని వైద్యులు చెబుతున్నారు. ఇలా చపాతీలను తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని, దీంతోపాటు షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయని అంటున్నారు. అయితే కొందరు అన్నం మానేస్తున్నామని చెప్పి చపాతీలను అధికంగా తింటారు. ఇలా చేసినా కూడా అనర్థమేనట. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయని అంటున్నారు. కనుక రాత్రి పూట పరిమిత మోతాదులో చపాతీలను అంటున్నారు.


# కెనడా తదుపరి ప్రధాని ఎవరు..? రేసులో భారత సంతతి ఎంపీ

**కెనడా:**కెనడా రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. కెనడా ప్రధానమంత్రి పదవికి, అధికార లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా అధినేత పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఒట్టావాలోని తన నివాసం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. కొత్త ప్రధాని ఎన్నిక వరకు తాను ఈ పదవుల్లో కొనసాగుతానని వెల్లడించారు.ట్రూడో నిర్ణయంతో కెనడా తదుపరి ప్రధాని ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే ప్రధాని రేసులో భారత సంతతి ఎంపీ సహా పలువురు పేర్లు వినిపిస్తున్నాయి. లిబరల్ పార్టీ నేతలు క్రిస్టియా ఫ్రీలాండ్, మార్క్ కార్నీ, మెలనీ జోలీ, ఫ్రాంకోయిస్ ఫిలిప్పీ, క్రిస్టీ క్లార్క్‌తోపాటు భారత సంతతి ఎంపీ అనిత ఆనంద్ పేర్లు వినిపిస్తున్నాయి.భారత సంతతికి చెందిన ఎంపీ అనితా ఆనంద్.. తమిళ్, పంజాబీ మూలాలు



కలిగిన నేత. ఆమె తండ్రిది తమిళనాడు కాగా, తల్లిది పంజాబ్. 57 ఏళ్ల అనిత ఆనంద్ ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 2019లో ఓక్‌విల్లే నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. అనంతరం ఆమె ట్రూడో కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. పబ్లిక్ సర్వీసెస్, రవాణా, రక్షణ సహా పలు కీలక పదవులను చేపట్టారు.కాగా, సోమవారం ఒట్టావాలోని తన నివాసం వద్ద ట్రూడో మీడియా సమావేశం నిర్వహించారు. తాను రాజీనామా చేస్తానని తన పార్టీకి, గవర్నర్‌కు తెలియజేసినట్టు తెలిపారు. కొత్త ప్రధాని ఎన్నిక వరకు తాను ఈ పదవుల్లో కొనసాగుతానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల వరకు పార్టీని, కెనడాకు నాయకత్వం వహించే కొత్త నేత ఎన్నిక ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుగా జనవరి 27న ప్రారంభం కావాల్సిన పార్లమెంటును మార్చి 24 వరకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.'నేను ఏ పోరాటం నుంచి అంత సులువుగా వెనక్కు తగ్గను. కానీ, కెనడియన్ల ప్రయోజనాలు, నేను ప్రేమించే ప్రజాస్వామ్య శ్రేయస్సు కోసం రాజీనామా చేస్తున్నాను' అని ట్రూడో వ్యాఖ్యానించారు. కెనడాలో అధికార పార్టీ అధినేత రాజీనామా తర్వాత కొత్త నాయకుడి ఎన్నికకు 90 రోజుల గడువు ఉంటుంది. ఈ నేపథ్యంలో తొమ్మిదేండ్ల జస్టిన్ ట్రూడో పాలనకు మరో 90 రోజుల్లోపే తెరపడనుంది.

# మరో ఇద్దరు చిన్నారులకు పాజిటివ్.. భారత్‌లో క్రమంగా పెరుగుతున్న హెచ్‌ఎమ్‌పీవీ కేసులు



**చైనా:**చైనాలోవేగంగావ్యాపిస్తున్న హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కేసులు భారత్‌లోనూ క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే కర్ణాటక రాజధాని బెంగళూరులో రెండు, అహ్మదాబాద్‌లో ఒకటి, చెన్నైలో మరో రెండు కేసులు వెలుగు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మహారాష్ట్ర నాగ్‌పూర్ మరో రెండు కేసులు నమోదయ్యాయి. ఏడు, 14 ఏళ్ల చిన్నారులకు హెచ్‌ఎమ్‌పీవీ పాజిటివ్‌గా తేలింది.జనవరి 3వ తేదీన చిన్నారులకు జ్వరం, దగ్గు రావడంతో నగరంలోని రాందాస్‌పేట్‌లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరికీ హెచ్‌ఎమ్‌పీవీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లలకు ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నారు. తాజా కేసులతో కలిపి భారత్‌లో మొత్తం హెచ్‌ఎమ్‌పీవీ కేసుల సంఖ్య ఏడుకు పెరిగింది. ఈ ఏడు పాజిటివ్ కేసుల్లో బాధితులంతా చిన్నారులే కావడం గమనార్హం. దీంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతో ంది. అప్రమత్తమైన రాష్ట్రాలుహెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎదురుయ్యే వైద్యపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ ప్రభుత్వాలు సోమవారం మార్గదర్శకాలను జారీ చేశాయి. బెంగళూరులో రెండు హెచ్‌ఎంపీవీ కేసుల నేపథ్యంలో 'ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం' అంటూ కర్ణాటక అడ్వైజరీ జారీ చేసింది. జనం ఎక్కువ ఉన్న చోట్ల మాస్కులు ధరించాలని ప్రజలకు సూచించింది. హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదని, దేశంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు అసాధారణంగా పెరగలేదని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు వీడియో మెసేజ్ ద్వారా సూచించారు. కాగా, హెచ్‌ఎంపీవీతో పాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా న్యుమోనియా, కొవిడ్-19 కేసులు వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో చైనా స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించిం ది.హెచ్‌ఎంపీవీ ప్రపంచమంతా ఉన్నదే: ఐసీఎంఆర్హెచ్‌ఎంపీవీ ఇప్పటికే భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్నదని, ఈ వైరస్‌తో సంబంధమున్న శ్వాసకోశ సమస్యల కేసులు అనేక దేశాల్లో నమోదవుతున్నాయని ఐసీఎంఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ వద్ద ఉన్న ప్రస్తుత సమాచారంతో పాటు ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్(ఐడీఎస్‌పీ) డాటా ప్రకారం చూస్తే దేశంలో ఇన్‌ఫ్లుయెంజా లాంటి అనారోగ్య సమస్యల(ఐఎల్‌ఐ) లేదా తీవ్ర శ్వాసకోస సమస్య(ఎస్‌ఏఆర్‌ఐ) కేసుల సంఖ్య అసాధారణంగా ఏమీ పెరగలేదని వెల్లడించింది. కాగా, హెచ్‌ఎంపీవీ వైరస్ కొత్తదేమీ కాదని కర్ణాటక వైద్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. బాధిత శిశువులు ఎక్కడా ప్రయాణించలేదని, కాబట్టి ఇది బయటి నుంచి వచ్చిన వైరస్ కాదని అన్నారు. చైనాలో ఉన్నది కొత్త వేరియంట్ కావొచ్చని అభిప్రాయపడ్డారు.ఇదేమీ కొత్త వైరస్ కాదుప్రతి శీతాకాలంలో ఈ కేసులు వస్తుంటాయని, నవంబర్ నుంచి తమ దవాఖానలో మూడు హెచ్‌ఎంపీవీ కేసులు గుర్తించామని, ఇవన్నీ తేలికపాటి వైరస్ కేసులేనని కోల్‌కతాలోని పీర్‌లెస్ హాస్పిటల్ సీఈవో సుదీప్త మిత్ర పేర్కొన్నారు. హెచ్‌ఎంపీవీ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఢిల్లీ ఎయిమ్స్ ఇంటర్నల్ మెడిసిన్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ తెలిపారు. కొవిడ్-19తో హెచ్‌ఎంపీవీని పోల్చవద్దని, కొవిడ్-19 అనేది పూర్తిగా కొత్త వైరస్ అని, దానిపై పోరాడగల రోగ నిరోధక శక్తి అప్పుడు ఎవరిలో లేదని అన్నారు.హెచ్‌ఎంపీవీ 2001 నుంచి ఉన్నదేనని చెప్పారు. పదేండ్ల వయసు వచ్చే నాటికి చాలావరకు పిల్లల్లో హెచ్‌ఎంపీవీకి వ్యతిరేకంగా పోరాడే రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాగా, హెచ్‌ఎంపీవీకి వ్యాక్సిన్ లేకపోయినా కొవిడ్ వ్యాక్సిన్ మూడు డోసులు లేదా ఫ్లూ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో హెచ్‌ఎంపీవీని ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి ఉంటుందని బెంగళూరులోని తెలిపారు.

# నందిగం సురేశ్ కేసు సుప్రీం కీలక తీర్పు

**ఢిల్లీ:** బాపట్ల మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్ పై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తుళ్లూరు మండలం వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఈ కేసుపై విచారించిన సుప్రీం ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో నందిగం సురేశ్ కు ఇప్పట్లో ఊరట దక్కేలా కనిపించడం లేదు.వైసీపీ నేత, మాజీ ఎంపీ నందిగం



సురేశ్ బెయిల్ పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2020లో తుళ్లూరు మండలం వెలగపూడిలో జరిగిన హత్య కేసులో నందిగం సురేశ్ నిందితుడిగా ఉన్నారు. ఇరువర్గాల ఘర్షణలో మరియమ్మ అనే మహిళ మరణించారు. దీనిపై అప్పట్లోనే కేసు నమోదైనా వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులు చర్యలు తీసుకోలేదు. ఏడు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరియమ్మ కుమా రుడు ఈ హత్యపై మంత్రి లోకేశ్ కు ఫిర్యాదు చేయడంతో మళ్లీ కదలిక వచ్చింది.టీడీపీ ప్రధాన కార్యాలయంపై చేశారు.

# నేరస్తులు ఇక తప్పించుకోలేరు.. కేంద్రం కీలక నిర్ణయం

**ఢిల్లీ:** అంతర్జాతీయ స్థాయిలో అన్నిదేశాల పోలీసుల మధ్య సమన్వయం కోసం.. నేరస్తుడిని పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ పనిచేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో అన్నిదేశాల పోలీసుల మధ్య సమన్వయం కోసం.. నేరస్తుడిని పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ పనిచేస్తోంది. నిందితులపై వివిధ దేశాలకు సమాచారాన్ని చేరవేయడం చేస్తుంటుంది. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో నేరాలకు పాల్పడి.. విదేశాల్లో దాక్కునే వారిని అరెస్ట్ చేసి.. స్వదేశానికి తీసుకొచ్చి శిక్ష వేసేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్‌పోల్‌ను తీసుకువచ్చింది. భారతదేశంలో నేరగాళ్లకు ఉచ్చు బిగించేందుకు హోం మంత్రిత్వ శాఖ సిద్ధం అయింది. అందులో భాగంగానే నేడు 'భారత్‌పోల్'ను ప్రారంభించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దీనిని ప్రారంభించారు. ఇది కూడా ఇంటర్‌పోల్ తరహాలోనే పనిచేయనుంది. ఇది నేరస్తుల గురించి సమాచారాన్ని పంచుకోవడానికి, వారిపై తక్షణ చర్యలు తీసుకోవడానికి పనిచేస్తుంది. విదేశాల్లో కూర్చొని భారత్‌లో నేరాలకు పాల్పడుతున్న వారి భరతం పట్టేందుకు కేంద్రం సిద్ధమైందనే చెప్పాలి. అంతర్జాతీయ నేరస్తులను పట్టుకోవడం సులభతరం చేసేందుకు సిద్ధం చేసింది.




విదేశాలకు పారిపోయే లేదా దేశంలో క్రైమ్ సిండికేట్లను నడుపుతున్న విదేశీ నేరస్తులపైనా చర్యలు తీసుకునేందుకు రాష్ట్రాల పోలీసులకు ఇప్పుడు భారత్‌పోల్ ఆయుధంగా మారనుంది. 'భారత్‌పోల్' ద్వారా నేరస్తులను పట్టుకోవడమే కాకుండా సకాలంలో వారిపై ఉక్కుపాదం మోపేందుకు ఉపయోగపడనుంది. నేరాలను నిర్మూలించడమే లక్ష్యంగా 'భారత్‌పోల్' పనిచేయనుంది. ఇది అధునాతన ఆన్‌లైన్ పోర్టల్ అని చెప్పాలి. దీనిని సీబీఐ తయారుచేసింది. ఇంటర్‌పోల్ అంటే ఇంటర్నేషనల్ క్రిమినల్ పోలీస్ ఆర్గనైజేషన్. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ పోలీసు సంస్థ. 195 దేశాల పరిశోధన సంస్థలకు ఇది కేంద్రంగా పనిచేస్తోంది. ఈ సంస్థ 1923 నుంచి పనిచేస్తోంది. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఫ్రాన్స్‌లోని లియోన్ నగరంలో ఉంది. భారతదేశంలో, విదేశాలలో దాక్కున్న నేరస్తులను అరెస్ట్ చేయడానికి లేదంటే వారి గురించి సమాచారం పొందడానికి రాష్ట్ర పోలీసు, దర్యాప్తు సంస్థలు ఇప్పటివరకు తరచూగా ఇంటర్‌పోల్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా సీబీఐని సంప్రదించాలి. ఆ తర్వాత సీబీఐ ఇంటర్‌పోల్‌ను సంప్రదించి అవసరమైన నోటీసులు జారీ చేస్తుంది. ఈ మొత్తం ప్రక్రియ కాస్త క్లిష్టంగానే ఉండడమే కాకుండా చాలా వరకు సమయం పోతుంది. ఈ సమస్య బారి నుంచి బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వం 'భారత్‌పోల్'ను నేడు ప్రారంభిస్తోంది. దీని సహాయంతోనే నేరస్తులకు రెడ్ నోటీసులు, డిఫ్యూజన్ నోటీసులు, ఇతర అవసరమైన ఇంటర్‌పోల్ నోటీసులను జారీ చేయనున్నారు. ఇప్పటివరకు నేరస్తుల అభ్యర్థనను ట్రాక్ చేయాలనుకుంటే రాష్ట్రాలు సీబీఐకి మరోసారి ఈ మెయిల్ లేదా ఫ్యాక్స్ చేయాలి. కానీ.. 'భారత్‌పోల్'లో వారి అభ్యర్థనను ట్రాక్ చేసే అవకాశం ఉంది. ఇంటర్‌పోల్‌తోనూ కమ్యూనికేషన్‌ను కొనసాగించనుంది.

# 'రైతు భరోసాపై యూటర్న్'... ఢిల్లీలో తెలంగాణ పోస్టర్ల కలకలం!

**ఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రంలో గత బీఆరెస్స్ ప్రభుత్వం "రైతు బంధు" పేరిట సాయం అందించగా.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో "రైతు భరోసా" పేరిట సాయం అందించనుందని చెబుతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు రైతు భరోసా వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ రైతు భరోసా నుంచి ప్రజల దారి మళ్లించేందుకే నిన్న అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం, నేడు కేటీఆర్ కి ఏసీబీ నోటీసులు అంటూ బీఆరెస్స్ శ్రేణులు ఆరోపిస్తున్న పరిస్థితి. ఈ సమయంలో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్ద పోస్టర్లు కలకలం రేపాయి. అవును... తెలంగాణ రాష్ట్రంలో గత బీఆరెస్స్ ప్రభుత్వం "రైతు బంధు" పేరిట సాయం అందించగా.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో "రైతు భరోసా" పేరిట సాయం అందించనుందని చెబుతున్నారు. ఇందులో భాగంగా... గతంలో కంటే రూ.2 వేలు అదనంగా ఇవ్వనున్నామని.. ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ కానుందని తెలిపారు. అయితే.. రైతు భరోసా అమలుకు సంబంధించి విధి విధానాలు, మార్గదర్శకాలపై రైతుల్లో తీవ్ర




గందరగోళం నెలకొంది అంటూ బీఆరెస్స్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సమయంలో మంత్రి పొంగులేటి స్పందించారు. ఇందులో భాగంగా... వేలాది మంది రైతుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఈ కార్యక్రమంపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే... రైతులకు ఎకరానికి రూ.12 వేలు రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకూ ఈ పథకం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు కూడా రైతు భరోసా ఇస్తామని అన్నారు. ఈ సమయంలో ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం వద్ద కొన్ని పోస్టర్లు కలకలం రేపాయి. ఢిల్లీలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యాలయం వద్ద "కాంగ్రెస్ రైతు భరోసా యూటర్న్" పేరిట పోస్టర్లు కలకలం రేపాయి. ఇందులో భాగంగా.. "తెలంగాణకు వచ్చిన రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరు మీద రైతులకు ఎకరానికి రూ.15,000 చొప్పున ఇస్తామని ప్రకటించారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో ఒక్క రూపాయి విడుదల చేయలేదు" అని పోస్టర్స్ వెలిశాయిఇదే సమయంలో సీఎం రేవంత్ యూటర్న్ తీసుకున్నారని.. ఎకరాకు రూ.12,000 ఇస్తామంటున్నారని అందులో రాసుకొచ్చారు! దీంతో.. ఈ పోస్టర్లు తీవ్ర కలకలం రేపాయి! వీటిని ఎవరు అతికించారనే విషయంపై కాంగ్రెస్ పార్టీ సీరియస్ గా దృష్టి సారించిందని తెలుస్తోంది.

# ఏకాకి తనంపై శాస్త్రవేత్తల షాకింగ్ విషయాలు!



**హైదరాబాద్ :** ఒంటరితనంతో మానసిక సమస్యలు వస్తాయనే కామెంట్లు వినిపించిన వేళ.. సరికొత్త విషయాలు వెల్లడించారు శాస్త్రవేత్తలు. ఒంటరితనం శాపం అని ఒకరంటే.. కాదు కాదు ఏ తలపోటూ లేకుండా ఒంటరిగా బ్రతకడం అనేది ఓ వరం అని మరికొంతమంది చెబుతుంటారు. ఈ విషయంలో ఎవరి అనుభవాలు వారికి ఉంటాయని అంటారు. అయితే... సామాజికంగా ఒంటరితనాన్ని అనుభవించేవారికి సంబంధించి ఓ షాకింగ్ విషయం వెల్లడించారు శాస్త్రవేత్తలు. అవును... ఒంటరితనంతో మానసిక సమస్యలు వస్తాయనే కామెంట్లు వినిపించిన వేళ.. సరికొత్త విషయాలు వెల్లడించారు శాస్త్ర వేత్తలు. ఇందులో భాగంగా... సామాజికంగా ఒంటరితనాన్ని అనుభవించేవారికి తీవ్రమైన వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని గుర్తించినట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెల్లడించారు. ఇందులో భాగంగా... సామాజికంగా ఒంటరితనాన్ని అనుభవించేవారిలో స్ట్రెస్ స్పందనగా ఉత్పత్తి అయ్యే అధిక కొలెస్ట్రాల్ తో ముడిపడిన ప్రోటీన్లు ఎక్కువగా ఉన్నాయని తేల్చారు. ఇవి పెరగడానికి ఒంటరితనమే కారణమై ఉండొచ్చని స్పష్టం అవుతోందని తెలిపారు. ఈ మేరకు బ్రిటన్ లోని కేంబ్రిడ్జ్, చైనాలోని ఫుడాన్ యూనివర్శిటీల శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో భాగంగా సుమారు 42 వేల మంది బ్లడ్ శాంపుల్స్ ని పరిశీలించిన శాస్త్రవేత్తలో అందులో ఉన్న వివిధ రకాల ప్రోటీన్ల మోతాదును విశ్లేషించారు. వీరిలో ప్రధానంగా ఒంటరితనం అనుభవిస్తున్నవారిలో ఎటువంటి ప్రోటీన్లు ఉన్నాయనే విషయాన్ని శోధించే ప్రయత్నం చేశారు. వీరిలో వైరల్ ఇన్ ఫెక్షన్ కు స్పందనగా ఉత్పత్తయ్యే ప్రోటీన్లే ఎక్కువగా ఉన్నట్లు తేల్చారు. ఇదే సమయంలో... టైప్-2 మధుమేహం, గుండె జబ్బు, పక్షవాతంతో ముడిపడిన ప్రోటీన్లు కూడా వీరిలో ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించినట్లు చెబుతున్నారు. దీంతో... కుటుంబ సభ్యులు, స్నేహితులతో మంచి సంబ ంధాలను కలిగి ఉండటం ద్వారా రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుచుకోవచ్చని వారు పేర్కొన్నారు. అందువల్ల సామాజికంగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నవారు కుటుంబ సభ్యులతోనూ, స్నేహితులతోనూ మంచి సంబంధాలు కలిగి ఉండటం వల్ల రోగ నిరోధక వ్యవస్థను మెరుగు పరచుకోవచ్చని.. తీవ్రమైన ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

# ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవానికి భారత్ బ్యాండ్

## ఈ సమయంలో ట్రంప్ కోసం ప్రత్యేకంగా ఢోల్ బ్యాండ్ రెడీ అవుతోంది

**అమెరికా :** గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 20న ఆయన అగ్రరాజ్యం అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సమయంలో ట్రంప్ కోసం ప్రత్యేకంగా భారతీయ అమెరికన్ ఢోల్ బ్యాండ్ సందడి చేయనున్నట్లు చెబుతున్నారు. అవును... జనవరి 20న అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ట్రంప్ కోసం ప్రత్యేకంగా ఢోల్ బ్యాండ్ రెడీ అవుతోంది. ఇందులో భాగంగా.. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు "క్యాపిటల్ హిల్ నుంచి వైట్ హౌస్ వరకూ" జరగనున్న పరేడ్ లో ఈ ఢోల్ బ్యాండ్ ప్రదర్శన ఇవ్వనున్నారు! దీనికి సంబంధించిన ప్రత్యేక ఆహ్వానం టెక్సాస్ నుంచి పనిచేస్తున్న శివమ్ ఢోల్ తాషా పాఠక్ కు వైట్ హౌస్ నుంచి అందిందని అంటున్నారు. దీంతో... ఈ బ్యాండ్ ఒక్కసారిగా అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించనుందని ఆశాభావం వ్యక్తం అవుతుంది. ఈ సందర్భంగా తమను ఆహ్వానించిన వారికి శివమ్ ఢోల్ తాషా పాఠక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ సందర్భంగా... భారత్ ఢోల్ బ్యాండ్ కు ఉన్న హై ఎనర్జీని ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తామని.. అందుకు ఈ అవకాశం చాలా బాగా ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ రోజు కార్యక్రమంలో... ఈ బ్యాండ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచే అవకాశం ఉందని అంటున్నారు. కాగా.. గత ఏడాది నవంబర్ లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ ను రిపబ్లికన్ పార్టీకి చెందిన డొనాల్డ్ ట్రంప్ ఓడించిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో డొనాల్డ్ ట్రంప్ అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా ఈ నెల 20న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనం లోని వెస్ట్ ఫ్రంట్ ప్రాంతం వేదిక కానుంది. ప్రపంచ దేశాల అధినేతలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు చెబుతున్నారు. ఇంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో... భారత్ ఢోల్ బ్యాండ్ ధూమ్ ధామ్ చేయనుందనే విషయం ఇప్పుడు ఆసక్తిగా మారింది.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల :** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ఈవో జె శ్యామలరావు ఆలయంలో జరిగిన సంప్రోక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని వివరించారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి , శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సాంబశివరావు, రాజశేఖర్ గౌడ్, సుచిత్ర యెల్లా, పనబాక లక్ష్మి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, సివిఎస్‌వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు,తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు పిల్లల్ని భర్తకు వదిలేసి..

## బిచ్చగాడితో వెళ్లిపోయిన మహిళ.. పోలీసు కేసు నమోదు



**హర్దోయ్:** ఉత్తరప్రదేశ్ హర్దోయ్ జిల్లాకు చెందిన 36 ఏళ్ల మహిళ.. భర్తను, ఆరుగురు పిల్లల్ని వదిలేసి.. ఓ బిచ్చగాడితో వెళ్లినట్లు పోలీసు కేసు నమోదు అయ్యింది. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 87 ప్రకారం.. భర్త రాజు ఫిర్యాదు చేశాడు. ఆ బిచ్చగాడిపై మహిళ అపహరణ కేసు నమోదు చేశారు. కేసు బుక్ చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. హర్దోయ్‌లోని హర్పల్‌పూర్ లో జీవిస్తున్న 45 ఏళ్ల రాజుకు.. రాజేశ్వరి అనే భార్య ఉన్నది. ఆ జంటకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. అయితే నానే పండిత్ అనే బిచ్చగాడు అప్పుడు ఆ ఇంటి పరిసరాల్లో అడుక్కునేవాడు. కొన్ని సందర్భాల్లో భార్య రాజేశ్వరితో అతను మాట్లాడేవాడు అని రాజు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫోన్‌లో కూడా ఆ ఇద్దరు సంభాషించేవారన్నాడు. జనవరి 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటల సమయంలో.. బట్టలు, కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వెళ్తున్నట్లు కూతురు ఖుష్బూకు రాజేశ్వరి చెప్పి వెళ్లిందని ఫిర్యాదులో తెలిపాడు.

భార్య తిరిగి రాకపోవడంతో ఆమె కోసం వెతికాడు. ఓ బర్రెను అమ్మితే వచ్చిన డబ్బులతో తన భార్య వెళ్లిపోయినట్లు రాజు ఫిర్యాదులో పేర్కొన్నాడు. నానే పండిట్ అనే బిచ్చగాడు తన భార్యను తీసుకెళ్లి ఉంటాడని రాజు అనుమానం వ్యక్తం చేశాడు. నానే పండిట్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 87 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ చట్టం ప్రకారం నిందితుడికి పదేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంటుంది.

# వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు



**అమరావతి :** ఏపీలో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు సుప్రీంకోర్టులో నిరాశే ఎదురయ్యింది. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. వెలగపూడిలో మరియమ్మ హత్య కేసులో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ నిందితుడిగా ఉన్నారు. హత్య కేసులో తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. 2020లో వెలగపూడిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మరియమ్మ అనే మహిళ మరణించింది. పోలీసులు ఈ ఘటనపై హత్య కేసు నమోదు చేశారు. వైసీపీ అధికారంలో ఉండటంతో కేసు విచారణ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసు విచారణ ప్రారంభమైంది. ఈ హత్య కేసులో సురేష్‌ను పోలీసులు అరెస్టు చేయగా బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించాడు. కేసు తీవ్రత దృష్ట్యా సురేష్‌కు ఏపీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ నందిగం సురేష్ సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకున్నారు. జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలో మంగళవారం పిటిషన్ విచారణకు రాగా ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయకపోవడంతో తాము కూడా జోక్యం చేసుకోలేమని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ కేసులో చార్జిషీటు కూడా దాఖలైందున బెయిల్ కోసం మరోసారి ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది.

# ధ్వని వేగం కన్నా 12 రెట్ల అధిక వేగంతో .. హైపర్‌సోనిక్ వార్‌హెడ్‌ను పరీక్షించిన నార్త్‌కొరియా



**న్యూఢిల్లీ:** ఇంటర్మీడియేట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని సోమవారం ఉత్తర కొరియా పరీక్షించింది. అయితే ఆ మిస్సైల్‌కు.. హైపర్‌సోనిక్ వార్‌హెడ్ ఉన్నట్లు ఆ దేశం వెల్లడించింది. ఆ ఆయుధంతో పసిఫిక్ తీరంలోని శత్రు దేశాలను చిత్తు చేయవచ్చు అని నార్త్ కొరియా పేర్కొన్నది. ధ్వని వేగం కన్నా అధిక వేగంతో ప్రయాణించే వాటిని హైపర్‌సోనిక్ అని పిలుస్తాం. అయితే అలాంటి మిస్సైల్స్‌ను ట్రాక్ చేసి, షూట్ చేయడం కష్టమైన పని. ధ్వని వేగం కన్నా అయిదు రెట్లు అధికం వేగంతో వెళ్లడం వల్ల వాటిని కూల్చడం వీలు కాదు. అయితే సోమవారం ఉత్తర కొరియా పరీక్షించిన హైపర్‌సోనిక్ వార్‌హెడ్.. ధ్వని వేగం కన్నా సుమారు 12 రెట్ల వేగంతో వెళ్తుందని తేలింది. దాదాపు 1500 కిలోమీటర్ల దూరం ఆ క్షిపణి ప్రయాణించింది. గత ఏడాది ఏప్రిల్‌లో కూడా ఉత్తర కొరియా ఇలాగే హైపర్‌సోనిక్ మిస్సైల్స్‌ను పరీక్షించినట్లు తెలుస్తోంది. కొత్తగా పరీక్షించిన హైపర్‌సోనిక్ క్షిపణి లో.. కొత్త తరహా ఫ్లయిట్, గైడెన్స్ కంట్రోల్ వ్యవస్థ ఉన్నట్లు చెప్పింది. కార్బన్ ఫైబర్‌తో చేసిన కొత్త ఇంజిన్ కొత్త మిస్సైల్‌లో ఉన్నది. సోమవారం జరిగిన పరీక్ష గురించి ఆ దేశ నేత కిమ్ జాంగ్ ఉన్ మాట్లాడారు. తాజా పరీక్షతో శత్రువులకు తామేంటో చూపించామన్నారు. మా ప్రయోజనాలను కాపాడుకునేందుకు.. దేనికైనా సిద్ధంగా ఉంటామన్నారు.

# గురుకులంలో మరోసారి ఫుడ్ పాయిజన్.. 23 మంది విద్యార్థులకు అస్వస్థత



**కరీంనగర్ :** రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ పరంపర కొనసాగుతూనే ఉంది. సీఎం, మంత్రులు గురుకులాల బాట పట్టినా విద్యార్థుల హాస్టల్స్‌లో ఎలాంటి మార్పులు రావడం లేదు. రోజు రోజుకు విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతూ పిట్టల్లా రాలి పోతున్నారు. తాజాగా కరీంనగర్ పట్టణం శర్మ నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 12గంటలకు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో 19 మందిని పాఠశాల సిబ్బంది ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.కాగా, రాష్ట్రంలోని గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. అధి కారుల నిర్లక్ష్యంతోనే ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆరోపి స్తున్నారు. మెస్‌చార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం పెడుతున్నాక కూడా విద్యార్థులు ఎందుకు దవాఖానల పాలవుతున్నారో ప్రభుత్వం చెప్పాలని నిలదీస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఓ వెలు గు వెలిగిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో మృత్యు కుహారాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎవడయ్యా ఆ తెలుగు మహాసభలు పెట్టింది.. సీఎం పేరు తెల్వనోడు యాంకర్ అవుతడా..



**హైదరాబాద్:** తెలుగు మహా సభల్లో సీఎం రేవంత్ రెడ్డి పేరు మర్చిపోయిన యాంకర్ బాలాదిత్యపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎవరో తెలవని వాళ్లు యాంకర్ అవుతారా అంటూ మండిపడ్డారు. తెలుగు మహాసభలు పెట్టిన వారికి బుద్ధి లేదా, అసలు ఆ సభలు పెట్టింది ఎవరంటూ ఫైరయ్యారు. ఎంపీగా ఉన్న నేనే పేపర్లలో రాసుకుని చదువుతున్నా.. ఒక ముఖ్యమంత్రి వస్తున్నప్పుడు ఏ సీఎం వస్తున్నడో తెలియకుండా యాంకర్ చదువుతడా అని విమర్శించారు. ముఖ్యమంత్రి పేరు చెప్పకపోవడం వెనుక ఎదో కుట్ర ఉందన్నారు.బిగ్ బ్రేకింగ్ న్యూస్ తెలుగు మహా సభల్లో పేరు మర్చిపోయిన యాంకర్ మీద విరుచుకుపడ్డ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి పేరు చెప్పకపోవడం వెనక ఎదో కుట్ర ఉందిఎవడయ్యా ఆ తెలుగు మహా సభలు పెట్టింది తెలుగు మహాసభలు పెట్టిన వాడికి బుద్ధి లేదా.. ముఖ్యమంత్రే తెలవని వాళ్లు అసలేం జరిగిందంటే..హైదరాబాద్ హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని హెూస్ట్‌గా వ్యవహరిస్తున్న సినీ నటుడు బాలాదిత్య ఆహ్వానించారు. అప్పుడు మన ప్రియతమ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కిరణ్‌కుమార్ గారు అంటూ ఉచ్ఛరించాడు. యాంకర్ నోటి నుంచి సీఎం కిరణ్‌కుమార్ అని రావడంతో సభ కింద ఉన్నవారంతా ఒక్కసారిగా కేకలు వేశారు. దీంతో తాను చేసిన తప్పును యాంకర్ గ్రహించాడు. ఆ వెంటనే తన తల పట్టుకుని స్టేజిపై నుంచి పక్కకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత మళ్లీ వచ్చి తన క్షమాపణలు చెప్పాడు. సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఉచ్ఛరించాడు.

# జాహ్నవి కారు ప్రమాదం కేసులో అమెరికా పోలీసుపై వేటు




**లాస్ వెగాస్:** 2023 ఫిబ్రవరిలో భారతీయ విద్యార్థిని కందుల జాహ్నవి అమెరికాలో పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొనడంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో సియాటిల్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. జాహ్నవిని ఢీకొట్టిన పోలీసు ఆఫీసర్ కెవిన్ దేవ్‌ను విధుల నుంచి తొలగించారు. సియాటిల్‌లో జనవరి 23వ తేదీన వీధిని క్రాస్ చేస్తున్న సమయంలో.. సుమారు 119 కిలోమీటర్ల వేగంతో వస్తున్న కెవిన్ దేవ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. ఆమె 100 ఫీట్ల దూరంలో పడిపోయింది. ఆ ప్రమాదంలో జాహ్నవి ప్రాణాలు కోల్పోయింది.అయితే ఆ ఘటన పట్ల సియాటిల్ పోలీసు చీఫ్ సూ రాహర్ చర్యలు తీసుకున్నారు. సియాటిల్ పోలీసు శాఖ నుంచి దేవ్‌ను బహిష్కరిస్తున్నట్లు పోలీసులు చీఫ్ తెలిపారు. దేవ్ సుమారు నాలుగు ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రగ్ ఓవర్‌డోసు బాధిత వ్యక్తిని కాపాడేందుకు వేగంగా వెళ్తున్న ఆఫీసర్ దేవ్.. ఆ వేగంలోనే రోడ్డు క్రాస్ చేస్తున్న జాహ్నవిని ఢీకొట్టాడు. అనుకోకుండా ప్రమాదం జరిగినా, దాని పర్యవసానాలను ఆమోదించలేమని పోలీసు చీఫ్ తెలిపారు.

పాజటివ్ ఉద్దేశంతో వేగంగా వెళ్తున్నా.. అతని నిర్ణయం వల్ల ఓ ప్రాణం బలైందన్నారు. దీంతో సియాటిల్ పోలీసుశాఖకు చెడ్డ పేరు వచ్చిందన్నారు. జాహ్నవి మృతి పట్ల నవ్వుకుంటూ కామెంట్ చేసిన మరో పోలీసు డేనియల్ ఆడెరర్‌ను కూడా ఫైర్ చేశారు.

# కర్ణాటకలో రెండు హెచ్ఎంపీవీ కేసులతో ఏపీ అప్రమత్తం : మంత్రి సత్యకుమార్



**అమరావతి :** కర్ణాటకలో రెండు హెచ్ఎంపీవీకేసులు వెలుగు చూడడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైరస్‌పై ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.వైరస్ పట్ల రాష్ట్రానికి ఏ ప్రమాదం లేదని ఐసీఎంఆర్ఏ స్పష్టం చేసిందన్నారు. కొత్త వైరస్‌పై అధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. నిరంతం నాలుగురోజులుగా సమీక్షలు నిర్వహిస్తున్నామని, అన్ని జిల్లాలో వైద్య సిబ్బంది అలెర్ట్ చేశామని పేర్కొన్నారు. కేంద్రంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు.వైద్య అధికారుతో బృం దాలను ఏర్పాటు చేశామని వివరించారు. ముందస్తు జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేసే ందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైరస్ వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మందులను పీసీఆర్ టెస్టులు , మల్టీప్లెక్స్, యూనిప్లెక్స్ టెస్టులు చేయవలసిన అవసరముంటుందని, వాటిని అందుబాటలో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కర్ణాటక, దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను దగ్గరునుంచి పరిశీలిస్తున్నామని తెలిపారు.

# టిబెట్‌ను వణికించిన భారీ భూకంపం.. 53 మంది మృతి..!



**హిమాలయ:**హిమాలయ దేశం నేపాల్‌ను వరుస భూకంపాలు వణికించాయి. మంగ ళవారం ఉదయం 7.1 తీవ్రతతో భారీ భూకంపం వచ్చి ంది. ఆ తర్వాత స్వల్ప తీవ్రతతో మరో రెం డుసార్లు ప్రకంపణలు వచ్చాయి. టిబెట్ కేంద్రంగా సంభవించిన ఈ భూకంపం ధాటికి భా రీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవిం చింది.నేపాల్‌తోపాటు చైనా, భారత్‌లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ భూకంపం ధాటికి కనీసం 53 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియాను ఉటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. అదే సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు పేర్కొంది.

# 3,35,27,925.. ఇది తెలంగాణ ఓటర్ల సంఖ్య!



**హైదరాబాద్ :**దీని ప్రకారం తెలంగాణలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,35,27,925గా తేల్చారు. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈ ఓటర్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేల్చారు.తెలంగాణ రాష్ట్ర ఓటర్ల లెక్క తేలింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025 ముగిసిన తర్వాత తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శనరెడ్డి ప్రకటించారు. దీని ప్రకారం తెలంగాణలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,35,27,925గా తేల్చారు. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈ ఓటర్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేల్చారు. మహిళా ఓటర్లు 1,68,67,735 ఓటర్లు ఉండగా.. పురుష ఓటర్లు 1,66,41,489గా నమోదయ్యారు. ట్రాన్స్ జెండర్లు 2,829గా తేల్చారు. మరో 15,872 మంది ఓటర్లు సర్వీసు ఓటర్లుగా తేల్చారు.తాజా జాబితాలో కొత్తగా 2,19,610 మంది ఓటర్లు చేరగా.. మరో 1,17,932 ఓటర్లను తొలగించారు. 2024 ఫిబ్రవరి ఎనిమిదిన ప్రకటించిన తుది జాబితా ప్రకారం అప్పట్లో రాష్ట్రం మొత్తంలో ఓటర్లు 3,30,21,735గా తేలింది.2024తో పోలిస్తే తాజాగా విడుదల చేసిన ఓటర్ల సంఖ్య పెరిగింది. ఓటర్లకు సంబంధించిన ఆసక్తికర అంశాల్ని చూస్తే.. 18-19 ఏళ్ల ఓటర్లు 5,45,026 మంది ఓటర్లు ఉండగా 85 ఏళ్లు.. ఆ పై ఉన్న ఓటర్లు 2,22,091గా తేల్చారు. ప్రవాస ఓటర్లు 3591 మంది ఉండగా.. దివ్యాంగ ఓటర్లు 5,26,993 మందిగా తేల్చారు.రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 35,356 నుంచి 25,907కు పెరిగింది. పట్టణ పోలింగ్ కేంద్రాల సంఖ్య 14,464 నుంచి 14,750కు పెరగ్గా.. గ్రామీణ పోలింగ్ కేంద్రాల సంఖ్య 20,892 నుంచి 21,157కు పెరిగింది. మొత్తం 551 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ఏర్పాటు కాగా.. అందులో 286 పట్టణ పోలింగ్ కేంద్రాలు.. 265గ్రామీణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నారు. కేవలం 29 నియోజకవర్గాల్లో మాత్రమే పురుష ఓటర్లు ఎక్కువగా ఉండటం గమనార్హం.హైదరాబాద్.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లోని నియోజకవర్గాలు మినహాయిస్తే దాదాపు అన్నిచోట్లా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లుగా గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా చూస్తే శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది ఓటర్లు ఉండగా.. కుత్బుల్లాపూర్ 7,34,155 ఓటర్లతో రెండో స్థానంలో నిలిచింది. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా భద్రాచలం (ఎస్టీ) 1,54,134 ఓటర్లు ఉన్నారు. 2 లక్షల లోపు ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో అశ్వరావుపేట (ఎస్టీ).. వైరా (ఎస్టీ).. బాన్సువాడ.. బెల్లంపల్లి (ఎస్సీ).. చెన్నూరు(ఎస్సీ) నియోజకవర్గాలు ఉన్నాయి.సవరణలలో భాగంగా హైదరాబాద్ లో అత్యధికంగా 12,502 మందిని.. సంగారెడ్డిలో 9,219 మంది ఓటర్లను తొలగించగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అతి తక్కువగా 831 మంది ఓటర్లను తొలగించారు. కొత్త ఓటర్లుగా అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 18,161 మంది.. హైదరాబాద్ లో 14,517 మంది.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 13,086 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. అతి తక్కువగా భూపాలపల్లి జిల్లాలో 13789 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు.

# కెనడా నూతన ప్రధానిగా అనిత.. జార్జ్.. ఎవరికి అవకాశం ఎంత?

**కెనడా :**దీంతో... తదుపరి ప్రధాని ఎవరనే విషయం ఆసక్తిగా మారిన వేళ.. ఇద్దరు భారత సంతతి నేతల పేర్లు తెరపైకి వచ్చాయి.కెనడా రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో అటు ప్రధానమంత్రి పదవితో పాటు, ఇటు లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతలనుంచి వైదొలగనున్నట్లు తెలిపారు. దీంతో... తదుపరి ప్రధాని ఎవరనే విషయం ఆసక్తిగా మారిన వేళ.. ఇద్దరు భారత సంతతి నేతల పేర్లు తెరపైకి వచ్చాయి.అవును.. కెనడా రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... కొత్త నాయకుడిని ఎన్నుకున్న అనంతరం తాను పార్టీ అధ్యక్ష పదవితో పాటు, కెనడా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు జస్టిన్ ట్రూడో ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో... నెక్స్ట్ ఎవరు అనే చర్చ తెరపైకి వచ్చింది.ఈ సమయంలో... తదుపరి కెనడా ప్రధాని రేసులు లిబరల్ పార్టీకి చెందిన పలువురు నేతల పేర్లు ప్రధానంగా వినిపించాయి. ఇందులో భాగంగా... ఆర్థిక మంత్రి డొమినిక్ లెబ్లాంక్ తదుపరి ప్రధానిగా ఎన్నికయ్యే అవకాశం ఉందని కథనాలొచ్చాయి. ఆయనతోపాటూ క్రిస్టినా ఫ్రీలాండ్, మెలనీ జోలీ, మార్క్ కార్నీ, క్రిస్టీ క్లార్క్ ల పేర్లు వినిపించాయి. వీరితో పాటు ప్రముఖంగా భారత సంతతికి చెందిన ఇద్దరూ



ఎంపీలూ జార్జ్ చాహల్, అనిత ఆనంద్ ల పేర్లు తెరపైకి వచ్చాయి. దీంతో... వీరు ఎవరు, భారత్ తో వీరికున్న సంబంధం ఏమిటి.. వీరిలో ఎవరైనా కెనడా ప్రధానిగా మారితే భారత్ తో ఆ దేశ సంబంధాలు ఏ మేరకు మెరుగవుతాయి అనే చర్చలు మొదలయ్యాయి.కారణం... గత కొంతకాలంగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అనుసరించిన వ్యవహార శైలిపై భారత్ సీరియస్ గా స్పందించిన సంగతి తెలిసిందే. ట్రూడో వైఖరితో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో భారత్ - కెనడా దౌత్య సంబంధాలు పతనావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో... కెనడా కొత్త ప్రధాని ఎంపికపై భారత్ లోనూ ఆసక్తి నెలకోంది.

ఎవరీ అనితా ఆనంద్?:2019లో ఓక్ విల్లే నుంచి ఎంపీగా ఎన్నికైన 57 ఏళ్ల అనితా ఆనంద్.. తండ్రి తమిళనాడుకు చెందిన డాక్టర్ కాగా.. తల్లి పంజాబీ మూలాలున్న మహిళ. అనితా ఆనంద్ ఎంపీగా ఎన్నికైన వెంటనే ట్రూడో క్యాబినెట్ లో చోటు దక్కించుకున్నారు. ఇందులో భాగంగా... 2019 నుంచి సుమారు మూడేళ్ల పాటు ప్రజాసేవల మంత్రిగా పని చేశారు.అనంతరం దాదాపు రెండేళ్ల పాటు రక్షణమంత్రిగానూ వ్యవహరించారు. ఈ క్రమలో గత నెలలలో జరిగిన మంత్రివర్గ పునర్వవస్థీకరణలో భాగంగా ఈమె రవాణా, అంతర్గత వాణిజ్య వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు అందుకున్నారు. ఈమె ఇప్పుడు ప్రధాని రేసులో ఉన్నట్లు చెబుతున్నారు.

జార్జ్ చాహల్ కు ఛాన్స్ ఎంత?:కెనడా కొత్త ప్రధానికి సంబంధించిన లిబరల్ పార్టీ నేతల రేసులో భారత సంతతికి చెందిన మరో వ్యక్తి గా జార్చ్ చాహల్ ఉన్నారు. ప్రస్తుతం హౌస్ ఆఫ్ కామన్స్ సభ్యుడిగా ఉన్న ఆయన.. స్టాండింగ్ కమిటీకి నేతృత్వం వహించారు. ఇదే సమయంలో.. సిక్కుల కాకస్ కు అధ్యక్షుడిగానూ పనిచేశారు.ఈ క్రమంలో... చాహల్ ను లిబరల్ పార్టీ లెజిస్లేటివ్ కాకస్ తాత్కాలిక నేతగా నియమించింది. ఈ నేపథ్యంలో.. ఆ కారణంతో ఆయన పార్టీ నాయకుడిగా గెలిచినా ప్రధాని పదవి మాత్రం చేపట్టేందుకు అర్హుడు కాదని అం టున్నారు. కారణం... కెనడా ప్రకారం..వీలులేకపోవడమే!

# ఆదివారం అర్ధరాత్రి వెళ్లిపోయిన స్టెల్లా షిప్




**కాకినాడ :**ఎట్టకేలకు ఈ నెల ఐదో తేదీ (ఆదివారం) అర్ధరాత్రి వేళలో కాకినాడ పోర్టు నుంచి వెళ్లిపోయింది.సీజ్ ద షిప్ అంటూ కాకినాడ పోర్టులో స్టెల్లా షిప్ ను ఉద్దేశించి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ఆదేశంతో.. సదరు షిప్ కాకినాడ పోర్టులోనే నిలిచిపోయింది. ఎట్టకేలకు ఈ నెల ఐదో తేదీ (ఆదివారం) అర్ధరాత్రి వేళలో కాకినాడ పోర్టు నుంచి వెళ్లిపోయింది. అది కూడా 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యంతో. పశ్చిమ ఆఫ్రికాకు బయలుదేరిన షిప్ తో.. ఒక ఘట్టం ముగిసినట్లైంది.పేద ప్రజలకు అందించాల్సిన పీడీఎస్ బియ్యం అక్రమంగా కాకినాడ పోర్టుకు రావటం.. అక్కడి నుంచి పశ్చిమ ఆఫ్రికా దేశాలకు అక్రమంగా తరలి వెళ్లే సమాచారాన్ని అందుకున్న డిప్యూటీ సీఎం పవన్..కాకినాడ పోర్టుకు చేరుకొని తనిఖీలు చేసి.. ఆ కుట్రను బయటపెట్టారు. ఈ క్రమంలో షిప్ ను సీజ్ చేయాలని ఆదేశించారు. కేంద్రం అధీనంలో నడిచే పోర్టులో.. షిప్ ను ఒక డిప్యూటీ ముఖ్యమంత్రి ఎలా ఆదేశిస్తారన్న ప్రశ్న పలువురి సంధించారు. అయినప్పటికీ.. డిప్యూటీ సీఎం పవర్ ఎంతన్న విషయం తెలిసేలా.. షిప్ పోర్టులోనే నిలిచిపోయింది.చివరకు ఈ ఇష్యూకు సంబంధించిన పలు పరిణామాలు చోటు చేసుకున్న అనంతరం.. 38 రోజుల పాటు సదరు షిప్ పోర్టులోనే ఉండిపోయింది. స్టెల్లా నౌకలో 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఉంటే అందులో మూడో నెంబరులో సత్యం బాలాజీ ఎక్స్ పోర్ట్ ఇండస్ట్రీకి చెందిన 1320 మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యంగా లెక్క తేల్చారు. నౌకనుసీజ్ చేసిన నేపత్యంలో నవంబరు 29నుంచి డెమరేజ్ చెల్లించాలని నౌక యాజమాన్యం అంటున్న సమయంలోనే తుపాను కార ణంగా డిసెంబరు 4 వరకు డెమరేజ్ వేయొద్దని ఎగు మతిదారులు పేర్కొన్నారు. ఈ వివాదం ఒక కొలిక్కి రా లేదు.పోర్టులో నౌక నిలిచిపోయిన 38 రోజులకు సుమారు రూ.7 కోట్లకు పైనే డెమరేజ్ పడుతుందని లెక్క కట్టారు. నిబం ధనలకు విరుద్ధంగా ఎగుమతి చేసే ప్రయత్నం చేసిన పీడీఎస్ బియ్యం విలువను మార్కెట్ రేటుతో లెక్క కడితే.. బియ్యం విలువ రూ.5.5 కోట్లు కాగా.. డెమరేజ్ రూపంలో చెల్లించాల్సింది రూ.7 కోట్ల వరకు కావటం గమనార్హం. మొత్తంగా.. అక్రమ పద్ధతిలో బియ్యాన్ని ఎగుమతి చేసే ప్రయత్నం చేసిన సత్యం బాలాజీకి భారీ దెబ్బ తగిలినట్లుగా చెబుతున్నారు.

# వీళ్లు మనుషులేనా? అవినీతిని బయటపెట్టాడని పాశవికంగా చంపేశారు

**ఛత్తీస్‌గఢ్ :** హత్యల గురించి తెలిసిందే. మన దేశంలో నిత్యం ప్రతి గంటలో.. ఏదో ఒక మూలన హత్యలు జరగటం తెలిసిందే. హత్యల గురించి తెలిసిందే. మన దేశంలో నిత్యం ప్రతి గంటలో.. ఏదో ఒక మూలన హత్యలు జరగటం తెలిసిందే. అయితే.. ఒక హత్య ఇప్పుడు సంచలనంగా మారటమే కాదు.. వైద్యులు సైతం తమ అనుభవంలో ఇంత పాశవిక హత్యను తామెప్పుడు చూడలేదని విస్మయానికి గురవుతున్నారు. హింసాత్మక వార్తలు చదవటం ద్వారా ఒత్తిడికి గురయ్యే వారు.. సున్నిత మనస్కులు ఈ వార్తను చదవకుండా స్కిప్ చేయటం మంచిది. కాకుంటే.. ఈ దారుణ హత్య గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజల సొమ్మును పప్పుబెల్లాల మాదిరి పంచేసుకున్న అవినీతి పందికొక్కుల గురించి రాసిన ఒక కథనం సంచలనంగా మారితే.. తమ గుట్టుమట్లను బయటకు తీసిన జర్నలిస్టు ఒకరిని



అత్యంత పాశవికంగా హత్య చేసిన వైనం ఇప్పుడు షాకింగ్ గా మారింది. రూ.120 కోట్ల విలువైన కాంట్రాక్టులో చోటు చేసుకున్న అవినీతిని బయటపెట్టాడని బస్తర్ కు చెందిన ముఖేష్ అనే జర్నలిస్టు దారుణ హత్యకు గురయ్యాడు.

ఒక జాతీయ మీడియా సంస్థలో ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పని చేస్తున్న అతను.. బస్తర్ ప్రాంతంలోని గంగలూరు నుంచి హిరోలి వరకు రూ.120కోట్లతో రోడ్డు ప్రాజెక్టు పనుల్ని మొదలు పెట్టారు. ఈ ప్రాజక్టులో భారీగా అవినీతి జరిగిందని.. ముకేశ్ కథనాన్ని చేశారు. తొలుత రూ.50 కోట్ల టెండర్ తో మొదలైన ఈ ప్రాజెక్టు.. పూర్తిస్థాయిలో జరగలేదని.. ఈ ప్రాజెక్టు రూ.120 కోట్లకు చేరుకుంటుందన్న అంచనాను వ్యక్తం చేస్తూ రాసిన కథనం సంచలనంగా మారింది.కట్ చేస్తే.. ఈ కథనం పబ్లిష్ అయ్యాక అతను కనిపించకుండా పోయాడు. ఈ అవినీతి ప్రాజెక్టుకు కాంట్రాక్టర్ గా వ్యవహరిస్తున్న సురేష్ చంద్రకర్ ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ లో శవంగా కనిపించాడు. పచ్చబొట్టు ఆధారంగా ఆ డెడ్ బాడీని ముఖేష్ దిగా గుర్తించారు. అందుకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

# చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు రూ.3 లక్షల నష్ట పరిహారం



**మణుగూరు:**తీసుకున్న రుణం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో రుణం ఇచ్చిన వ్యక్తి చెక్ బౌన్స్ తో కోర్టును ఆశ్రయించగా, పూర్వాపరాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ కంభవు సూరి రెడ్డి ఆరు నెలల జైలు శిక్షతో పాటు మూడు లక్షల నష్ట పరిహారం విధించారు. వివరాలిలా ఉన్నాయి. 2020లో మణుగూరుకు చెందిన కంకటాల నాగ వెంకట శ్రీనివాస్ బాయి కూనవరం నకు చెందిన మొహిద్ ముత్తుజా కు రూ.3లక్షలు రుణం ఇచ్చాడు. అందుకు గాను తీసుకున్న చెక్కును శ్రీనివాస్ బ్యాంక్ లో జమ చేయగా, బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కోర్టులో కేసు దాఖలు చేయగా, సాక్షాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ కంభపు సూరి రెడ్డి మత్తుజా కి రూ. 3లక్షల జరిమానా విధించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నెల వ్యవధిలో 3 లక్షల నగదు కట్టని పక్షంలో మరో నెల కాలం జైలు శిక్షను అదనంగా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఫిర్యాదిదారుని తరుపున న్యాయవాదులు ఎస్వీ రమణారెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, సీహెచ్. గురు కృష్ణ లు వాదించారు.

# క్రీడాకారులకు బహుమతులు అందజేత




**తొర్రూరు :**నెహ్రూ యువ కేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. బాలికల కబడ్డీ విభాగంలో మొదటి బహుమతి హరిపిరాల గ్రామ బాలికలు, ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ పాఠశాల బాలికలు, బాలికల బ్యాట్మెంటన్ విభాగంలో మొదటి బహుమతి ఈ. స్పూర్తి కంటయపాలెం, ద్వితీయ బహుమతి ఏ. ఐశ్వర్య హరిపిరాల, 200 మీటర్స్ రన్నింగ్ విభాగంలో మొదటి బహుమతి ఎస్డి అసిఫా జిల్లా పరిషత్ హరిపిరాల, ద్వితీయ బహుమతి జె.నిఖిత జిల్లా పరిషత్ తొర్రూర్, బాలుర వాలీబాల్ విభాగంలో తొర్రూర్ హై స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి కంటయపాలెం పాఠశాల విద్యార్థులు, బ్యాట్మెంటన్ విభాగంలో మొదటి బహుమతి వివేక్, ద్వితీయ బహుమతి సాయి ప్రకాష్,రన్నింగ్ విభాగంలో మొదటి బహుమతి ఎ.నీలేష్ జడ్.పి.హెచ్.ఎస్ కంటేపాలెం, ద్వితీయ బహుమతి ఎం సాయి కృష్ణ జడ్పీహెచ్ఎస్ తొర్రూర్ లు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఈటిలు, నవయుగ విజన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు బానోతు వీరన్న నాయక్, యూత్ ప్రధాన కార్యదర్శి లునావత్ అఖిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు సబ్ డివిజన్లో పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు




**మణుగూరు :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు నిర్వహించారు.ఏడూళ్ల బయ్యారం, మణుగూరు, అశ్వాపురం పోలీసులు ప్రధాన రహదారి వెంట ఆటో వాహన దారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అశ్వాపురం ప్రధాన కూడలి లో సీఐ అశోక్ రెడ్డి, ఇ.బయ్యారంలో సీఐ వెంకటేశ్వర రావు, మణుగూరు సతీష్ మీడియా తో మాట్లాడుతూ...ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనా కలిగి ఉండాలని, జాగ్రత్తగా తో ప్రయాణించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ఎవ్వరికీ ప్రమాదం జసరుగదన్నారు. వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపడం చేయవద్దన్నారు. రోడ్డు పై పార్కింగ్ చేసేటప్పుడు కూడా ట్రాఫిక్ జాం కాకుండా మీ వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. ప్రతి వాహన దారుడు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మితి మీరిన వేగం ప్రమాదకరమన్నారు.. మీ పై ఆధార పడ్డ మీ కుటుంబ సభ్యులను గుర్తుంచుకొని వాహనాలు నడపాలన్నారు.కార్యక్రమం లో ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్ లు, వివిధ వాహనదారులు పాల్గొన్నారు.

# 13 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత డమాస్కస్‌లో తొలి ఖతారీ ఫ్లైట్ ల్యాండ్..!




**ఖతార్ :**దాదాపు 13 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఖతార్ చెందిన విమానం సిరియా రాజధాని డమాస్కస్‌లో ల్యాండ్ అయ్యింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఖతారీ ఫ్లైట్ డమాస్కస్‌లో ల్యాండ్ అయ్యిందని ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఉదయం ఖతార్‌లోని దోహా నుంచి బయలుదేరిన వాణిజ్య విమానం మధ్యాహ్నానికి డమాస్కస్‌కు చేరుకుంది.సిరియాలో బషర్ అల్ అసద్ నియంత పాలన కారణంగా దాదాపు 14 ఏళ్లుగా అంతర్యుద్ధం కొనసాగింది. దాంతో అంతర్జాతీయ విమానాల రాకపోకలపై అక్కడ నిషేధం విధించారు. నెల రోజుల క్రితం తిరుగుబాటుదారులు బషర్ అల్ అసద్‌ను తరిమికొట్టడంతో తాజాగా అంతర్జాతీయ విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. దాంతో 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఖతార్ ఫ్లైట్ సిరియాలో దిగింది.అంతకుముందు డమాస్కస్ విమానాశ్రయం నుంచి ఓ విమానం సౌదీ అరేబియాలోని షార్జాకు వెళ్లింది. అది సిరియా నుంచి బయటి దేశానికి వెళ్లిన తొలి విమానం. ఆ విమానం బయలుదేరి వెళ్లిన కొన్ని గంటలకే ఖతార్ విమానం డమాస్కస్‌లో ల్యాండ్ అయ్యింది.

# కేశంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాద్ నగర్ సి.హెచ్.సి ఆసుపత్రికి అదనపు నిధులు మంజూరు చేయండి

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్ జనవరి07:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజ కవర్గంలోని 30 పడకల కేశ ంపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి అలాగే షాద్ నగర్ పట్టణ ంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రికి అదనపు నిధులు మంజూరు చేయ గలరని అరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహా ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కోరారు. కేశం పేట్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రికి అదనంగా 22.80 లక్షల రూపాయలు కేటా యిస్తే ఉపయోగంలోకి వస్తుం దని తెలిపారు. అలాగే షాద్ నగర్ లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ ఆసు పత్రికి అదనంగా 5.31 కోట్ల రూపా యలు కేటాయిస్తే మార్చురి, మోడ్రన్ కిచెన్,మెకానికల్ లాండ్రి, కాంపౌండ్ వాల్,సీసీ రోడ్డు,పార్కింగ్ షెడ్,బయో మెడికల్ వెస్టేజి భవనం లాంటి నిర్మా ణాలు పూర్తి అవుతాయని తెలి పారు.కేశం పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు షాద్ నగర్ కమ్యూనిటీ హెల్త్ సెం టర్ నిర్మాణం పూర్తి అయితే నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించటానికి మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థనకు సాను కూలంగా స్పందించిన మంత్రి అదనపు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు కొందుర్గు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ జెర్సీలను ఆవిష్కరించిన బీఆర్ఎస్ యువ నాయకుడు రవీందర్ యాదవ్

## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయంతో జెర్సీల అందజేత




**షాద్ నగర్ జనవరి07:**గ్రామీణ క్రీడాకారులకే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ యువనాయకుడు రవీందర్ యాదవ్ అన్నారు. మంగళవారం షాద్ నగర్ బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో కొందుర్గు ప్రీమియర్ క్రికెట్ లీగ్ క్రీడాకారుల జెర్సీలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడలకు ప్రాధాన్యత పెరుగుతుందని, నేటి తరం యువత క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని కోరారు. క్రీడల పోటీలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. గత కొన్నాళ్లుగా ప్రతి యేటా గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆదర్శనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ మాజీ ఎంపీటీసీ గోపాల్ పీఏ సీఎస్ డైరెక్టర్ జగదీశ్వర్ గౌడ్ బీఆర్ఎస్ యూత్ వింగ్ కంది రాఘవేందర్ గౌడ్, చీపిరి సాయి యాదవ్, గుడ్డు యాదవ్, కాట్న ఆంజనేయులు, దుమ్మని నవీన్, సాయి, సచిన్, ఆర్గనైజింగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీ విండ్సార్ ఈవీ ధరలు పెంచిన ఎంజీ మోటార్.. ఫ్రీ చార్జింగ్‌కూ ఇక రాంరాం..!



**హైదరాబాద్:**జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తన పాపులర్ ఈవీ విండ్సార్ ధరలు పెంచేసింది. అన్ని వేరియంట్లపై రూ.50 వేల చొప్పున పెంచుతున్నట్లు ప్రకటిం చింది. దీంతో విండ్సార్ ఈవీ ఇంట్రడ్యూసరీ ధరలకు తెర దించింది. అలాగే ఫ్రీ-చార్జింగ్ బెనిఫిట్లకు కూడా రాంరాం చెప్పేసింది. విండ్సార్ ఈవీ కారును మార్కెట్లో ఆవిష్కరించినప్పుడే తొలి 10 వేల కార్లు / డిసెంబర్ నెలాఖరు వరకూ ఇంట్రడ్యూసరీ ధరలను జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ప్రకటించింది. 2024 డిసెంబర్ నెలాఖరుకల్లా పది వేల యూనిట్లు విక్రయించిన మైలురాయిని చేరుకుంది. తాజాగా ధరల సవరణతో జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ విండ్సార్ ఈవీ కారు ధర ఎక్సైట్ వేరియంట్ రూ.13.99 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. మిడ్ లెవల్ ఎక్స్‌క్లూజివ్ ట్రిమ్ రూ.14.99లక్షలు, టాప్ స్పెక్ ఎస్సెన్స్ వేరియంట్ రూ.15.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.కాంప్లిమెంటరీ చార్జింగ్ ఆఫర్‌లో భాగంగా విండ్సార్ ఈవీ కార్లు తొలుత కొనుగోలు చేసిన కస్టమర్లకు ఎంజీ ఈ-హబ్ యాప్ ద్వారా ఫ్రీగా చార్జింగ్ వసతి కల్పించింది జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్. కానీ ఈ ఆఫర్‌ను ఉపసంహరిస్తున్నట్లు స్పష్టం చేసింది. తొలి విండ్సార్ ఈవీ కారు యజమానికి జీవిత కాల వారంటీ అందిస్తున్నట్లు తెలిపింది. తదుపరి కొనుగోలు చేసిన వారికి ఎనిమిదేండ్లు లేదా 1.60లక్షల కి.మీ వరకూ వారంటీ అందిస్తున్నది. 38 కిలోవాట్ల బ్యాటరీతో 136 పీఎస్ విద్యుత్, 200 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. సింగిల్ చార్జింగ్‌తో 331 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. బహుళ చార్జింగ్ ఆప్షన్లకు విండ్సార్ ఈవీ కారు మద్దతుగా ఉంటుంది.డీసీ ఫాస్ట్ చార్జింగ్ తో కేవలం 55 నిమిషాల్లో 10-80 శాతం చార్జింగ్ అవుతుంది. కన్వీనియంట్ చార్జింగ్ కోసం పోర్టబుల్ చార్జర్ అండ్ ఆప్షనల్ హెూం వాల్ బాక్స్ ఉంటాయి. మార్కెట్లో ఆవిష్కరించిన మూడు నెలల్లోనే 10,045 యూనిట్ల విక్రయంతో విండ్సార్ ఈవీ పాపులారిటీ సంపాదించుకుంది.

# రైతు సంక్షేమాన్ని చూసి ఓర్వ లేకనే ధర్నాలు..

**/పెద్దపల్లి:** రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ ధర్నాలు, ఆందోళనలు చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్కె గార్డెన్స్ లో మంగళవారం రోజున ఎమ్మెల్యే విజయరమణా రావు పత్రికా, మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కూడా లేకుండా పోతుందనే భయంతో బిఆర్ఎస్ లీడర్లు రోడ్లపైకి వచ్చి రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతులకు ఎందుకు రుణమాఫీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. కటింగ్ లేకుండా వడ్లు కొనుగోలు ఎందుకు చేయలేదని నిలదీశారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో రూ.239 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని చెప్పారు.

# మీ కాళ్లు బలహీనంగా ఉన్నాయా.. వీటిని తినండి.. దృఢంగా మారుతాయి..!

**హైదరాబాద్:**శరీరంలోని అన్ని అవయవాలు బలంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్రతి ఒక్క అవయవం ఆరోగ్యంగా, దృఢంగా ఉంటేనే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్రమంలోనే కొందరు శరీరం ఎంత దృఢంగా ఉన్నప్పటికీ కాళ్లు బలహీనంగా ఉంటాయి. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది. అలాగే కండరాల నిర్మాణం కూడా సరిగ్గా ఉండదు. దీంతో పాదాల నొప్పులు వస్తుంటాయి. అయితే సరైన ఆహారం తీసుకుంటే శరీరంలోని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉండి కండరాల నిర్మాణం జరగాలంటే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. పలు ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కాళ్లను దృఢంగా ఉంచుకోవచ్చు. కాళ్లలో ఉండే కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.చికెన్..చికెన్‌ను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. అయితే చికెన్‌లో లెగ్ పీస్‌లను తింటుంటారు. ప్రోటీన్లు కావాలంటే చికెన్ బ్రెస్ట్ పీస్‌లను తినాలి. లెగ్ పీస్‌లకు కొవ్వు బాగా ఉంటుంది. కనుక లెగ్ పీస్‌లను తినకూడదు. బ్రెస్ట్ పీస్‌లలో ప్రోటీన్లు ఉంటాయి. కనుక బ్రెస్ట్ పీస్‌లను తింటే కండరాలకు బలం కలుగుతుంది. ముఖ్యంగా కాళ్లలో ఉండే కండరాలు నిర్మాణం అవుతాయి. కండరాలు దృఢంగా మారుతాయి. అదేవిధంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. దీంతోపాటు కండరాలకు బలం కలుగుతుంది. పెరుగును తింటున్నా కూడా కాళ్లు బలంగా మారుతాయి. ఆరోగ్యంగా



ఉంటాయి. పెరుగులో ఉండే ప్రొబయోటిక్ ఆహారాలు, ప్రోటీన్లు కండరాలకు మేలు చేస్తాయి. కనుక పెరుగును రోజూ తినాలి.పనీర్..పనీర్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పనీర్ ద్వారా మనకు ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది. కాళ్లు బలహీనంగా ఉన్నవారు పనీర్ ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కాళ్లలోని కండరాలు దృఢంగా మారుతాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే పాలకూరను తినడం వల్ల కూడా కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల శరీరానికి కావల్సిన క్యాల్షియం లభించడంతోపాటు ప్రోటీన్లు కూడా అందుతాయి. దీంతో కాళ్లు దృఢంగా మారుతాయి. అలాగే కాళ్లు బలంగా మారాలంటే చిలగడదుంపలను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ప్రోటీన్లను, శక్తిని అందిస్తాయి.చియా విత్తనాలు..ఇక సముద్రపు చేపలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఈ చేపలను తింటే మంచిది. దీంతో మన శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి ఎంతగానో దోహదం చేస్తాయి. దీంతో కాళ్లు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. అలాగే క్వినోవాను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందిస్తాయి. కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ప్రోటీన్లను అందిస్తాయి. దీని వల్ల కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా చియా విత్తనాలను కూడా తినవచ్చు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కాళ్లను బలంగా మారుస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల కాళ్లు బలంగా మారుతాయి. శరీరానికి కూడా శక్తి లభిస్తుంది.

# లిస్టింగ్‌లోనే అదరగొట్టిన ఇండోఫామ్.. సంస్థ షేర్ 20.18 శాతం వృద్ధి



**హైదరాబాద్:**వ్యవసాయ పరికరాల తయారీ సంస్థ ఇండో ఫామ్ ఎక్విప్‌మెంట్ షేర్లు మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టయ్యాయి. గత వారం ఐపీఓ ద్వారా ఇండో ఫామ్ ఎక్విప్‌మెంట్ దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎంటరైంది. ఇష్యూ షేర్ ధర రూ.215 కాగా, మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో 20 శాతానికి పైగా విలువతో ట్రేడయింది. బీఎస్ఈలో 20.18 శాతం వృద్ధితో రూ.258.60 వద్ద ట్రేడ్ ప్రారంభమైంది. తదుపరి 33.44 శాతం వృద్ధితో షేర్ రూ.289.60 పలికింది. మరోవైపు, ఎన్ఎస్ఈలో 19 శాతం పుంజుకుని రూ.256 వద్ద ప్రారంభమైంది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,355.30 కోట్ల వద్ద స్థిర పడింది.గత వారం ముగిసిన ఇండోఫామ్ ఎక్విప్‌మెంట్ ఐపీఓలో ఇన్వెస్టర్లు 227.57 రెట్లు బిడ్లు దాఖలు చేశారు. గురువారం నాడు ఈ సంస్థ ఐపీఓ ముగిసింది. రూ.204-215 మధ్య ఖరారైన షేర్ ప్రైస్ బాండ్‌తో రూ.260 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంతో ఇండోఫామ్ ఎక్విప్‌మెంట్ ఐపీఓకు వెళ్లింది. ఇందులో తాజాగా 86 లక్షల వాటాల జారీ ద్వారా, ప్రమోటర్ రణ్‌బీర్ సింగ్ ఖాండ్వాలియాకు చెందిన 35 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించింది. ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను కంపెనీ విస్తరణకు వినియోగిస్తామని తెలిపింది ఇండోఫామ్.

# హరిణవనస్థలి అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం



**పెద్దఅంబర్‌పేట, జనవరి 7:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని హరిణవనస్థలి అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచే సుకున్నది. ఫతుల్లాగూడలోని ముక్తిఘాట్‌కు ఎదురుగా ఉన్న అటవీప్రాంతం వెంట వాహనదారులతోపాటు సమీపంలోని పలువురు ఇండ్ల యజమానులు చెత్తచెదారాలను వేస్తున్నారు. పాడయిన వస్తువులు, సోఫాలు తదితర పనికిరాని వాటిని అటవీప్రాంతంలోకి విసిరేస్తున్నారు. ఎవరైనా సిగరెట్ తాగి పడేయడం వల్ల లేదా చెత్తను తగలబెట్టే క్రమంలో మంటలు చెలరేగినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు.గంట వ్యవధిలోనే మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. కొంత అటవీ ప్రాంతంలోకి విస్తరించాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకశాఖ, నాగోల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సాగర్ పర్యవేక్షణలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. స్థానికులు చెత్తను అటవీప్రాంతానికి ఆనుకుని పడేస్తున్నారని, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఉండొచ్చని పేర్కొన్నారు. చలికాలం కావడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందలేదు. అదే ఎండాకాలం అయి ఉంటే పెను ప్రమాదమే జరిగేది. జింకలు, నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు తదితర జంతు సంపదకు నిలయమైన వణ్యప్రాణులకు నెలవైన హరిణవనస్థలి అటవీ ప్రాంతం సంరక్షణపై అధికారులు సైతం శ్రద్ధ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆందోళన కలిగిస్తున్న కొత్త వైరస్.. సురక్షితంగా ఉండాలంటే ఇమ్యూనిటీని ఇలా పెంచుకోండి..



**చైనా :**కరోనా భయం ఇంకా పూర్తిగా తొలగకముందే ప్రస్తుతం మరో కొత్త వైరస్ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. చైనాలో కొత్తగా హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) వ్యాప్తి చెందుతుండడంతో అక్కడ హాస్పిటల్స్ అన్నీ కిక్కిరిసిపోతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్ చల్ చేస్తున్నాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా దేశాలు అలర్ట్ అయ్యాయి. ఇక భారత్ లోనూ హెచ్ఎంపీ వైరస్‌కు చెందిన కేసులు 5 నమోదైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే ఈ కొత్త వైరస్ కూడా కరోనా లాంటి లక్షణాలను కలిగిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని వారు సూచిస్తున్నారు. అయితే ఇందుకు గాను మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో సహజసిద్ధంగా లభించే పదార్థాలతోనే మన ఇమ్యూనిటీ పవర్‌ను రెండింతలు పెంచుకోవచ్చు.

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# ఖమ్మం ఫోటోగ్రాఫర్ నవీన్ కు జాతియ అవార్డు





**ఖమ్మం :జనవరి 7,** హుస్సేన్ ఖాన్ సెవెంత్ నేషనల్ వర్క్ షాప్ ఒడిస్సా బోండాస్ జనవరి 5,6 రెండు రోజులు జరిగిన వర్క్ షాప్ వివిధ రాష్ట్రాల నుండి ఫోటోగ్రాఫర్లు పాల్గొనడం జరిగింది. అంతరించిపోతున్న గిరిజన జాతి నందు బోండా తెగను వారి యొక్క సాంప్రదాయ వేషధారణ నృత్యాలు, జీవనశైలి విధానాలపై ఒడిశా రాష్ట్రం పరిసర ప్రాంతాలలో ఫోటో వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ ఫోటో వర్క్ జాతీయ హుస్సేన్ ఖాన్ ఏడవ జాతీయ స్థాయి ఫోటో వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. దీనికి గౌరవ అధ్యక్షతన హుస్సేన్ ఖాన్ స్వయంగా పాల్గొనడం జరిగింది. ఆయనతోపాటు ఏఆర్పిఎస్, ఎఫ్ఆర్పిఎస్, ఏఎఫ్ఐపి, ఎఫ్ఐపి మెంబర్స్,వివిధ రాష్ట్రాల నుండి ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్, ఫోటో జర్నలిస్టు, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డు ప్రధాన ఉత్సవంలో మాట్లాడుతూ తీసిన చిత్రాల గురించి వివరిస్తూ, కొందరి లోపాలను వివరించి పొరపాట్లను సరి చేసుకుని, తరువాతి వర్క్ షాపు నందు కష్టపడి పనితీరును మెరుగుపరచుకోవాల్సిందిగా హుసైన్ ఖాన్ వివరించడం జరిగింది.

# లౌక్య సీడ్స్ కంపెనీ వారి విత్తనం శరణ్య 151 మిర్చి తోట క్షేత్ర ప్రదర్శన



**గార్ల :జనవరి 7,** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం గోపాలపురం గ్రామం ఆంగోత్ తండా ఆంగోత్ గోగ్య నాయక్ పండించిన మిర్చి తోటలో క్షేత్ర ప్రదర్శనను లౌక్య సీడ్స్ కంపెనీ వారి విత్తనం శరణ్య 151 మిర్చి అధిక కాయలు కాయడంతో కంపెనీవారు మిర్చితోటను ఎంచుకొని క్షేత్ర ప్రదర్శనను చేపట్టారు. ఈ మిర్చితోటలో అధిక దిగుబడి, అత్యధిక రాబడి నిచ్చు హైబ్రిడ్ మిరప సన్న రకం,ముదురు ఎరుపు రంగులో ఉండి అధిక ఘాటు కలిగి,ఆయిల్ శాతం ఎక్కువ ,మొక్కలు, కొమ్మలు దృఢముగా వ్యాపించే రకము .ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అక్షయ్,డిస్ట్రిబ్యూటర్ గ్రీస్ సీడ్స్ లింగాల సురేష్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనములను ఎంపిక చేసుకోవాలని,ఈ విత్తన లక్షణాలను వివరిస్తూ గుబ్బ వైరస్, నల్లతామర ను తట్టుకునేశక్తి,కాయసైజు, గింజశాతం అధికంగా ఉంటుందని, ఎరుపురంగు కలిగి, దిగుబడి ఎకరానికి 35 నుండి 40 క్వింటాలు ప్రతి ఎకరాకు దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండి అక్షయ్, కంపెనీ ఎస్.ఓ బానోత్ శివలాల్ ,డీలర్ రైతుమిత్రట్రేడర్స్ బండి అనిల్, పాల్గొనీ ఆంగోత్ గోగ్య నాయక్ ను శాలువా కప్పి సన్మానించారు.

# ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: డిసెంబర్ 07,** బెజ్జూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెజ్జూర్ మండల విద్యా ధికారి సునీత చేతులమీదుగా ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తలండి లక్ష్మణ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 3 చట్టం చేయాలని అన్నారు. ప్రభుత్వం ఎస్ ఎస్ ఏ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి, వారిని తిరిగి విధు ల్లోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చింటపూరి రాజారాం, సోమిని హెచ్ఎం బిక్షమయ్య, రమేష్, రాములు, పరదేశి, హ న్మత్, ఆదివాసి పెద్దలు శకారాం, తిరుపతి, బెజ్జూర్ మండల సర్మేడి శంకర్ తదితరులు ఉన్నారు.

# గ్రామపంచాయతీని వేరు చేయొద్దు కలిసి ఉంటాం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క శంకర్



**కౌటాల :జనవరి 07** :కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండల కేంద్రంలోనిశివలింగపూర్ గ్రామంను గ్రామపంచాయతీగా వేరు చేయొద్దని, కౌటాల గ్రామపంచాయతీలో విలీనమై ఉన్న గ్రామాలన్నీ ఒకే గ్రామపంచాయతీగా ఉంటామని అవసరం ఉంటే మేజర్ గ్రామపంచాయతీగా చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు నక్క శంకర్ అన్నారు. కొందరు రాజకీయ లబ్ధి కొరకు అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ ను మరియు అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తప్పుడు సమాచారంతో గ్రామ పంచాయతీని ఉమ్మడిగా ఉంచాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారని ఆరోపించారు. కౌటాల గ్రామపంచాయతీలో విలీనమైన శివలింగాపూర్ గ్రామం 500 మీటర్ల లోపే ఉందని కానీ తమ స్వార్థం కోసం ఐదు కిలోమీటర్ల దూరం ఉన్నట్లు అధికారులను కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు, అధికారులు వెంటనే పరిశీలించి ఉమ్మడి గ్రామపంచాయతీ గా ఉన్న తమ గ్రామాన్ని విడదీయొద్దని నక్క శంకర్ కౌటాల గ్రామ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు

# ఎస్సై కొమరయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు



**పెంచికలపేట్ :** :పెంచికలపేట్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో వాహనదారులు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కొమురయ్య మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దనారు. వాహన దారులు తమ వెంట అన్ని ధ్రువ పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. డయల్ 100,1930 గురించి వివరించారు.

# ఆర్.బి.ఐ క్యాలెండర్ ల ఆవిష్కరణ



**ఆదిలాబాద్ జిల్లా, తలమడుగు : జనవరి 07,** :ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో మంగళవారం రోజున మావల సిఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా ఎల్డిఎం ఉత్పల్ కుమార్ ధామ్ గ్రామ ప్రజలతో కలిసి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యాలెండర్లను విడుదల చేశారు. అనంతరం ఎల్డిఎం ఉత్పల్ కుమార్ ధామ్ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కొరకే బ్యాంకులు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. బ్యాంకులు ఆర్థిక ఎదుగుదలకు ఒక వేదికగా పనిచేస్తాయని, వినియోగదారులు నేరుగానే బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. జన సురక్ష కార్యక్రమంతో కుటుంబాలకు భీమా భరోసా ఉంటుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ కమలాకర్, సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అకౌంట్ కలిగి ఉండాలని తెలిపారు. సంపాదనకు అనుగుణంగా ఖర్చు చేస్తూ, కొంత డబ్బును పొదుపు చేస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకులలో డబ్బు డిపాజిట్ చేయడం వల్ల డబ్బు సురక్షితంగా ఉంటుందని, వడ్డీ వస్తుందని తెలిపారు. బ్యాంక్ అకౌంట్ లేనివారు జీరో అకౌంట్ తీసుకోవాలని సూచించారు. ఏటీఎం వినియోగం గురించి తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపి అట్టి పథకాలపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్సూరెన్స్ లు చేసుకోవడం వల్ల ఖాతాదారుని కుటుంబానికి ఆర్థిక భరోసాగా భీమా ఉంటుందని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర నుండి వచ్చే ఫోన్లకు, మెసేజ్లకు స్పందించ వద్దని ఎవరికి ఓటిపి చెప్పవద్దని తెలిపారు. వాట్సాప్ లో వచ్చే ఏపీకె ఫైల్స్, లింక్స్ వంటి వాటితో మోసపోవద్దని అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై ఎలాంటి అనుమానం వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ రెడ్డి, ప్రకాష్, స్వామి, మహేందర్, వివేక్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలి

**రైతు భరోసా ఎకరాకు 7500 రూపాయలు చొప్పున వానాకాలం, వేసంగి రెండు కార్లకు 15000 రూపాయలు రైతుల అకౌంట్స్ లో వేయాలి**
**సిపిఐ డిమాండ్**
**తైసీల్దార్ కు వినతి పత్రం ఇచ్చిన సిపిఐ మండల సమితి**



**గరిడేపల్లి : జనవరి 07,** రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికే ఋణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటించి నేటికీ కూడా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయక పోవడం రైతులపట్ల ప్రభుత్వానికి వున్న నిర్లక్ష్యం కు నిదర్శనం అని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రం లో సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తైసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం తైసీల్దార్ బండా కవిత కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు లక్షలు పైబడి ఋణం తీసుకున్న వారు పై పైసలు వారి ఖాతాలలో బ్యాంకులలో చెల్లిస్తే వెంటనే వారి అకౌంట్ లలో రెండు లక్షలు జమ చేస్తామన్నా ప్రభుత్వ పెద్దల మాటలు ఎక్కడ అమలు కాలేదని, రైతులు బ్యాంకులలో పైసలు చెల్లించి నెలలు గడుస్తున్నా, వారి అకౌంట్లలో పైసలు జమ కాలేదని ఆయన అన్నారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేకుంటే ఎప్పుడు జమ చేస్తారో చెప్పి, రైతులను ఆదుకోవాలి తప్ప రైతులను గందరగోళం చేయటం తగదని ఆయన అన్నారు.
రైతు భరోసా ఎకరాకు 7500 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి నేడు 6000 రూపాయలు ఇస్తామని చెప్పటం రైతులను మోసం చేయడమేనని, ఆయన అన్నారు. వానకాలం, వేసంగి, రెండు కార్లకు కలిపి,ఎకరాకు 15000 రూపాయలు వేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, యడ్ల అం జి ఒడ్డి, చేవ వెంకన్న, కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆం జనే య ులు, షైక్ నబిసాహెబ్, పందిరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట ఐఎంఏ ఆధ్వర్యంలో పెంచిన ఓపి మరియు మత్తు డాక్టర్ల ఫీజులను వెంటనే విరమించుకోవాలి



**నర్సంపేట: జనవరి 7,** నర్సంపేట పట్టణంలోని సిపిఐ (ఎం-ఎల్) పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మోడెం మల్లేశం,నర్సంపేట పట్టణంలోని ఐఎంఏ డాక్టర్లు గత రెండు రోజుల క్రితం సమావేశమై ఓ పి సేవలకు 300 రూపాయల నుండి 400కు రూపాయలకు మత్తు డాక్టర్ల ఫీజు 2000 రూపాయల నుండి 2500 రూపాయలకు పెంచాలని నిర్ణయం చేయడం జరిగినది. ఇది నర్సంపేట ప్రాంత ప్రజలపై మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఉన్నది. ఇప్పటికే నర్సంపేట పట్టణంలోని డాక్టర్లు హాస్పిటల్ యాజమాన్యాలు ఆర్ఎంపీ డాక్టర్లతో రహస్య ఒప్పందాలు చేసుకొని వైద్యం కోసం వచ్చిన పేషంట్ల నుండి ఓ పి ఫీజు కింద 300 రూపాయలు టెస్టుల పేరుతో ఒక పేషెంట్ నుండి 1500 నుండి 2000 రూపాయలు ఒకవేల పేషంటును గనుక హాస్పిటల్ లో అడ్మిట్ చేసుకుంటే ఒక రోజుకు బెడ్ చార్జ్ కింద 3000 నుండి 5000 రూపాయలు డాక్టర్ ఫీజు నర్స్ ఫీజు మెయింటెనెన్స్ ఫీజు ఇలా అనేక రకాలుగా చార్జీలు వేసి రోగి నుండి ఒక రోజుకు వేళల్లో గుంజు వేయడం జరుగుతున్నది. దానికి తోడు తమకు నచ్చిన మెడికల్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని, తమ ఇష్టానుసారమైన ఎమ్మార్పీ రేట్లను మందులపై ముద్రించుకొని, సుమారుగా ఒక పేషెంట్ నుండి మందులపైన మూడు వేల నుండి 5వేల ఐదువేల రూపాయల వరకు లాగటం జరుగుతున్నది. అలాగే చిన్న ఆపరేషన్ నుండి మొదలుకొని డెలివరీ గర్భసంచి ఆపరేషన్లకు 30 నుండి 50, 60 వేల వరకు రూపాయలు పేషెంట్ నుంచి లాగేసుకోవడం జరుగుచున్నది. నర్సంపేట పట్టణంలోని హాస్పిటల్సులోఎలాంటి కనీస సౌకర్యములు లేకుండానే కార్పోరేట్ స్థాయిలో ఫీజులను లాగి వేస్తూ ఉన్నప్పటికీ దీనిని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటం జరుగుచున్నది. నర్సంపేట పట్టణంలో ప్రభుత్వం నుండి తీసుకున్న పర్మిషన్ కు విరుద్ధంగా తమ నర్సింగ్ హోమ్ లను నడుపుతూ రోగుల నుండి లక్షల రూపాయల్ని సొమ్ము చేసుకోవడం జరుగుచున్నది. మరోవైపున ఇప్పటికే నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లలో హాస్పిటల్లో తీసుకుంటున్న ఫీజులు ఆకాశాన్ని అంటి ఉన్నప్పటికీ, మరోవైపున మళ్లీ ఓ పి తదితర చార్జీలను పెంచి పేషంట్ల నుండి ఇష్టానుసారంగా దోపిడి చేయుటకు నర్సంపేట ఐఎంఏ డాక్టర్లు సిద్ధపడుతున్నారు. కావున నర్సంపేట ఐఎంఏ డాక్టర్లు ఇప్పటికైనను పునరాలోచన చేసి ఓపి మత్తు డాక్టర్ల మరియు తదితర సేవల కోసం పెంచే ఫీజులను విరమించుకోవాలని కోరుతున్నాము. అలాగే సంబంధిత అధికారులు నర్సంపేటలోని నర్సింగ్ హోమ్ లలో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న హాస్పిటల్స్ పైన, డాక్టర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ సమావేశంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఈర్ల పైడి, జిల్లా నాయకులు కామ్రేడ్ భూమా అశోక్, కామ్రేడ్ రామచందర్, కామ్రేడ్ బర్ల గౌరయ్య పాల్గొన్నారు.

# అనంతగిరి తాసిల్దార్ పై చర్యలు తీసుకోవాలి



**అనంతగిరి:జనవరి 07 :** వారసత్వంగా ఉన్న భూమిని కుటుంబ సభ్యులకు సమాచారం లేకుండా దొంగచాటున పట్టా చేసిన అనంతగిరి తహసిల్దార్ హిమబిందుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనంతగిరి మండలానికి చెందిన నెలకుర్తి ఉషారాణి కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణను కోరుతూ వినతిపత్రం అందజేశారు. వివరాలకు వెళితే మండల పరిధిలోని గొండ్రియాల గ్రామానికి చెందిన నెల్లూరి వీరయ్యకు కొడుకు,కూతురు ఉన్నారు వీరయ్య గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోగా తనపై ఉన్న 12 ఎకరాల భూమిని ఆరు ఎకరాలు కూతురికి వచ్చేటట్లు వీలునామా రాశారు. అట్టి భూమిని అన్న తనకు తెలియకుండా పట్టా చేసేందుకు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడనే విషయం తెలుసుకొని డిసెంబర్ 31 వ తారీఖున తన తండ్రి ఆస్తిలో నాకు వాటా ఉంటుందని తన ప్రమేయం లేకుండా తన తండ్రి ఆస్తిని ఎవరికి పట్టా చేయవద్దని అనంతగిరి తాసిల్దార్ కు ఫిర్యాదు అందజేశారు. కాగా జనవరి 02న సదురు తహసిల్దార్ హిమబిందు ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు నెలకుర్తి ఉషారాణిని సభ్యులుగా చేర్చి తనకు ఎలాంటి సమాచారం లేకుండా దొంగతనంగా నెల్లూరు వీరయ్య కొడుకు కొడుకుకు పట్టా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. లంచానికి లాలూచి పడి వారసురాలికి సమాచారం లేకుండా చేసిన పట్టాను రద్దుచేసి తండ్రి ఆస్తిని తనకు దక్కకుండా చేసిన తహసిల్దార్ హిమబిందుపై చట్టపరమైన చర్యలు తీసుకొని తన తండ్రి ఆస్తిని తనకు అప్పగించాలని ఆర్డీవో అనుకోరారు

# భర్త మృతికి కారణమైన భార్యపై కేసు నమోదు చేసిన పోలిసులు

## బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్



**బెజ్జూర్ :జనవరి07,** :కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం బెజ్జూర్ మండలంలోని గబ్బాయి గ్రామం లో పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అందుగులగుడ గ్రామానికి చెందిన కోరేత ప్రకాష్ జగ్గయ్య (32) అనే వ్యక్తి, గబ్బాయి గ్రామానికి చెందిన లలితను 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి 9 సంవత్సరాల కూతురు కలదు భార్య ప్రవర్తన బాగు లేకపోవడంతో మూడు సంవత్సరాల నుండి తన ప్రవర్తన మార్చుకోవాల్సిందిగా పలుమార్లు భార్యకు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. ఎంత చెప్పినా భార్య వినకపోవడంతో సోమవారం సాయంత్రం గబ్బయ్ గ్రామంలోని తమ ఇంటి పెరటిలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో ఉన్నట్లుగా మదే విలకర్ తెలపడంతో 108 అంబులెన్స్ లో బెజ్జూర్ సామాజిక ఆసుపత్రికి తరలించినారు. మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం కాగజనగర్ ఆస్పత్రికి తరలించాల్సిందిగా తెలపడంతో అక్కడినుండి ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందినట్లు తెలిపారు. తన సోదరుడి మృతికి కారణమైన సోదరుని భార్య కోరేత లలిత పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కోరుతూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం

## కేవీపీఎస్, డివైఎఫ్ఐ

**కొమరం బీమ్ ఆసిఫాబాద్**



:కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పాత్రికేయుడు కృష్ణపల్లిసురేష్ కు ఆసిఫాబాద్ జిల్లా ప్రజా సంఘాల నాయకులు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్ పాత్రికేయుడికి ఆధిపత్య, ప్రతిఘటన సామాజిక సాం స్కృతిక మాసపత్రిక,ఆచరణవాది కా.టి. ఎన్. వెంకట రమణ. అను రెండు పుస్తకాలను పాత్రికేయడికి అందజేశారు. అనేకమంది కామ్రేడ్స్ సందేశాల ద్వారా వెల్లడించారని,ప్రజా ఉద్యమ శ్రేయోభిలాషులంతా చదవాల్సిన పుస్తకం అన్నారు. సంపాదకీయం, స్వసంత్ర భారతం ఎదుర్కొంటున్న,చర్మకారుల వృత్తిని, వర్గీకరణ సమస్య, సామాజిక న్యాయం కోసం, ఊహించని విషాదం, ఎత్తిన జెండా దించని వాడు,గొప్ప ఆర్గనైజర్, గొప్ప వ్యక్తి.అంశాలపై ఉన్నాయని పుస్తకాలు చదవడం అనేది సమాజంలో ఉన్నత శిఖరాలను అనుకున్న లక్ష్యాన్ని చేరడమే నని తెలిపారు.సొసైటీలో జర్నలిస్టుల సమస్యల,హక్కుల జర్నలిస్టుల జీవనాధార వృత్తి పాత్ర వివరిస్తూ మాట్లాడారు తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరుగని జర్నలిస్టుల పాత్ర కీలకంగా ముద్రపడి వుందని, జర్నలిస్టులు సామాజిక సేవలో చావు వచ్చే వరకు 24 గంటలు నిమగ్నమై ఉంటారని వెల్లడించారు.సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమంటూ చెప్పుకొచ్చారు.జర్నలిస్టుల ఏలాంటి సమస్యలు ఐనప్పటకి పరిష్కరించేందుకు ప్రభుత్వం,జిల్లా అధికారుల యంత్రాంగం పటిష్టంగా క్రమ బద్దంగా తప్పకుండా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మైసమ్మ జాతరలో పాల్గొన్న భీష్మరాజ్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు సభ్యులను ఘనంగా సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు



**దామరగిద్ద: జనవరి 07**

:నారాయణపేట నియోజకవర్గం దామరగిద్ద మండల కేంద్రంలోని శ్రీ మైసమ్మ దేవాలయంలో మంగళవారం నుంచి జరుగుతున్న జాతర మహో త్సవాల్లో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఫౌండేషన్ సభ్యులు మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు.. ఫౌండేషన్ సభ్యులను శాలువతో సన్మానించారు. ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, వెంకటేష్ మాట్లాడుతూ భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు సహకారం, పర్యావరణ పరిరక్షణకు చర్యలు, ఆపదలో ఉన్న వారికి చేయూతనిస్తూ ప్రజాసేవలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పేదలకు సేవ చేయడంలో తాము ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం.సంతోష్, సుదర్శన్ రెడ్డి, వెంకటరావు, మధుసూదన్ రెడ్డి, మోహన్, శరన్ దాస్, శ్రీనివాస్, చామకూర, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ బక్క నర్సప్ప, జోషి, జీకే వెంకటప్ప, బర్ల ఆనంద్, ఈరప్ప, గ్యాంగ్ హనుమంతు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యానికి విద్యార్థి మృతి

**ప్రైవేట్ హాస్టల్ యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి-ఏబీపీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్**



**చెన్నారావుపేట: 7 జనవరి**

వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండల సమీపంలోని ప్రైవేట్ హాస్టల్లో విద్యుత్ షాక్కు గురై విద్యార్థి మృతి చెందాడు.జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అవినాష్ రెడ్డి (19సం) నిర్మల్ జిల్లా వాసి సమీపంలోని ప్రైవేట్ హాస్టల్లో నివసిసున్నాడు.సోమవారం కాలేజ్ నుండి వచ్చిన అవినాష్ రెడ్డిని వార్డెన్ వివేక్ హాస్టల్లో నీరు రావడంలేదని మోటార్ వద్దకు తీసుకెళ్లినట్లు ఆక్రమంలోనే విద్యుత్ షాక్కు గురై స్పృహ కోల్పోయినట్లు విద్యార్థులు తెలిపారు.విద్యార్థి విద్యుత్ షాక్కు గురైన సమయంలో వార్డెన్ విద్యార్థిని కాపాడడానికి ఎటువంటి చర్యలు చేయకపోవడం, చికిత్స నిమిత్తం ఆర్.ఎం.పి డాక్టర్ వద్దకు తీసుకెళ్లడం విద్యార్థి మృతికి కారణమని తోటి విద్యార్థులు తెలిపారు.అనంతరం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆక్రమంలోనే విద్యార్థి అవినాష్ రెడ్డి మృతి చెందినట్లు విద్యార్థులు తెలిపారు.ఏబీపీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడుతూ:వార్డెన్ వివేక్ చేసిన తప్పిదాల వల్లే అవినాష్ రెడ్డి అనే విద్యార్థి మృతి చెందినట్లు, ఘటనకు కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ హాస్టల్ నడిపిస్తున్న యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పేద వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట రెడ్డి



**నడిగూడెం,జనవరి 7, :**పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూతుకూరి వెంకట రెడ్డి అన్నారు. మంగళవారం మండలం లోని రామాపురం గ్రామానికి చెందిన గుజ్జా శ్రీనివాస్ కు 60 వేల రూపాయల చెక్ ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని,ఈ ప్రభుత్వం లో ఎలాంటి పైరవి లేకుండా అర్హులైన వారికి ప్రతి సంక్షేమ పథకం అందిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుజ్జా అంజి పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీ కి బీజేపీ నాయకుడు రమేష్ బిధురి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పుతాం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుండు మహేందర్ గౌడ్**



**నడిగూడెం, జనవరి 7,** :కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీనియర్ నాయకు రాలు ప్రియాంక గాంధీ పై బిజెపి నాయకుడు రమేష్ భిధురి చేసిన అనుచిత వ్యాఖ్యలు తక్షణమే వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకపోతే బిజెపి నాయకులకు తగిన బుద్ధి చెబుతామని యూత్ కాంగ్రెస్ మండల అధ్య క్షులు గుండు మహేందర్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన లో మాట్లాడుతూ బిజెపి నాయకులకు మహిళల పట్ల ఎలాంటి గౌరవం ఉందో ఈ వ్యాఖ్యలతో నే అర్థం అవుతుందన్నారు.నాడు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, వైయస్సార్ హయంలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ మహిళలకు బ్రహ్మరథం పడుతూ రాజకీయంగా,ఆర్థికంగా మహిళలకు సముచిత స్థానం కల్పిస్తుంటే బీజేపీ ప్రభుత్వం మాత్రం మహిళలను కించపరుస్తూ మహిళలను స్వేచ్ఛగా, నిర్భయంగా తిరిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు.బిజెపి అధిష్టానానికి మహిళల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రమేష్ భీధురిని వెంటనే సస్పెండ్ చేసి,యావత్ మహిళలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.లేనియెడల తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను తెలంగాణ రాష్ట్రంలో రోడ్లపై తిరగనీయమని హెచ్చరించారు.

## ఘనంగా రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు



**అనంతగిరి:జనవరి .07**

:మండల కేంద్రంలోని శ్రీ రఘునాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామికి మారి మలై విశేషం పారిసం సింహాసనపట్టుతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తీగల నరసింహారావు మాట్లాడుతూ ఈనెల 10వ తారీకు ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ రఘునాథ స్వామి ఆలయాలు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకుని భక్తుల అభిష్టాలను నెరవేర్చుకొని స్వామివారి అనుగ్రహం పొందాలనీ ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఈవో తుమ్మల చలపతి పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటవిలో అక్రమంగా విద్యుత్తు తీగలు అమర్చిన ముగ్గురి రిమాండ్



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: డిసెంబర్ 07,**

:బెజ్జూర్ మండలంలోని ఏటిగూడా ఆటవి ప్రాంతంలో జంతువుల వేటకై అక్రమంగా విద్యుత్తు తీగలు అమర్చిన మడే ప్రభాకర్, తుమ్మల మహేష్, జక్కం వినోద్ ముగ్గురిని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎఫ్ఆర్ఓ మునవీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రావణ్ కుమార్, ఎఫ్బిఓ లు పాల్గొన్నారు.

## జూలూరి మౌనిక పుట్టినరోజు సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అన్నదాన కార్యక్రమం



**వరంగల్: జనవరి 7,** వరంగల్ పట్టణంలో బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో జూలూరి మౌనిక పుట్టినరోజు సందర్భంగా వారి యొక్క కుటుంబ సభ్యులు గురుదక్షిణ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనాథలకు ,వికలాంగులకు, వృద్ధులకు మంగళవారం అన్నదానం చేయడం జరిగింది. అలాగే శుభకార్యాలు చేసుకునేవారు ఎవరైనా ఈ సంస్థకు సహాయ సహకారాలు అందించి వారు అందించే నిత్య అన్నదాన కార్యక్రమానికి వారి స్తోమతకు తగ్గట్టు సహాయ సహకారాలు అందజేయాలని అన్నారు. నిత్య అన్నదానం నిర్వాహకులు ధనలక్ష్మి, శ్రీనివాస్ 9391343822,7382873955, నెంబర్ కి ఫోన్ పే ద్వారా గాని, గూగుల్ పే ద్వారా గాని వారికి సహకరించి ఆ సంస్థను ముందుకు నడిపించాలని కోరుకుంటున్నారు.

## తడ్కల్ లో పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ పద్మశాలి సంఘం అధ్యక్షులు బోడ దత్తు




**సంగారెడ్డి,కంగ్టి, జనవరి 07** : సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ మార్కండేయ మందిరంలో మంగళవారం పద్మశాలి సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్ పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు దత్తాత్రి,గ్రామ అధ్యక్షులు బోడ దత్తు ఆధ్వర్యంలో కుల సంఘ నాయకులతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు మాట్లాడుతూ పద్మశాలిలు ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు.పద్మశాలి సహోదరులకు ఎల్లవేళలా వెనువెంట ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా కార్య క్షేత్రంలో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఒగ్గా మోహన్,కోశాధికారి ఒగ్గా రాములు, నాయకులు మధు, వెంకన్న,అంబదాస్, కులభాంధవులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి రోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట: జనవరి 7,**



: నర్సంపేట మండలం నాగుర్లపల్లె గ్రామం నుండి పర్శనాయక్ తండ నారాయణ తండా వరకు ఆర్ అండ్ బి నిధులతో (ఎస్ టి ఎస్ డి ఎఫ్ నిధులు 2 కోట్ల 50 లక్షల) రోడ్డు శంకుస్థాపన శిలపలకాన్ని ప్రారంభించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి. అలాగే నర్సంపేట మండలం పర్శ నాయక్ తండ రాష్ట్ర, కేంద్రానిధులతో సుమారు 350000 విలువగల వాటర్ ప్లాంట్ ను ప్రారంభం చేయడం జరిగింది.లి ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుభరోసా అమలుకు చర్యలు వేగవంతం మంత్రి తుమ్మల

**హైదరాబాద్ : జనవరి 7,**



రైతుభరోసా పథకం అమలు కు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అధికారులను ఆదేశిం చారు.వ్య వసాయ, అనుబంధారంగాల ప్రగతిపై అధికా రులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహి ంచారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యత ఎరిగి పనిచేయాలని హితవు పలికారు. రైతులు, ప్రజా ప్రతినిధుల, మంత్రుల నుంచి వచ్చే విజ్ఞప్తులపై సత్వరమే పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పరిష్కారంలో జరిగిన జాప్యం పట్ల అధికారులపై తుమ్మల అసహనం వ్యక్తం చేశారు. అధిక మొత్తంలో సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనం అందేలా వ్యవసాయ యాంత్రికరణను, సూక్ష్మ సేద్య పరికరాలకు మరింతగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరములో ఇంకో 1000 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ట్రేడర్లు రైతుల వద్దకు వెళ్ళి కొనేలా రాష్ట్రంలో 3 ఆధునిక మార్కెట్లను అధునాతన హంగులతో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు. సంచార భూసార పరీక్ష కేంద్రాలను ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశాలిచ్చారు.వర్సిటీలలో ప్రస్తుతమున్న మౌలిక సదుపాయాల వృద్ధికి, కొత్త భవనాల నిర్మాణాలకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. రైతు వేదికల నిర్వహణ ఖర్చుల నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని, వచ్చే బడ్జెట్లో ప్రభుత్వ ప్రాధాన్యతలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.

## కల్తీ విత్తనాలపై క్షేత్రస్థాయి పరిశీలన



**గార్ల: జనవరి 7,:** గార్ల మండలం చిన్న బంజర గ్రామపంచాయతీ పరిధిలోని కేలోత్ తండా లో మిర్చి విత్తనాల పిర్యాదు పై శాస్త్రవేత్తలు వ్యవసాయ, ఉద్యాన అధికారులు క్షేత్ర సందర్శన నిర్వహించారు.ఈ క్షేత్ర సందర్శన లో మహబూబాబాద్ డివిజన్ ఏ.డి.ఏ . శ్రీనివాస్ రావు,మిర్చి పంట ప్రధాన శాస్త్రవేత్త రాంబాబు మండల వ్యవసాయ అధికారి శ్రీకావటి రామారావు,ఉద్యాన అధికారిణి శాంతి ప్రియ,కంపెనీ బ్రీడర్ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ల బృందం పిర్యాదు చేసిన రైతుల క్షేత్రాలలో మొక్కల సంఖ్య నర్సరీ వేసిన తేదీ ఎరువుల యాజమాన్యం క్రిమి సంహారక మందుల వివరాలు రైతుల నుండి సేకరించినారు విత్తనాల యొక్క బిల్లులు.లాట్ నంబర్స్ క్షుణ్ణంగా పరిశీలించి మొక్కల యొక్క జన్యు స్వచ్ఛత ను ఉన్నతధికారులకు నివేదిక పంపుతామని తెలిపినారు.

## లౌక్య సీడ్స్ కంపెనీ వారి విత్తనం శరణ్య 151 మిర్చి తోట క్షేత్ర ప్రదర్శన




**గార్ల :జనవరి 7, :** గార్ల మండలం గోపాలపురం గ్రామం ఆంగోత్ తండా ఆంగోత్ గోగ్య నాయక్ పండించిన మిర్చి తోటలో క్షేత్ర ప్రదర్శనను లౌక్య సీడ్స్ కంపెనీ వారి విత్తనం శరణ్య 151 మిర్చి అధిక కాయలు కాయడంతో కంపెనీవారు మిర్చి తోటను ఎంచుకొని క్షేత్ర ప్రదర్శన ను చేపట్టారు. ఈ మిర్చి తోటలో అధిక దిగుబడి, అత్యధిక రాబడి నిచ్చు హైబ్రిడ్ మిరప సన్న రకం, ముదురు ఎరుపు రంగులో ఉండి అధిక ఘాటు కలిగి,ఆయిల్ శాతం ఎక్కువ ,మొక్కలు, కొమ్మలు దృఢముగా వ్యాపించే రకము . ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అక్షయ్,డిస్ట్రిబ్యూటర్ గ్రీస్ సీడ్స్ (ఖమ్మం) లింగాల సురేష్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనములను ఎంపిక చేసుకోవాలని,ఈ విత్తన లక్షణాలను వివరిస్తూ గుబ్బ వైరస్, నల్ల తామర ను తట్టుకునే శక్తి,కాయ సైజు అధికంగా ఉండి గింజ శాతం ఎక్కువగా ఉంటుందని, ఎరుపు రంగు, దిగుబడి ఎకరానికి 35 నుండి 40 క్వింటాలు ప్రతి ఎకరాకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని , ఇక్కడ నేలలకు చాలా అనువుగా ఉంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండి అక్షయ్, కంపెనీ ఎస్ ఓ బానోత్ శివలాల్ ,డీలర్ రైతు మిత్ర ట్రేడర్స్ బండి అనిల్,గార్ల మండల చుట్టుపక్కల గ్రామాల రైతులు 1000పైగా పాల్గొని వీక్షించారు.పండిన మిర్చి తోటను పరిశీలించారు. అనంతరం మిర్చి పండించిన ఆంగోత్ గోగ్య నాయక్ ను శాలువా కప్పి సన్మానించారు.

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము



శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ 01 2సార్లు
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాన్తయే
యస్య ద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్ 02
విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే
వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ 03
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్
వ్యాసాయా విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే 04
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే 05
సదైకరూప రూపాయ విష్ణవే సర్వజిష్ణవే
యస్య స్మరణమాత్రేణ జన్మసం సార బన్ధనాత్ 06
విముచ్యతే న మ స్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే
ఓం నమో విష్ణవే ప్రభవిష్ణవే
శ్రీవైశంపాయన ఉవాచ
శ్రుత్వా ధర్మా నశేషేణ పావనాని చ సర్వశః 07
యుధిష్ఠిర శ్శాంతనవం పునరే వాభ్యభాషత

**యుధిష్ఠిర ఉవాచ**

కి మేకందైవతం లోకే కింవా ప్యేకం పరాయణమ్ 08
స్తువంతః కం క మర్చంతః ప్రాప్నుయుః మానవా శ్శుభమ్
కో ధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమో మతః 09
కిం జపన్ ముచ్యతే జన్తుః జన్మ సంసార బంధనాత్

**శ్రీ భీష్మ ఉవాచ**

జగత్ ప్రభుం దేవదేవం అనన్తం పురుషోత్తమమ్ 10
స్తువన్ నామసహస్రేణ పురుషః సతతోత్థితః
తమేవ చార్చయ న్నిత్యం భక్త్యా పురుష మవ్యయమ్ 11
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ
అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్ 12
లోకాధ్యక్షం స్తువ న్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్
బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తి వర్ధనమ్ 13
లోకనాథం మహద్భూతం సర్వభూత భవోద్భవమ్
ఏష మే సర్వధర్మాణాం ధర్మో ధికతమో మతః 14
యద్భక్త్యా పుణ్డరీకాక్షం స్తవై రర్చే న్నర సదా
పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః 15
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్
పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళమ్ 16
దైవతం దేవతానాం చ భూతానాం యో వ్యయః పితా
యత స్సర్వాణి భూతాని భవంత్యాది యుగాగమే 17
యస్మింశ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే
తస్య లోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే 18
విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాపహమ్
యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః 19
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూత యే
విష్ణో ర్నామసహస్రస్య వేదవ్యాసో మహా ఋషిః 20
ఛన్దో నుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీసుతః
అమృతాం శూద్భవో బీజం శక్తి ర్దేవకి నందనః 21
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే
విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వర మ్ 22
అనేకరూప దైత్యాంతం నమామి పురుషోత్తమమ్
అస్య శ్రీవిష్ణోః దివ్య సహస్రనామ స్తోత్ర మహామంత్రస్య, శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః, అనుష్టుప్ ఛన్దః, శ్రీ మహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారయణో దేవతా, అమృతాంశూద్భవో భానురితి బీజం, దేవకీ నందన స్స్రష్టేతి శక్తిః, ఉద్భవః క్షోభణో దేవ ఇతి పరమో మంత్రః, శంఖభృన్నన్దకీ చక్రీతి కీలకం, శార్ఙ్గధన్వా గదాధర ఇత్యస్త్రం, రథాంగపాణి ర క్షోభ్య ఇతి నేత్రం, త్రిసామా సామగా స్సామేతి కవచం, ఆనందం పరబ్రహ్మేతి యోనిః, ఋతుస్సుదర్శనః కాల ఇతి దిగ్బంధః, శ్రీ విశ్వ రూప ఇతి ధ్యానమ్, శ్రీ మహావిష్ణు ప్రీత్యర్థే ( కైంకర్యరూపే శ్రీ )సహస్రనామ జపే వినియోగః 23


**ధ్యానమ్**


క్షీరోదన్వత్ ప్రదేశే శుచిమణి విలసత్ సైకతే మౌక్తికానాం
మాలా క్లుప్తాసనస్థః స్ఫటికమణి నిభైః మౌక్తికైః మణ్డితా
శుభ్రై రభ్రై రదభ్రై రుపరి విరచితై ర్ముక్తపీయూషవర్షై :
ఆనందీ నః పునీయాత్, అరినళిన గదా శంఖపాణి ర్ముకుందః 24
భూః పాదౌ యస్యనాభిః వియదసు రనిలః చంద్రసూర్యౌచ నేత్రే
కర్ణావాశా శ్శిరోద్యౌః ముఖమపి దహనో యస్య వాస్తేయ మబ్ధిః
అంతస్థం యస్య విశ్వం సురనర ఖగగో భోగి గంధర్వ దైత్యైః
చిత్రం రంరమ్యతే, తం త్రిభువనవపుషం విష్ణుం మీశం నమామి 25

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగమ్
లక్ష్మీకాన్తం కమలనయనం యోగిహృ ద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాథమ్ 26
మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగమ్
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం విష్ణుం వన్దే సర్వలోకైక నాథమ్
నమస్సమస్త భూతానాం ఆది భూతాయ భూభృతే
అనేకారూపరూపాయ విష్ణవే ప్రభ విష్ణవే 27
సశంఖచక్రం సకిరీటకుం డలం సపీతవస్త్రం సరసీరు హేక్షణమ్
సహారవక్షస్థలశోభి కౌస్తుభం నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్ 28

# గురు దేవోభవ





తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు. కానీ, మనిషిలోని మూఢత్వాన్ని తొలగించి, మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు మాత్రమే. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమతో శిష్యుడికి గురువు విద్యను బోధిస్తాడు. తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తానంటాడు శిష్యుడు. ఇదీ గురుశిష్యుల సంబంధం. ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధం అది.

తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు. కానీ, మనిషిలోని మూఢత్వాన్ని తొలగించి, మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు మాత్రమే. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమతో శిష్యుడికి గురువు విద్యను బోధిస్తాడు. తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తానంటాడు శిష్యుడు. ఇదీ గురుశిష్యుల సంబంధం. ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధం అది.వేదవ్యాస మహర్షి పంచమ వేదంగా లోకానికి అందించిన మహాభారతంలో గురు వైభవాన్ని ప్రకటించే ఇతివృత్తాలు ఎన్నో కనిపిస్తాయి. జగద్గురువైన శ్రీకృష్ణుడే స్వయంగా సాందీపుని దగ్గర శిష్యునిగా విద్యాభ్యాసం చేయడం, కురు కుమారులు ద్రోణాచార్యుడి శిష్యరికంలో సాటిలేని యోధులుగా తయారవ్వడం, కేవలం గురుభక్తితో ఏకలవ్యుడు సాటిలేని మేటి విలుకాడుగా ప్రసిద్ధిపొందడం%ొా% ఇవన్నీ ప్రాచుర్యం పొందిన కథలు. గురువైభవాన్ని ప్రకటించే మరో వృత్తాంతం మహాభారతం అరణ్యపర్వంలో ఉంది.

**యవక్రీతుడి వృత్తాంతం**

భరద్వాజుడు, రైభ్యుడు ఇద్దరూ సహాధ్యాయులు. ఒకే గురువు వద్ద విద్యాభ్యాసం చేసి, సకల విద్యల్లోను పాండిత్యం సంపాదించారు. తపస్సుతో ఇద్దరూ మహర్షిత్వాన్ని సాధించారు. రైభ్యుడి కుమారులు కూడా తండ్రి చూపిన మార్గంలో సద్గురువును ఆశ్రయించి, వేదవేదాంగాలు అభ్యసించి, ఉత్తమ గుణాలతో శోభిల్లుతూ, అందరి ప్రశంసలు అందుకున్నారు. భరద్వాజుని కుమారుడు యవక్రీతుడు. ఉపనయనం జరిగిన క్షణం నుంచి, యవక్రీతుడు కేవలం తపస్సు ద్వారా సకల విద్యల్లో పాండిత్యం సంపాదించాలని భావిస్తుంటాడు. గురు శుశ్రూష ద్వారా విద్యాభ్యాసం చేయాలంటే ఎంతో సమయం పడుతుంది కాబట్టి, తపస్సు ద్వారా తేలికగా జ్ఞానం పొందవచ్చని అతని ఆలోచన. రైభ్యుడి కుమారులకు సమాజంలో దక్కుతున్న ఆదరణ ఇతనిలో మరింత మాత్సర్యాన్ని కలిగిస్తుంది. దీంతో యవక్రీతుడు ఇంద్రుడి గురించి, ఘోర తపస్సు చేశాడు.

'గురూపదేశం లేని విద్య మాత్సర్యాన్ని, అహంకారాన్ని పెంచుతుందని, ఈ ప్రయత్నం విడిచిపెట్టమని' వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో ఇంద్రుడు యవక్రీతుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాడు. అయినా, అతను పట్టు విడిచిపెట్టడు. దీంతో, చేసేదిలేక ఇంద్రుడు యవక్రీతుడికి వేదాలను భాసింపజేస్తాడు. అహంకారం తగదంటూ భరద్వాజుడు యవక్రీతుడికి ఎన్నో జాగ్రత్తలు చెబుతాడు. కానీ, వర గర్వంతో విర్రవీగుతున్న యవక్రీతుడు రైభ్యుని ఆశ్రమంలోకి ప్రవేశించి, మహర్షి కోడలిని చెరబట్టే ప్రయత్నం చేస్తాడు. దీంతో కోపించిన రైభ్యుడు యవక్రీతుడిని వధిస్తాడు. కొంతకాలం తర్వాత రైభ్యుని రెండో కుమారుడు దయతలచి, తన తపశ్శక్తితో యవక్రీతుడిని పునర్జీవితుణ్ని చేస్తాడు.

తన విద్యలు ఎందుకు నిష్ప్రయోజనం అయ్యాయని యవక్రీతుడు దేవతల్ని ప్రశ్నిస్తాడు. 'గురుముఖంగా నేర్చుకోకపోవటం వల్లే నీ విద్యలు ఫలించలేద'ని దేవతలు స్పష్టం చేస్తారు. ఇదీ గురువైభవం. ఈ భావాన్నే ప్రకటిస్తూ శ్రీనాథ మహాకవి 'గురువు నేర్పని విద్య గుడ్డివిద్య' అన్నాడు. మహాకవి కాళిదాసు 'శుశ్రూష స్వగురూన్' అంటూ 'గురు శుశ్రూష ద్వారానే విద్యలు నేర్చుకోవాల'ని చెప్పాడు.

**దీపకుడి గురుభక్తి**

కేవలం నిశ్చలమైన గురుభక్తితో శ్రీమన్నారాయణుని సాక్షాత్కారం పొందిన శిష్యలోక చక్రవర్తి దీపకుడు. వేదధర్ముడనే గురువు దగ్గర దీపకుడు విద్యాభ్యాసం చేస్తుంటాడు. వినయంతో, సకల శుభ లక్షణాలతో గురువుకు అత్యంత ప్రీతిపాత్రుడవుతాడు. ఒకరోజు వేదధర్ముడు దీపకుడిని పిలిచి 'దీపకా! పూర్వజన్మలో నేను చేసిన రెండు పాపాలను పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సి ఉంది. ఇందుకు కాశీ క్షేత్రానికి వెళ్లాలి. ఆ పాపాలను ఆవహింపజేసుకున్నప్పుడు నా స్వభావం పూర్తిగా మారిపోతుంది. అత్యంత కఠినుడిగా మారిపోతాను. కుష్ఠు రోగం వస్తుంది. జుగుప్స కలిగించే రూపంతోపాటు అంధత్వం కూడా వస్తుంది' అంటాడు.

దీపకుడు 'మహానుభావా! ఆ సమయంలో తమకు సేవ చేసుకునే భాగ్యం నాకు అనుగ్రహించండి' అని గురువును వేడుకుంటాడు. ఇద్దరూ కలిసి కాశీ క్షేత్రానికి చేరుకుంటారు. వేదధర్ముడు పాపాలను ఆవహింపజేసుకుంటాడు.

అతిభయంకరమైన రూపం, కఠిన స్వభావం అతనికి సంప్రాప్తిస్తాయి. అన్నిటినీ తట్టుకుంటూ గురుసేవ చేస్తుంటాడు దీపకుడు. ఆ శిష్యుడు చేస్తున్న అనితర సాధ్యమైన గురుసేవకు మహదానందం పొందిన కాశీ విశ్వనాథుడు దీపకుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమని అడుగుతాడు. ఆ సమయంలో నిద్రిస్తున్న గురువుకు పాదసేవ చేస్తుంటాడు దీపకుడు. 'తనకేమీ తెలియదని, గురువుగారు నిద్ర నుంచి మేల్కొనగానే, వారిని అడిగి చెబుతాన'ని విశ్వనాథుడికి బదులిస్తాడు.

వేదధర్ముడు నిద్ర నుంచి మేల్కొనగానే జరిగిందంతా వివరిస్తాడు దీపకుడు. 'మీ పాపాలు పోగొట్టమని విశ్వనాథుడిని అడుగుతానని, అందుకు అనుమతించమ'ని అభ్యర్థిస్తాడు. ఇందుకు వేదధర్ముడు ఒప్పుకోడు. ఎవరి పాపాలు వారే అనుభవించాలని, అప్పుడే పూర్తిగా కర్మఫలితం నశిస్తుందంటాడు. మర్నాడు దీపకుడు శివుడి సన్నిధికి వెళ్తాడు. కానీ, ఏ వరం కోరుకోడు. నిశ్చలంగా దైవాన్ని చూస్తూ నిల్చుంటాడు. దీపకుడి ఉన్నతమైన సాధనను మెచ్చుకున్న విశ్వనాథుడు, శ్రీమన్నారాయణుడి దగ్గరికి వెళ్లి, దీపకుని వృత్తాంతం చెబుతాడు. హరిహరులిద్దరూ దీపకుడికి ప్రత్యక్షమవుతారు.

'నారాయణా! మిమ్మల్ని నేనెప్పుడూ దర్శించలేదు. కనీసం స్మరించలేదు కూడా. నాకు ఎందుకు ప్రత్యక్షమయ్యార'ని దీపకుడు విష్ణుమూర్తిని ప్రశ్నిస్తాడు. అందుకు నారాయణుడు 'దీపకా! నీవు అచంచలమైన భక్తితో గురుసేవ చేస్తున్నావు. గురువు త్రిమూర్తి స్వరూపుడు. కాబట్టి, నన్ను అర్చించినట్టే. ఏం వరం కావాలో కోరుకో' అని స్వామి దీపకుడిని అడుగుతాడు. 'స్వామీ! ఎన్నటికీ తరగని అచంచలమైన గురుభక్తి నాకు ప్రసాదించమ'ని దీపకుడు నారాయణుడిని వేడుకుంటాడు. అతని గురుభక్తికి మెచ్చిన నారాయణుడు అనేక వరాలు అనుగ్రహిస్తాడు. నిశ్చలమైన గురుభక్తితో తనతోపాటు తన గురువును కూడా తరింపజేసిన ఘనతను దీపకుడు సాధించాడు. గురువైభవానికి అసలైన నిదర్శనం ఇది.

# నేను రామానుజదాసుడను!



ఒకానొక సందర్భంలో నేను 'రామానుజ దాసుడను' అని తనకు తాను రామానుజా చార్యులకు దాసుడని పేర్కొన్నారు శ్రీరంగనాథస్వామివారు. ఎందుకంటే రామా నుజులవారి భక్తికి ఎంతో పరవశులయ్యేవారు స్వామి. మహోన్నత భక్తులు%ొా% సమ తామూర్తి%ొా% మానవతావాది శ్రీ రామానుజాచార్యులు అంటే శ్రీరంగనాథస్వామికి అంత ఇష్టం%ొా%. అభిమానం. అందుకే రామానుజాచార్యుల నిర్యాణం అనంతరం ఆయన పార్థివ దేహాన్ని కూడా తన ఆలయంలోనే వుంచుకున్నారు రంగనాథస్వామి. రామానుజాచార్యు నికి రంగనాథస్వామి దాసుడిని అని పేర్కొన్న కథ ఒకటి శ్రీరంగంలో ప్రచారంలో వుంది. కొన్ని శతాబ్దాల క్రితం కూడా శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో స్వా మివారి ప్రసాదానికి భక్తులు బారులు తీరి వుండేవారు. ప్రతీ రోజు ప్రసాదం కొరకు ఎదురు చూస్తూ బారులు తీరిన భక్తులలో ఒక పేద వైష్ణవుడు వుండేవాడు. ఆయన రోజూ వరుసలో అందరికంటే ముందు నిలబడేవాడు. ఆయన తన కోసమేకాక, తన ఆరుగురు కొడుకుల కొరకు కూడా ప్రసాదం తీసుకెళ్ళేవాడు. ఆలయ అధికారులు అంతమందికి ప్రసాదాన్ని ఒకే వ్యక్తికి ఇవ్వడం సరికాదని అనేవారు. ఆయన మాత్రం ప్రసాదం ఇవ్వమని పట్టుపట్టేవాడు. ఇలా రోజూ ఆలయ అధికారులకి అతనికి కొంత వాదులాట జరిగేది.

"ప్రసాదం అంతా నీకే ఇచ్చేస్తే నీ వెనుక వున్న మిగిలిన భక్తులందరికి కొంచెమే ప్రసాదం లభిస్తుంది" అని ఆలయ అధికారులు ఆ వైష్ణవుడిని మందలించేవారు. అయినా కూడా ఆ పేద వైష్ణవుడు "నా ఆరుగురు కొడుకులు ఆహారం లేక బక్క చిక్కిపోయారు, వారు ఆకలితో అలమటిస్తూ వుంటారు. నేను తీసుకువెళ్ళే ప్రసాదానికై ఎదురుచూస్తూ వుంటారు. కనుక మీరు ఆలయ ప్రసాదం ఇవ్వకపోతే వారు నాకు దక్కరు" అని ఆయన ప్రాధేయపడేవాడు. ఒకరోజు రామానుజుల వారు వైష్ణవుడు ఆలయ అధికారులకు మధ్య జరుగుతున్న వాదోపవాదాలను చూసి అక్కడకు వచ్చారు. "ఏమి జరిగింద"ని అడిగారు. ఆలయ అధికారులు ఆ పేద వైష్ణవుణ్ణి చూపించి రోజూ అధిక ప్రసాదం కావాలని ఆయ న గొడవ చేస్తున్నాడని తెలియచేస్తారు. రామానుజులు ఆ వైష్ణవుడి దగ్గరకు వెళ్ళి "నాయనా నీవు ఆలయములో కొన్ని కైంకర్యములు చేసి ఎక్కువ ప్రసాదాన్ని పొందవచ్చు కదా" అని అడుగుతారు. దానికి ఆ వైష్ణవుడు–

"స్వామీ! నా బక్క చిక్కిన కొడుకులని మీరే చూడండి, రోజంతా వారికి సేవలు చేయడ ములోనే నాకు సమయం సరిపోతుంది, వీరిని వదిలేసి నేను ఆలయంలో ఏ కైంకర్యం చేయ లేను. పైగా నేను వేదాలను గాని, దివ్య ప్రబంధములను గాని నేర్చుకోలేదు, అందువల్ల నేను ఆలయ సేవ కాలములలో కూడా ఏ కైంకర్యం చేయలేను, నాకు కొన్ని విష్ణు సహస్ర నామం లోని శ్లోకాలు తప్ప ఏమి రావు, నేనేమి చేయగలను." అని బదులిచ్చాడు ఆ పేద వైష్ణవుడు.

"సరే నీకు తెలిసిన విష్ణు సహస్రనామ శ్లోకాలని చెప్పు" అన్నారు రామానుజులవారు.

ఆ వైష్ణవుడు ఎంతో ఇబ్బందిగా "విశ్వం విష్ణు వషట్కారో భూత భవ్య భవత్ ప్రభుః, భూత కృత్ భూత భృత్.." అని ఆపేసి, "నాకు అంతవరకే వచ్చు స్వామీ!" అని చెప్పాడు.

అతని ఇబ్బంది చూసి రామానుజులవారు "సరే నీకు 'భూత భృత్' అనే భగవన్నామ ము తెలుసుకదా! ఆ నామాన్నే జపించు, ఇక నీకు ఇక్కడికి ఆహారార్థియై రావలసిన అవసరం ఉండదు" అని సెలవిచ్చారు.

ఆనాటి నుండి ఆ వైష్ణవుడు ఇంకెప్పుడూ కోవెల ప్రసాద వితరణ ప్రాంతంలో కనిపిం చలేదు. ప్రసాదపు వరుసలలో గొడవలు ఆగిపోయాయి. అయితే ఇంకో విచిత్రమైన సమస్య మొదలయింది. రోజూ రంగనాథులకు సమర్పిస్తున్న ప్రసాదంలో చాలా భాగం మాయమై పోతుంది. పంచడానికి కొంచెమే వుంటోంది. ఆలయంలో ప్రసాదం దొంగల బారిన పడు తుందేమో అని భద్రత పెంచారు కూడా. అయినా రంగనాథులకు సమర్పించిన దానిలో చాలా ప్రసాదం మాయమైపోతున్నది. ఆ పేద బ్రాహ్మణుడే దొంగిలిస్తున్నాడేమో అని అనుమానం వస్తున్నది అందరికి. చివరకు రామానుజులకి ఈ సమస్య గురించి తెలియచేసా రు. ఆ పేద బ్రాహ్మణుణ్ణి పిలుచుకు రమ్మని రామానుజుల వారు మనుషులని పంపారు. వారు తిరిగి వచ్చి ఆయన ఆలయానికి దగ్గరగా వున్న తన పాత నివాసంలో ఉండటంలేదని తెలిపారు. ఆ తరువాత కూడా ఆ వైష్ణవుడు ఎక్కడ ఉంటున్నాడో ఎవరికీ సమాచారం తెలియలేదు.

కొంత కాలం తర్వాత, రామానుజులు ఏదో కార్యక్రమానికై కొల్లిడం నది (శ్రీరంగం దగ్గర కావేరి పాయ) దాటుతుండగా ఈ వైష్ణవుడు "స్వామీ%ొా% స్వామీ" అని రామానుజులని బిగ్గరగా పిలుస్తూ వారిని సమీపించాడు. రామానుజుల పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆయన కనుల నుండి ధారగా కన్నీరు రాసాగింది.

"స్వామీ! మీ కటాక్షం వలన ఆ పిల్లవాడు రోజూ నాకు ప్రసాదం అందచేస్తున్నాడు. అం దువల్ల నా పిల్లలు సరిపడినంత పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులయ్యారు. ఇక ఆల య అధికారులతో గొడవలు ఎందుకని కోవెల దగ్గర గృహం నుండి నేను ఇక్కడికి వచ్చేసా ను. నేను మీకు సదా కృతజ్ఞుడను. మీరు చెప్పిన విధంగా రోజూ నేను "భూతభృతే నమః" జపాన్ని చేస్తున్నాను." అన్నాడు.

అతని మాటలు విన్న రామానుజులు ఆశ్చర్యచకితులయ్యారు. "ఎవరా పిల్లవాడు? వాని పేరేమిటి?" అని అడిగారు.

"ఆ పిల్లవాడు తాను రామానుజాదాసుడనని చెప్పాడు స్వామీ" అన్నాడు వైష్ణవుడు. రామానుజాచార్యులవారికి అంతా అర్థమయింది. 'భూత భృత్' నామానికి అర్థం 'సమస్త జీవుల'ని పోషించువాడు అని అర్థంకదా! రామానుజుల వారి ఆజ్ఞానుసారం 'భూత భృత్'ను పఠించిన వైష్ణవుడి ఆకలి బాధలను తీర్చారు ఆ రంగనాథస్వామి.

ఇంతకీ ఆ బాలుడు ఇంకెవ్వరు సాక్షాత్ శ్రీరంగనాథుడే అని తెలుసుకున్నారు శ్రీరామా నుజాచార్యులు. బాలుడి రూపంలో రంగనాథుడి దర్శనం రోజూ పొందుతున్న ఆ వైష్ణవు డి అదృష్టానికి పరవశులయ్యారు రామానుజులవారు.

# పాదోదకం పావనం శుభం





సనాతన సంస్కృతిలో తీర్థానికి విశిష్టమైన స్థానం ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో, ప్రత్యేకించి భక్తి ప్రపంచంలోను, ముఖ్యంగా భక్తుల హృదయాలలోను తీర్థానికి విశేషమైన ప్రాముఖ్యత ఉంది. అయితే అన్ని ప్రసాదాలు అన్నిటిలోను అతి విశిష్టమైనది తీర్థ ప్రసాదం అని చెబుతా రు. ఇంట్లో పూజ, అభిషేకం, ఆరాధన, వ్రతంలాంటి దైవ సంబంధిత కార్యాలు చేసుకున్న తర్వాత తీర్థాన్ని తీసుకుంటాం. అదేవిధంగా దేవాలయాలలో దైవాన్ని దర్శించుకున్న తర్వాత అర్చక స్వాములు యిచ్చే తీర్థాన్ని తీసుకుంటాం. దేవాలయాలలోను, అదే రకంగా ఇళ్ళలోను అర్చన తర్వాత తీసుకునే పవిత్ర జలాన్ని లేక పాలను తీర్థ ప్రసాదం అని అంటా రు. తలపైన శఠగోపం పెట్టించుకున్న తర్వాత, దేవుణ్ణి అభిషేకించిన పాలో, ఉదకమో, పెరు గో, పంచామృతాలో, కళ్ళకు అద్దుకుని తీర్థ ప్రసాదంగా భక్తి ప్రపత్తులతో తీసుకుంటారు."అకాల మృత్యు హరణం సర్వవ్యాధి నివారణం సమస్త పాప క్షయకరం శ్రీ పరమేశ్వ ర పాదోదకం పావనం శుభం." అనే మంత్రాన్ని అర్చక స్వామి జపిస్తూ, తీర్థాన్ని భక్తులకు ఇస్తాడు. అయితే "శ్రీ పరమేశ్వర పాదోదకం పావనం శుభం" అనే మంత్రంలో, పరమేశ్వర దగ్గర, ఏ దేవునికి మనం పూజ/ అర్చన/ అభిషేకం చేసామో, ఆ దేవుని పేరును చదవాలనే విషయం ఇక్కడ గమనించాలి."అకాల మృత్యు హరణం సర్వ వ్యాధి నివారణం సమస్త పాప క్షయకరం" అనే మం త్రోచ్చారణ వలన అనంతమైన, అమోఘమైన, పవిత్రమైన మంత్రశక్తి తీర్థానికి ఆపాదింప బడి, ఆ మంత్ర బలం తీర్థానికి సంపూర్ణంగా వస్తుంది. తీర్థం అంటే తరింప చేసేది అని శాస్త్రం చెబుతున్న అర్థం. తీర్థాన్ని మూడుసార్లు తీసుకో వడం ప్రశస్తం అని పెద్దలు చెబుతారు. మొదటిసారి తీర్థం తీసుకోవడం వలన శారీరక, మా నసిక శుద్ధి జరుగుతుంది. రెండవసారి తీసుకోవడం వలన న్యాయ, ధర్మ పరివర్తన జరుగు తుంది. మూడోసారి తీసుకునేటప్పుడు పరమేశ్వర పధం అనుకుంటూ తీర్థాన్ని తీసుకోవా లని పెద్దలు చెబుతారు. అదేవిధంగా "కేశవాయ స్వాహా" అనుకుంటూ మొదటిసారి, "నారాయణ స్వాహా" అంటూ రెండోసారి, "మాధవాయ స్వాహా" అనుకుంటూ మూడోసారి తీర్థాన్ని తీసుకోవా లి. ఈవిధంగా తీర్థప్రసాదాన్ని మూడుసార్లు తీసుకోవడం వలన జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను (అంటే శరీరాన్ని), ముఖ్యమైన మనసునూ సిద్ధం చేయడం, శుద్ధం చేయడము అవుతుందనేది అంతర్లీనంగా దాగున్న అంతరార్థ ఆధ్యాత్మిక రహస్యం అని చెబుతారు. తీర్థం తీసుకున్నాక కుడిచేతిని కొందరు తలకు తుడుచుకుంటారు. అలా చేయకూడదని శా స్త్రం చెబుతోంది. ఎందుకంటే తలపైన బ్రహ్మదేవుడు ఉంటాడు కాబట్టి మన ఎంగిలిని బ్రహ్మకు అర్పణ చేసినట్లు అవుతుందని. వివిధ రకాల తీర్థాలు: జలతీర్థ ప్రసాదం, కషాయతీర్థ ప్రసాదం, పంచామృత తీర్థ ప్రసా దం, పానకతీర్థ ప్రసాదం అని తీర్థ ప్రసాదాలు నాలుగు రకాలు. ఇవే కాకుండా తులసి తీర్థం, పచ్చకర్పూర తీర్థం, బిల్వ తీర్థం యిలా రకరకాల తీర్థాలు కూడా ఉన్నాయి.

**తీర్థం ఇలా తీసుకోవాలి**

ఎడమ అరచేతిలో కుడి అరచేతిని పెట్టి, కుడిచేతి చూపుడు వేలు మధ్యలోకి బొటన వేలుని మడిచి ( అంటే%.గోముఖ ముద్రలో ) తీర్థాన్ని భక్తుడు తీసుకోవాలి. మరికొంత విపులంగా చెప్పాలంటే, తీర్థాన్ని మగవారైతే తన భుజంపై ఉండే ఉత్తరీ యం లేదా కండువాను, ఆడవారైతే తమ చీర లేదా చున్నీ పైకొంగును ఎడమ చేతిలో నాలు గు మడతలు వచ్చే విధంగా వేసుకోవాలి. వేసుకున్నాక ఎడమ చేతిలో ఉన్న మడతపై కుడిచే తిని ఉంచి, చూపుడు వేలు ఏమాత్రం తగలకుండా, బొటన వేలుని నడిమి వేలు క్రింది కణుపు నకు గట్టిగా నొక్కిపెట్టి, తీర్థం క్రిందన పడకుండా, నోటి నుంచి జుర్రుకుంటున్నట్టు శబ్దం రాకుండా చూసుకుంటూ, సంబంధిత దైవ నామాలను స్మరించుకుంటూ భక్తి శ్రద్ధలతో తీర్థాన్ని తీసుకోవాలి.

**తీర్థాన్ని తీసుకోకూడని సందర్భాలు**

నొసట విభూతిగానీ కుంకుమగానీ లేనప్పుడు తీర్థ ప్రసాదాన్ని తీసుకోకూడదు. అంటు, పురుడు, మైల ఉన్నప్పుడు తీర్థం తీసుకోకూడదు. స్త్రీలు నెలసరి సమయంలో తీసుకోకూడదు. అపరిశుభ్రంగా ఉన్నప్పుడు అంటే స్నానాదికాలు ముగించుకోకుండాను, మల మూత్రాదులు అయినాక కాళ్ళు చేతులు కడుక్కోకుండాను తీర్థ సేవనం చేయకూడదు. తీర్థప్రసాదం ఏదైనా, అది ఏ రూపంలో ఉన్నా అతి పవిత్రమైనది. లాభకరమైనది మంగళకరమైనది.

# 10కి 7 టెస్టుల్లో ఫెయిల్.. టీమ్ ఇండియా నెక్స్ట్ ఏమిటి?



టెస్టు మ్యాచ్ లు మరో ఆరు నెలల వరకు లేవు.. ఇంతలోనే సీనియర్ స్పిన్నర్ అశ్విన్ రిటైర్ అయిపోయాడు.

గత నాలుగైదు నెలల్లో టీమ్ ఇండియా మొత్తం 10 టెస్టు మ్యాచ్ లు ఆడింది. వీటిలో ఐదు సొంతగడ్డపై.. మిగతావి ఆస్ట్రేలియాలో బోర్డర్ గావస్కర్ (బీజీటీ) సిరీస్ లో భాగంగా.. మరి వీటిలో గెలిచినవి మూడు మాత్రమే. రెండు బలహీన బంగ్లాదేశ్ పై భారత్ లో, మరొకటి ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టు. మరీ ఘోరం ఏమంటే.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారత్ లో ఆడుతూ న్యూజిలాండ్ చేతిలో క్లీన్ స్వీప్ అయింది. ఈ లెక్కన మన జట్టు నిఖార్సుగా గెలిచిన టెస్టు ఒక్కటే. ఇది కూడా ఆస్ట్రేలియా పూర్తి స్థాయిలో పుంజుకోక ముందే నవంబరు 22న జరిగిన మ్యాచ్. అప్పటికి ఆస్ట్రేలియా టెస్టు ఆడి ఆరు ఏడు నెలలు దాటిపోవడంతో వారికి సమాయత్తం కావడానికి సమయం పట్టింది. గులాబీ బంతితో జరిగిన ఆడిలైడ్ టెస్టు నుంచి ఏం జరిగిందో అందరూ చూశారు.ఇప్పుడు ఏం చేద్దాం..?టెస్టు మ్యాచ్ లు మరో ఆరు నెలల వరకు లేవు.. ఇంతలోనే సీనియర్ స్పిన్నర్ అశ్విన్ రిటైర్ అయిపోయాడు. కెప్టెన్ రోహిత్ శర్మ వచ్చే జూన్ లో ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్ ఇండియా ఇంగ్లండ్ వెళ్లనుంది. అప్పటికి రోహిత్ తో పాటు స్టార్ బ్యాట్స్ మన్ విరాట్ కోహ్లిని ఎంపిక చేస్తారా? అంటే చెప్పలేం. ముందుగా రోహిత్ కు అయితే స్థానం లేదనే అనుకోవాలి. ఇంగ్లండ్ తో సిరీస్ లో కోహ్లి సంగతి కూడా తేలిపోతుంది.వచ్చేసింది టి20 ధమాకా ఆస్ట్రేలియా చేతిలో 1-3తో ఓటమి, అంతకుముందు న్యూజిలాండ్ చేతిలో 0-3తో పరాజయం.. గత నాలుగు నెలల్లో పది టెస్టులు ఆడిన టీమ్ ఇండియా ఇప్పుడు వన్డేలు, టి20 ధమాకాలోకి దిగనుంది. ఇందులో భాగంగా టి20లు, వన్డేల్లో అత్యంత దూకుడుగా ఆడే ఇంగ్లండ్ తో తలపడనుంది. ఈ నెల 22 నుంచి ఐదు టి20ల సిరీస్ మొదలుకానుంది. ఆపై మూడు వన్డేల సిరీస్ ఉంది.ఇది ముగిశాక ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఈ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. భారత్ మాత్రం ఆ దేశంలో పర్యటించదు. టీమ్ ఇండియా మ్యాచ్ లు దుబాయ్ లో జరుగుతాయి. ఇది ముగిశాక ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మొదలుకానుంది.

# ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బాగోదు.. యువరాజ్ మాస్ వార్నింగ్!

టీమిండియా లెజెండ్ యువరాజ్ సింగ్ తన మనసులో ఏది ఉంటే అదే చెబుతాడు. మనసులో ఒకటి ఉంచుకొని, పైకి మాట్లాడటం అతడికి చేతకాదు. తాను ఏది చెప్పాలని అనుకుంటాడో అది ధైర్యంగా, సూటిగా చెప్పడం అతడి స్టైల్. రిటైర్మెంట్ తర్వాత భారత క్రికెట్‌కు దూరంగా ఉంటున్న ఈ దిగ్గజ ఆల్‌రౌండర్.. శుబ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ లాంటి యంగ్‌స్టర్స్‌కు కోచింగ్ ఇస్తూ మెరికల్లా తీర్చిదిద్దాడు. సందర్భం వచ్చినప్పుడల్లా టీమిండియా గురించి ఇంట్రెస్టింగ్ స్టోరీస్ షేర్ చేసుకునే యువీ.. తాజాగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫెయిల్యూర్ మీద స్పందించాడు. వాళ్ల గురించి పలువురు అడ్డగోలుగా మాట్లాడుతున్నారంటూ సీరియస్ అయ్యాడు. యువీ ఇంకా ఏమన్నాడంటే..



సపోర్ట్ చేయాల్సింది పోయి..'టీమిండియా గత 5 ఏళ్లలో ఎన్నో అద్భుత విజయాలు సాధించింది. ఆస్ట్రేలియాలో వెంటవెంటనే రెండుసార్లు సిరీస్‌ను సొంతం చేసుకుంది. కంగారూ గడ్డ మీద బ్యాక్ టు బ్యాక్ సిరీస్ నెగ్గిన టీమ్ ఉంటే చూపించండి. ఈ ఘనత సాధించిన మరో జట్టు లేదు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ జనరేషన్‌లో అత్యుత్తమ ఆటగాళ్లు. కానీ ఇప్పుడు వాళ్ల గురించి చాలా చెడ్డగా మాట్లాడుకుంటున్నారు. ఇది కరెక్ట్ కాదు. భారత జట్టుకు వాళ్లిద్దరూ అందించిన సేవలు, గెలిపించిన ట్రోఫీలు, బాదిన పరుగులను మర్చిపోకూడదు. ఓడినంత మాత్రం ఇలా విమర్శిస్తే ఎలా? మన ఆటగాళ్లంతా నా ఫ్యామిలీ. వాళ్లకు సపోర్ట్ చేస్తూనే ఉంటా' అని యువరాజ్ వ్యాఖ్యానించాడు.వాళ్లే డిసైడ్ చేయాలి!ఆసీస్ చేతుల్లో భారత్ ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారని.. కానీ వాళ్ల కంటే ఎక్కువ బాధ టీమిండియా ప్లేయర్లకు ఉంటుందన్నాడు యువీ. భారత క్రికెట్‌కు ఏది బెస్ట్ అనేది జైషా, బీసీసీఐ పెద్దలు డిసైడ్ చేస్తారన్నాడు. ఫామ్‌లో లేడనే కారణంతో రోహిత్ టీమ్ నుంచి బయటకు రావడం, బెంచ్‌పై కూర్చోవడం మామూలు విషయం కాదన్నాడు. టీ20 వరల్డ్ కప్‌ను దేశానికి అందించిన కెప్టెన్.. టీమ్ కోసం ఈ పని చేయడం గొప్ప విషయమన్నాడు యువరాజ్. బీజీటీ ఓటమి కంటే కూడా న్యూజిలాండ్ చేతుల్లో వైట్‌వాష్ అవడం తీవ్రంగా బాధించిందని పేర్కొన్నాడు. ఆసీస్‌పై గత సిరీస్‌ల్లో గెలిచాం కాబట్టి.. ప్రస్తుత ఓటమిని భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదన్నాడు.

# సెలెక్షన్‌లో ప్రాంతీయ భేదాలు.. ఇదెక్కడి న్యాయం


భారత క్రికెట్‌లో ఉత్తరాది బోర్డుల హవా నడుస్తుండటం తెలిసిందే. ఎక్కువగా మహారాష్ట్ర, ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్‌కు చెందిన ఆటగాళ్లను టీమిండియాలోకి తీసుకుంటారనే అపప్రద ఎప్పటినుంచో ఉంది. ముఖ్యంగా ముంబై లాబీ బాగా పని చేస్తుందనే కామెంట్స్ వస్తుంటాయి. ఆ జోన్‌కు చెందిన ప్లేయర్లు ఫెయిలైనా టీమ్‌లో నుంచి తీసేయరని అంటుంటారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీ లాంటి సౌత్ స్టేట్స్ నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. నార్త్ హవాలో ఇక్కడి వారికి అన్యాయం జరుగుతోందని విమర్శలు వస్తుంటాయి. తాజాగా మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ దీనిపై రియాక్ట్ అయ్యాడు. టీమిండియా సెలెక్షన్‌లో ప్రాంతీయ భేదాలు ఉన్నాయని స్పష్టం చేశాడు. యంగ్ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ ఎంపికపై అతడు ఫైర్ అయ్యాడు.అప్పుడే తీసేసేవారు!'ఒకవేళ శుబ్‌మన్ గిల్ తమిళనాడు ఆటగాడైతే అతడ్ని ఎప్పుడో జట్టులో నుంచి తీసేసేవారు. అతడి గేమ్ బాగోలేదు. టీమిండియాకు ఆడుతున్నాడంటే ఎన్నో అంచనాలు ఉంటాయి. కానీ వాటిని అతడు అందుకోవడం లేదు. ఒక బ్యాటర్ పరుగులు చేయొచ్చు లేదా చేయకపోవచ్చు. కానీ పరుగులు చేయాలనే దాహం, కసి, తపన ఉండాలి. బౌలర్లను అలసిపోయేలా చేయాలి. వాళ్లను విసిగించాలి. బాల్ పాతబడే దాకా క్రీజులో పాతుకుపోవాలి. పరుగులు రాకపోయినా ఒక ఎండ్‌ను కాపాడుతూ సహచరులకు అండగా ఉండాలి. కానీ గిల్ ఆ పని చేయడం లేదు' అని



బద్రీనాథ్ విమర్శించాడు.గిల్ కాంట్రిబ్యూషన్ సున్నా!93.. గత మూడు టెస్టుల్లో కలిపి గిల్ చేసిన పరుగులు. ఇందులో అతడి బెస్ట్ స్కోరు 31. దీన్ని టార్గెట్ చేసుకొనీ బద్రీనాథ్ సీరియస్ అయ్యాడు. నేను నిలబడే పరుగుల వరద పారిస్తాను, నేను ఇలాడే ఆడతానంటూ గొప్పలు చెప్పడం కాదు.. ఏదైనా చేసి చూపించాలన్నాడు. ఫీల్డింగ్‌లోనూ అతడు పొడిచిందేమీ లేదని.. జట్టులో ఉండటం వేస్ట్ అని, అతడి కాంట్రిబ్యూషన్ సున్నా అంటూ ఫైర్ అయ్యాడు బద్రీనాథ్. ప్రాంతీయత, పాపులారిటీ ప్రకారం ఆటగాళ్ల సెలెక్షన్, కంటిన్యూయేషన్ ఉండొద్దని సూచించాడు. టాలెంట్ ఉన్న ప్లేయర్లు అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని.. వాళ్ల ప్రతిభను వృథా చేయొద్దని ఇన్‌డైరెక్ట్ కామెంట్స్ చేశాడు.

# హీరోయిన్‌తో ప్రేమలో పడిన గిల్.. ఎవరీ రిద్ధిమా

క్రికెటర్లకు సంబంధించిన ఏ విషయమైనా సోషల్ మీడియాలో ఇట్టే వైరల్ అయిపోతుంది. అందునా లవ్ లైఫ్, మ్యారేజ్ లాంటి ఇంట్రెస్టింగ్ స్టోరీస్ గురించి తెలుసుకోవాలని అభిమానులు బాగా ఆసక్తి చూపిస్తుంటారు. ప్లేయర్లు ఎవరితో ప్రేమాయణం నడిపిస్తున్నారు? ఎవర్ని పెళ్లాడబోతున్నారు? లాంటివి తెలుసుకోవాలని క్రికెట్ లవర్స్‌తో ఉత్సాహం ఎక్కువగా ఉంటుంది. అందుకే అలాంటి న్యూస్ బయటకు వస్తే తెగ వైరల్ అవుతుంది. అలాంటి ఓ వార్తే నెట్టింట చక్కర్లు కొడుతోంది. టీమిండియా యంగ్ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ ఓ హీరోయిన్‌తో ప్రేమలో పడ్డాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి.. ఎవరా అందాల భామ? వీళ్ల లవ్ స్టోరీ ఎంతవరకు వచ్చింది? లాంటి వివరాలు ఇప్పుడు చూద్దాం.ప్రముఖ మోడల్, హిందీ నటి రిద్ధిమా పండిట్‌తో గిల్ ప్రేమలో పడ్డాడని వినిపిస్తోంది. వీళ్లిద్దరూ చాన్నాళ్లుగా రిలేషన్‌లో ఉన్నారని బాలీవుడ్ వర్గాలు కోడై



కూస్తున్నాయి. త్వరలో ఈ జంట పెళ్లిపీటలు ఎక్కడం ఖాయమని సోషల్ మీడియాలో గాసిప్స్ వస్తున్నాయి. దీంతో గిల్-రిద్ధిమా మ్యారేజ్ ఖాయమని అంతా అనుకుంటున్నారు. ఈ తరుణంలో గిల్‌తో లవ్ అంటూ వస్తున్న పుకార్లపై రిద్ధిమా క్లారిటీ ఇచ్చింది. దీని గురించి ఏం చెప్పాలో తనకు అర్థం కావడం లేదని తెలిపింది. గిల్‌తో తన పెయిర్ బాగుంటుందని అనుకుంటున్నారని.. కానీ అతడితో తనకు అసలు పరిచయమే లేదని స్పష్టం చేసింది. గిల్‌ను ఇప్పటివరకు ఒక్కసారి కూడా కలవలేదని పేర్కొంది.పరిచయమే లేదు!'గిల్‌తో నాకు పరిచయమే లేదు. ఒక్కసారి కూడా అతడ్ని కలవలేదు. ఇలాంటి పుకార్లు ఎక్కడి నుంచి వస్తాయో నాకు అర్థం కావడం లేదు. మా ఇద్దరి మధ్య ఏదీ లేదు. కానీ గిల్ ఓ క్రికెటర్‌గా తెలుసు. అతడు టీమిండియా కోరుకుంటున్నా.

# 121 మీటర్ల సిక్స్.. బ్యాటరా.. రాక్షసుడా.. నీళ్లు తాగినంత ఈజీగా బాదేశాడు



100 మీటర్ల సిక్స్ కొట్టేందుకు చాలా మంది బ్యాటర్లు ఆపసోపాలు పడతారు. పర్ఫెక్ట్ టైమింగ్, రెట్టింపు బలంతో బాల్‌ను సరైన రీతిలో కొడితే గానీ అంతదూరం పోదు. అయితే ఓ బ్యాటర్ మాత్రం అమాంతం 121 మీటర్ల సిక్స్ కొట్టి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. నీళ్లు తాగినంత ఈజీగా బిగ్ సిక్స్ బాది ఆల్‌టైమ్ రికార్డు క్రియేట్ చేశాడు. ఆ తర్వాత కూడా భారీ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇది బిగ్‌బాష్ లీగ్‌లో చోటుచేసుకుంది. మరి.. క్రికెట్‌లో అత్యంత భారీ సిక్స్ కొట్టిన ఆ బ్యాటర్ ఎవరు? ఏ మ్యాచ్‌లో అతడు ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు? అనేది ఇప్పుడు చూద్దాం..అవాక్కయిన అభిమానులు!ఆస్ట్రేలియా మిడిలార్డర్ బ్యాటర్ హిల్టన్ కార్ట్‌రైట్ నమ్మశక్యం కాని ఫీట్‌ను అందుకున్నాడు. బీబీఎల్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ టీమ్‌కు ఆడుతున్న కార్ట్‌రైట్.. రెనెగేడ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 121 మీటర్ల భారీ సిక్స్ బాదాడు. రోజర్స్ అనే బౌలర్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ మూడో బంతికి అతడు ఈ అద్భుతం చేశాడు. ఆఫ్ సైడ్ వికెట్లకు దూరంగా పడిన బంతిని చక్కటి టైమింగ్‌తో లాంగాన్ దిశగా బలంగా కొట్టాడు. బాల్ వచ్చిన వేగానికి, అతడి టైమింగ్, బ్యాట్ స్పీడ్, బలం తోడవడంతో ఏకంగా 121 మీటర్ల దూరంలో వెళ్లి గ్యాలరీలోని ఆడియెన్స్ దగ్గర పడింది. దీంతో అంతా అవాక్కయ్యారు.అరుదైన క్లబ్‌లో..ఇంత భారీ సిక్స్ కొట్టావ్.. నువ్వు మామూలోడివి కాదు బాస్ అంటూ హిల్టన్ కార్ట్‌రైట్‌ను అంతా మెచ్చుకుంటున్నారు. 121 మీటర్ల దూరం వెళ్లడం అంటే మామూలు విషయం కాదు. క్రికెట్ హిస్టరీలో అత్యంత భారీ సిక్సుల్లో ఇదొకటిగా చెప్పొచ్చు. లాంగెస్ట్ సిక్సెస్ లిస్ట్‌లో కార్ట్‌రైట్ చోటు దక్కించుకున్నాడు. షాహిద్ అఫ్రిదీ (153 మీటర్ల సిక్స్), బ్రెట్ లీ (130 మీటర్లు), మార్టిన్ గప్టిల్ (127 మీటర్లు), లియామ్ లివింగ్‌స్టన్ (122 మీటర్లు), కోరె అండర్సన్ (122 మీటర్లు) ఈ లిస్ట్‌లో ముందంజలో ఉన్నారు. కార్ట్‌రైట్ సిక్స్ చూసిన నెటిజన్స్.. భలే షాట్ బాస్, నువ్వు గ్రేట్ అని మెచ్చుకుంటున్నారు.

# ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్.. రోహిత్‌కోహ్లీని ఆడిస్తారా.. ఆపేస్తారా..

టీమిండియాకు మూలస్తంభం లాంటి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కెరీర్‌లో ఫస్ట్ టైమ్ తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. దశాబ్ద కాలం నుంచి టీమ్ మొత్తం వీళ్ల భుజస్కంధాల మీదే నడుస్తోంది. ఇద్దరూ టన్నుల కొద్దీ పరుగులు బాది ఎన్నో కఠిన మ్యాచుల్లో జట్టును గెలిపించారు. కెప్టెన్స్‌గానూ టీమ్ మీద తమదైన ముద్ర వేశారు. అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదన్నట్లు.. టాప్ ప్లేయర్లుగా ఉన్న ఈ ఇద్దరూ ఇప్పుడు జట్టులో చోటు కోసం కష్టపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఇద్దరికీ టీమ్‌లో బెర్త్ కష్టంగా మారింది. ఇప్పటికే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీతో టెస్టుల్లో వీళ్ల కెరీర్ దాదాపుగా ముగిసిందనే స్పష్టత వచ్చేసింది. త్వరలో జరిగే ఇంగ్లండ్ సిరీస్‌తో వీరి వన్డే క్రికెట్ భవితవ్యం పైనా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మరి.. ఆ సిరీస్‌లో వీళ్లను ఆడిస్తారా? ఆపేస్తారా? అనేది ఇప్పుడు చూద్దాం..

బీజీటీతో నెల రోజుల పాటు విశ్రాంతి లేని క్రికెట్ ఆడిన భారత ఆటగాళ్లు ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నారు. మరో రెండు వారాల పాటు రెస్ట్‌లో మోడ్‌లో ఉంటారు. ఆ తర్వాత జనవరి 22 నుంచి మొదలయ్యే ఇంగ్లండ్ సిరీస్‌లో పార్టిసిపేట్ చేస్తారు. ముందుగా టీ20 సిరీస్, ఆ తర్వాత ఫిబ్రవరి ఫస్ట్ వీక్ నుంచి వన్డే సిరీస్ స్టార్ట్ కానుంది. అయితే ఈ సిరీస్‌లో రోహిత్-కోహ్లీ బరిలోకి దిగుతారా? అనేది ఆసక్తికరంగా మారింది. వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్‌లో జట్టు దారుణ ఓటములతో రోకో జోడీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. బ్యాటింగ్ ఫెయిల్యూర్‌తో వీళ్లను టీమ్‌లో నుంచి తీసేయాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.



ఆల్రెడీ సిడ్నీ టెస్ట్‌లో రోహిత్‌ను ఆడించలేదు. దీంతో వీళ్ల వన్డే కెరీర్ కూడా డేంజర్‌లో పడిందనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అందుకు తగ్గట్లే వన్డే టీమ్ గురించి బీసీసీఐ కొన్ని లీకులు కూడా వదిలింది.ఆడించాల్సిందే!చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను జస్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా ముందుకు నడిపిస్తాడు, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో హార్దిక్ పాండ్యా తాత్కాలిక సారథిగా ఉంటాడంటూ భారత బోర్డు నుంచి కొన్ని లీకులు బయటకు వచ్చాయి. ఇవి నిజమా? కాదా? తెలియదు. కానీ క్రికెట్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఇంగ్లండ్ సిరీస్‌లో రోహిత్-కోహ్లీని ఆడించరట. కానీ ఇందులో నిజం లేదనిపిస్తోంది. ఎందుకంటే ఈ ఇద్దరు స్టార్ల టెస్టు ఫెయిల్యూర్‌కు వన్డేలకు ముడిపెట్టలేం. అందునా వన్డేల్లో వీళ్లిద్దరూ ఎంత తోపు ఆటగాళ్లో అందరికీ తెలుసు. చాంపియన్స్ ట్రోఫీకి ఎక్కువ టైమ్ కూడా లేదు. కాబట్టి ఈ సమయంలో రోహిత్-కోహ్లీని తీసేస్తే బీసీసీఐ మీద, టీమిండియాపై వ్యతిరేకత పెరుగుతుంది. ఇంగ్లండ్ సిరీస్ పెర్ఫార్మెన్స్‌ను బట్టి చాంపియన్స్ ట్రోఫీలో రోకో జోడీని టీమ్‌లోకి తీసుకోవాలా? వద్దా? అనే క్లారిటీ వస్తుంది. అందుకే ఈ సిరీస్‌లో వీరిని ఆడిస్తారని అనలిస్టులు అంటున్నారు. ఇంగ్లండ్‌పై ఫెయిలైతే రోహిత్-కోహ్లీకి వేరే ఆప్షన్ ఉండదని.. రిటైర్మెంట్ ప్రకటించక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడొద్దు.. ఈసీబీని కోరిన ఇంగ్లండ్ ఎంపీలు



**లండన్:** ఫిబ్రవరిలో చాంపియన్స్ ట్రోఫీ జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీలో ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్ ఆడవద్దు అని ఇంగ్లండ్ రాజకీయవేత్తలు తీర్మానించారు. సుమారు 160 మంది నేతలు ఓ లేఖపై సంతకం చేశారు. మహిళల హక్కులపై ఆంక్షలు విధిస్తున్న తాలిబన్ ప్రభుత్వ ఆగడాలను అడ్డుకునేందుకు ఈ చర్య తీసుకోవాలని రాజకీయవేత్తలు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డును కోరారు. దీనిలో భాగంగానే ఫిబ్రవరి 26వ తేదీన లాహోర్‌లో ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లండ్ మధ్య జరిగే మ్యాచ్‌ను బహిష్కరించాలని కోరారు. 2021లో తాలిబన్లు అధికారం దక్కించుకున్న తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళల ప్రాతినిధ్యం పూర్తిగా తగ్గిపోయిందని, ఐసీసీ రూల్స్‌కు తగినట్లు ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు ఉండడం లేదన్నారు. పురుషుల క్రికెట్ జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడుతున్న నేపథ్యంలో.. ఆ మ్యాచ్‌ను బహిష్కరించాలని యూకే పార్లమెంట్‌లో తీర్మానించారు. లేబర్ పార్టీ ఎంపీ టోనియా ఆంటోనియాజ్ రాసిన లేఖపై మిగితా ఎంపీలు సంతకం చేశారు. ఈసీబీ చీఫ్ రిచర్డ్ గౌల్డ్‌కు ఆ లేఖను పంపారు.

# అడివిశేష్ జీ2 మిషన్‌లో జాయిన్ అయిన బేబిజాన్ నటి.. లొకేషన్ లుక్ వైరల్



టాలీవుడ్ యాక్టర్ అడివిశేష్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోతుంది టైటిల్ రోల్ పోషించిన గూఢచారి. ఈ ఫ్రాంఛైజీలో జీ2 కూడా వస్తుందని తెలిసిందే. మేజర్ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ ఇప్పటికే సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు.తాజాగా ఈ చిత్ర టీంలోకి బేబిజాన్ నటి వామికా గబ్బి వచ్చేసింది. మిషన్‌లో భాగంగా సూట్‌లో ఉన్న అడివిశేష్, వామికా ఈఫిల్ టవర్ ముందు కనిపిస్తుండటం తాజా లుక్‌లో చూడొచ్చు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన జీ2 ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై అంచనాలు పెంచుతోంది. అడివి శేష్‌ను సీక్వెల్‌లో స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో చూపిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్.ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.

# ఈ సంక్రాంతి చాలా స్పెషల్

'బెనిఫిట్ షోస్‌కీ, టికెట్ రేట్ల పెంపుకీ ఏపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విషయంలో సహకరిస్తే బావుంటుంది. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రిక్వెస్ట్ చేస్తా. తుది నిర్ణయం మాత్రం ప్రభుత్వానిదే.' అని ప్రముఖ నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. తెలంగాణలో ఇక టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్‌షోలు ఉండవని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా దిల్‌రాజు పై విధంగా స్పందించారు. ఆయన నిర్మించిన గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు సంక్రాంతి కానుకగా విడుదల కానున్నాయి.ఈ సందర్భంగా సోమవారం దిల్‌రాజు విలేకరులతో ముచ్చటించారు. 'నిర్మాణంలో సంతృప్తినిచ్చిన సినిమాలు కూడా పరిస్థితుల కారణంగా నష్టాలు తెచ్చిపెట్టాయి. బాగా ఆడాల్సిన వకీల్‌సాబ్‌కు కూడా కోవిడ్ వల్ల థియేటర్లు లేకుండా పోయాయ్. వారిసు, ఫ్యామిలీస్టార్ సినిమాలు డిజప్పాయింట్ చేశాయి. వీటిమధ్య ఊరటనిచ్చిన సినిమా 'బలగం' మాత్రమే. కెరీర్ పరంగా బ్రేక్ తీసుకోవాలని ఓ నెల రోజులు అమెరికా వెళ్లిపోయాను. . ఏదేమైనా సినిమా పరిశ్రమలో సక్సెస్ ఉంటేనే విలువ. అందుకే.. ఇక కథలపైనే శ్రద్ధ పెట్టాలని నిర్ణయించుకున్నా.' అని చెప్పారు దిల్‌రాజు. ఇంకా మాట్లాడుతూ ' 'గేమ్‌ఛేంజర్'లో మాస్ విజిల్స్ కొట్టే మూమెంట్స్ చాలా ఉంటాయి. శంకర్ సినిమాలో సందేశం, నా సినిమాల్లో విలువలు ఉంటాయని చిరంజీవిగారు ఓ సందర్భంలో అన్నారు.ఈ రెండూ 'గేమ్‌ఛేంజర్'లో ఉంటాయి. నాలుగున్నరేళ్ల ఎమోషన్స్‌కు నాలుగురోజుల్లో ఫలితం రానుంది. ఇక 'సంక్రాతికి వస్తున్నాం' సినిమాను ఆల్‌రెడీ అందరూ సూపర్‌హిట్ అంటున్నారు. ఈ బజ్‌కి కారణం దర్శకుడు అనిల్ రావిపూడి. కచ్చితంగా రానున్న గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు నా కమ్ బ్యాక్ ఫిల్మ్స్. నో డౌట్' అని నమ్మకం వెలిబుచ్చారు .



# 'స్క్విడ్ గేమ్'లో స్టార్ హీరోలు..!

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' ఈ కొరియన్ వెబ్‌సిరీస్ ఇప్పటికే రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హ్వాంగ్ డాగ్ హ్యూక్ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్‌లో డబ్బు కోసం సగటు మనిషి ఆడే నెత్తుటి ఆటను ఆసక్తికరంగా చూపించారు. ఆటలు ఆడేందుకు వచ్చిన 456 మందిని ఒక దీవికి తీసుకువెళ్లి అక్కడ చిన్నపిల్లలు ఆడుకునే రెడ్‌లైట్, గ్రీన్‌లైట్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహిస్తారు. అక్కడ వారంతా ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారు అనే కథాంశం ఆధారంగా వచ్చిన ఈ సిరీస్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.అయితే, ఈ 'స్క్విడ్ గేమ్'లో ఇండియన్ సినీ స్టార్స్ పాల్గొంటే ఎలా ఉంటుంది..? ఈ ఆలోచనతోనే ఓ నెటిజన్ ఏఐ సాయంతో వీడియోను రూపొందించారు. స్టార్ నటులు జూనియర్ ఎన్టీఆర్, దళపతి విజయ్, రజినీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, మోహన్‌లాల్, నాగార్జున, నాగచైతన్య, సూర్య, మహేశ్‌బాబు, ధనుష్, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్, ప్రభాస్, పవన్ కల్యాణ్, అజిత్, యష్, రామ్ చరణ్, దుల్కర్ సల్మాన్, రానా, హృతిక్ రోషన్ తదితరులు 'స్క్విడ్ గేమ్' సిరీస్‌లోని ఆటగాళ్ల దుస్తుల్లో కనిపించారు. 'స్క్విడ్ గేమ్ ఇండియా' పేరుతో విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.కాగా, ఈ ఫ్రాంచైజ్ నుంచి 2021లో సీజన్ 1 రాగా.. బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. రిలీజ్ అయిన కేవలం 28 రోజుల్లో ఈ సిరీస్‌ను ప్రపంచ వ్యాప్తంగా 11 కోట్ల మంది నెట్‌ఫ్లిక్స్ యూజర్లు చూశారు. సిరీస్‌లో వయొలెన్స్ ఎక్కువ ఉన్నప్పటికీ ప్రేక్షకులకు బాగానే చేరువైంది. ఇక గతేడాది డిసెంబర్‌లో 'స్క్విడ్ గేమ్ సీజన్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది.సీజన్ 1 కథ విషయానికి వస్తే.. జీవితంలో సర్వస్వం కోల్పోయిన 456 మందిని ఒక దీవికి తీసుకువెళ్లి అక్కడ చిన్నపిల్లలు ఆడుకునే రెడ్‌లైట్, గ్రీన్‌లైట్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహిస్తారు. మొత్తం ఆరు గేమ్స్ ఉన్న ఇందులో ఫస్ట్ గేమ్ గెలిచిన వారు సెకండ్ రౌండ్‌లోకి ఆ తర్వాత చివరగా వచ్చేవారికి 'స్క్విడ్ గేమ్' నిర్వహిస్తారు. అయితే ఫైనల్‌గా వచ్చేవాళ్లు మొత్తం డబ్బు గెలుచుకోవచ్చు. ఇక మొదటిరౌండ్ నుంచే ఎలిమినేషన్ అయిన వారిని నిర్వహాకులు చంపేస్తూ ఉంటారు. చూడడానికి చిన్నపిల్లల ఆటలు లాగ ఉన్న మొత్తం వయొలెన్స్ కనిపిస్తుంటుంది.ఈ సీజన్ 2 కథ విషయానికి వస్తే.. స్క్విడ్ గేమ్ రెండో సీజన్ ఆట ప్రారంభమవుతుంది. ఇందులో స్క్విడ్ గేమ్ ఫస్ట్ సీజన్ గెలిచిన అనంతరం అందులో జరుగుతున్న అన్యాయాలకు సంబంధించి ప్లేయర్ 456 (గి-హున్) కనిపెట్టాలని చూస్తాడు. ఈ క్రమంలోనే అతడికి జరిగిన సంఘటనలు ఏంటి. గి-హున్ మళ్లీ స్క్విడ్ గేమ్ ఎందుకు ఆడడానికి వెళ్లాడు అనేది తెలియాలంటే సీజన్ 2 చూడాల్సిందే.



# ఎన్టీఆర్ సినిమాలో మలయాళ స్టార్స్?



గోపీచంద్ 'రణం' సినిమాతో బిజూ మీనన్ తెలుగులో గుర్తింపు తెచ్చుకున్నారు. మలయాళ చిత్రం 'అయ్యప్పనుం కోషియుమ్' నటుడిగా బిజూ మీనన్ ఏంటో చెప్పింది. 'భీమ్లానాయక్'గా ఆ సినిమా తెలుగులో రీమేక్ అయితే.. బిజూ మీనన్ పాత్రను పవన్‌కల్యాణ్ పోషించారు. దీంతో తెలుగులో కూడా బీజూ మీనన్ పేరు బాగా వినపడింది. అలాగే టోవినో థామస్.ప్రస్తుతం మలయాళంలో మంచి క్రేజ్ ఉన్న యంగ్ హీరో. ఏడాదిన్నర క్రితం విడుదలైన ఆయన '2018' సినిమా తెలుగులోనూ బాగా ఆడింది. ఆ విధంగా వీరిద్దరూ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులే. ఇప్పుడు వీరి గురించి టాపిక్ దేనికంటే.. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ సినిమాలో వీరిద్దరూ భాగం కానున్నారు.టాలీవుడ్‌కీ తారక్, శాండల్‌వుడ్‌కి ప్రశాంత్‌నీల్, రుక్మిణీ వసంత్.. మల్లూవుడ్‌కి బీజూమీనన్, టోవినో థామస్.. మొత్తానికి అన్ని భాషల్లోని స్టార్స్‌నీ ఈ పానిండియా సినిమాతో ఏకం చేస్తున్నారు ప్రశాంత్‌నీల్. ముందుముందు ఈ ప్రాజెక్టులో ఇంకెందరు భాగం అవుతారో చూడాలి.

# నయనతార డాక్యుమెంటరీ వివాదంలో బిగ్ ట్విస్ట్.. కీలక ప్రకటన చేసిన చంద్రముఖి నిర్మాణ సంస్థ

లేడీ సూపర్ స్టార్ నయనతారకు చెందిన డాక్యుమెంటరీ వివాదంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. చంద్రముఖి నిర్మాతలు నయన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారంటూ నిన్నటి నుంచి తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను వాడుకున్నందుకు నయన్ సహా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు రూ.5 కోట్లు చెల్లించాలంటూ లీగల్ నోటీసులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలపై 'చంద్రముఖి' సినీ నిర్మాణ సంస్థ శివాజీ ప్రొడక్షన్స్ తాజాగా స్పందించింది.నయన్‌కు తాము ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని సదరు నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సినిమాలోని సన్నివేశాలను తమ పర్మిషన్ తీసుకొనే వినియోగించుకున్నారని స్పష్టం చేసింది. మొత్తం 17 సెకన్ల సన్నివేశాలను రౌడీ పిక్చర్స్ సంస్థ వాడుకోవచ్చని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు గతేడాది నవంబర్‌లో జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను మీడియాకు విడుదల చేసింది. ఈ ఎన్‌వోసీని మనోబాల విజయబాలన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.కాగా, ఈ డాక్యుమెంటరీ విషయంలో ఇప్పటికే నయన్ తమిళ స్టార్ ధనుష్ మధ్య వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. నయనతార పెళ్లితో పాటు ఆమె జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారు.ఆ క్లిప్పింగ్‌ను డాక్యుమెంటరీలో వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నయనతారకు లీగల్ నోటీసులు కూడా పంపారు. ఈ క్రమంలోనే ధనుష్‌ని లక్ష్యంగా చేసుకొని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. చట్టపరంగా తేల్చుకుంటానని తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళ చిత్ర మారింది.



# థాయ్‌లాండ్‌కు రజినీకాంత్.. లోకేశ్ కనగరాజ్ కూలీ నెక్స్ట్ షెడ్యూల్ చెప్పిన తలైవా



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. కాగా ఇవాళ తలైవా థాయ్‌లాండ్‌కు పయనమయ్యాడు. ఈ సందర్భంగా చెన్నై ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు తలైవా. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని చెప్పాడు. అంతేకాదు నెక్స్ట్ షెడ్యూల్ జనవరి 13న మొదలు కానుందని.. ఈ షెడ్యూల్ జనవరి 28 వరకు కొనసాగుతుందన్నాడు.ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలోఅమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించినట్టు వార్తలు వచ్చాయని తెలిసిందే. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్‌కు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు పవన్‌కల్యాణ్ ఆర్థిక సాయం

అమరావతి : గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి వెళ్తున్న ఇద్దరు అభిమానులు దుర్మరణం చెందడం పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 4న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారులో నిర్వహించిన గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు.కాకినాడకు చెందిన మణికంఠ, చరణ్ అనే ఇద్దరు అభిమానులు వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన పవన్ కల్యాణ్ రోడ్డు ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేస్తు మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున సహాయాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించి రూ. 5లక్షల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారు.



# ఆంధ్రాకు వెళ్తే సినిమా.. మన దగ్గరైతే తెల్ల కల్లు, మటన్.. హాట్ టాపిక్‌గా దిల్‌రాజు కామెంట్స్



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను లాంచ్ చేయగా మంచి స్పందన వస్తోంది.ఈ ఈవెంట్‌లో దిల్ రాజు చేసిన కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తెలుగు రాష్ట్రాల్లో సినీ జనాలు సినిమాలను ఏ స్థాయిలో ఆదరిస్తారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రత్యేకించి తెలంగాణలో భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా టాలెంట్ ఉన్న ప్రతీ నటీనటులు, టెక్నీషియన్లకు ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు.అయితే ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ.. 'మావోళ్లకు సినిమా కంటే.. మన దగ్గర సినిమాలు తక్కువ కాబట్టి మీ దగ్గర నుంచి రియాక్షన్ తక్కువ వస్తుందని మా డైరెక్టర్‌కు చెప్పా. ఆంధ్రాకు వెళ్తే సినిమాకు ఒక వైబ్ ఇస్తరు. మన దగ్గర అయితే తెల్ల కల్లు, మటన్‌కు వైబ్ ఇస్తమని (నవ్వుతూ)' అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

Edited,Printed,Published and Owend by Padakanti Venkateshwarlu,Printed at Daily Hindi Milap,#5-4-674,Kattelamandi,Hyderabad-500 001. Published at:6-3-4, Premnagar,Behind ASHOK MALL, Banjara Hills, Road#1, Hyderabad-500 034, Telangana. Editor : Padakanti Venkateshwarlu, (RNI TELTEL 2005/18007). e-mail : news9telangana@gmail.com. Office 040-2333 3349, 2333 3358, Cell 8331888861